# కొన్ని "తెలుగుదనాలతో" నా అనుభవాలు

- కట్టా గోపాలకృష్ణ మూర్తి

IOE Dept., University of Michigan

Ann Arbor, MI-48109-2117, USA

Email: katta_murty@umich.edu

web page: http://www-personal.engin. umich.edu/~murty/

**క్లుప్తంగా:** చిన్నప్పుడు నన్ను అందరూ గోపాలం అని పిలిచేవారు. నేను 1952లో నా 16వ ఏట బందరు హిందు కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసేంతవరకూ తెలుగు ప్రాంతాలు (అప్పటి కృష్ణా, గోదావరి, గుంటూరు జిల్లాలు) విడిచి బయట అడుగు పెట్టలేదు.

1952లో B.Sc (Honrs) చదవడానికి మద్రాసు వెళ్లడంతో నా ప్రవాసాంధ్ర జీవనం మొదలైంది. 1955లో M.Stat, చదవటానికి ISI (Indian Statistical Institute) కలకత్తాలో చేరాను. అది అయ్యాక ISI లో 1965 వరకూ ఉద్యోగం చేసి 1965లో Ph.D చెయ్యడానికి UCB (Universtiy of California, Berkeley) వెళ్లాను. 1968లో అది అయిపోయాక UM (University of Michigan, Ann Arbor) లో అధ్యాపకుడిగా చేరి కుటుంబసహితంగా అక్కడే స్థిరనివాసం ఏర్పరచుకున్నాను. ఉద్యోగ రీత్యా చాలా దేశాల్లో నివసించాను.

**తెలుగుదనం** అంటే తెలుగు వాళ్లు సాధారణంగా ఆచరించే పద్ధతులు, పాటించే ఆచారాలు, అలవాట్లు, వారి ప్రవర్తనలూ అని అర్థం. తెలుగువాడిగా, ప్రవాసాంధ్రుడిగా నేనెదుర్కొన్న కొన్ని తెలుగుదనాలతో నా అనుభవాలను గురించి ఈ వ్యాసంలో చర్చిస్తాను.

నా చిన్నతనంలో తెలుగు జాతిని "ముక్కోటి ఆంధ్రులు" అని వర్ణించేవారు. ఇప్పుడు తెలుగు వాళ్ల జనాభా దానికి రెట్టింపు పైనే ఉంటుంది. ఇంతమంది ఆచరించే పద్ధతులు ఒకే విధంగా ఉంటాయని చెప్పలేం. కానీ, నేను అనుభవించిన తెలుగుదనాలు ఇంకా సామాన్యంగా తెలుగు జాతిలో కనపడుతుంటాయని చెప్పవచ్చు.

**వార్నింగ్ :** ఈ వ్యాసంలో కొన్ని చోట్ల బూతు సామెతలు ఉన్నాయి. మీకు బూతు పదాలు చదవడం ఇష్టంలేకపోతే "బూతు" అనే మాట చూసినవెంటనే కొన్ని లైన్లు చూడకుండా కంటిని గెంతించండి.

# విషయసూచిక

1. చిన్ననాటి కొన్ని తెలుగుస్మృతులు
2. నా మొదటి సినిమా అనుభవం, తెరవెనుక జ్ఞానోదయం
3. తెలుగు పసికందుల ఆలనా పాలనా
4. కథలు చెప్పించుకోవడానికి తెలుగు పిల్లల ఉత్సాహం
5. తెలుగు మగపిల్లల బైసికిల్ వ్యామోహం
6. పల్నాడులో జొన్నల ప్రాముఖ్యం
7. నాకు తెలుగు సాహిత్యం గురించి నేర్పించిన టీచర్
8. తెలుగు పిల్లల్లో ఫస్ట్ రావాలనే స్పిరిట్
9. తెలుగు సువాసనలు
10. తెలుగువారి మతాలు
11. అతిమర్యాద
12. ఏ పైచదువు చదవాలి
13. కులగోత్రాలు కల్గించే ఇబ్బందులు
14. తెలుగువారికి ప్రీతిపాత్రమైన పేరిననెయ్యి, మీగడపెరుగూ, కాఫీ
15. నారిసెర్చి సబ్జెక్టుతో పరిచయం ఎలా జరిగింది.
16. ఒక బ్రిటీష్ - ఇండియన్ సైంటిస్టు తెలుగుదనం
17. ఏ అబ్బాయిని వరించాలీ
18. తెలుగువారిలో బాసిజం, నెపొటిజం
19. ఏ వధువును చేపట్టాలి
20. తెలుగు వనితల పుట్టింటి సంబంధాలు
21. కుటుంబంలో కొత్తకోడలి స్థానం
22. తెలుగుదాంపత్యాల ఆరోగ్యం
23. కళల పోషణ
24. పుకార్లని నమ్మి సమాజంలో వెదజల్లడం
25. అమెరికాలో కొన్ని కొత్తా, కొన్ని పాతా తెలుగుదనాలు

26. తెలుగు వంటలతో కొన్ని తెల్లఅమెరికన్ల అనుభవాలు
27. బాధ్యత ఎవరిదీ
28. ముసలితనంలో తల్లిదండ్రుల పోషణ
29. హంకాంగ్ లో ప్రవాసాంధ్రుల తెలుగుదనాలు
30. కొరియాలో ప్రవాసాంధ్రుల తెలుగుదనాలు
31. ఆసియా దేశాల్లో తెలుగురుచులు
32. కువైట్ లో తెలుగుదనం
33. తెలుగు నుడికారం, తెలుగుభాష చక్కదనం
34. తెలుగువారూ, పేకాటలూ
35. తెలుగువారూ, వ్యాయామాలూ
36. ఆరంభశూరత్వం
37. తెలుగు పేర్ల రామాయణం
38. ఇండియాలో అన్ని చోట్లా కనిపించే జుగుప్సాకరమైన కాలుష్యం.
39. నంజుకోవడానికి రకరకాల పొడులు వాడడం
40. శకునాలను చాలా పట్టింపుతో గమనించడం

చివరి మాటలు.

# 1. చిన్ననాటి కొన్ని తెలుగుస్మృతులు

నా చిన్నతనంలో మేము బందరులో ఉన్నప్పుడు మా ఇంటి వెనకాల బంగాళాపెంకు కప్పుతో ఒక వసారా ఉండేది. బంగళాపెంకులు గులాబీరంగులో నాటుపెంకుకన్నా అందంగా ఉంటాయి, కాని వాటికి బలం తక్కువ. గట్టిగా కొడితే విరిగిపోతాయి. దాన్ని సున్నితంగా మీటితే మాత్రం చాలా శ్రావ్యమైన శబ్దం వచ్చేది. వర్షం కురిసినప్పుడు వానబిందువులు చిటపటమంటూ బంగాళాపెంకుమీద పడడంవల్ల వినడానికి చాలా ఇంపైన శబ్దం వచ్చేది. వర్షం వచ్చినప్పుడల్లా నేను వసారాలో ఆ శబ్దాన్ని వింటూ కూర్చున్నేవాడిని. ఇప్పటికీ తెలుగు దేశంలో చాలా ఇళ్లకు బంగాళా పెంకు, జింకు, లేక సిమెంటు షీట్ల కప్పులతో ఉన్న వసారాలు కనపడ్తాయి. వర్షం కురిసినప్పుడు ఆ కప్పుపైపడే వాన బిందువుల చిటపటల చక్కటి సంగీతాన్ని ఆ వసారా మీద నుంచొని వినడం ***ఒక తెలుగుదనం.***

నా చిన్నతనమంతా బందరులోనూ, మా అమ్మ పుట్టిన ఊరైన పందిళ్లపల్లి గ్రామంలోనూ గడిచింది. ఈ రెండు ఊర్లలోనూ ముసలమ్మలు తాటిముంజెలనూ, ఎర్ర, నల్ల ఈతపళ్లనూ, ఉడకబెట్టిన తేగలనూ గంపల్లో పెట్టుకొని, ఆ గంపలను తలమీద మోస్తూ ఇంటింటికి తెచ్చి చాలా సరసమైన ధరలకు అమ్ముతుండేవారు.

ఒక అణాకు ఎన్నో ఈతపళ్లూ, తేగలూ వచ్చేవి. చిన్నతనంలో నేను ఎన్నో ఈతపళ్లు, తేగలూ తినేవాడిని. ఈతపళ్లూ, తేగలు తినడం ***తెలుగుదేశంలో నాచిన్నతనపు మరపురాని మధురస్మృతులు***. పైచదువులకని తెలుగుదేశం వదిలాక, ఇండియాలో గానీ, ఇతరదేశాల్లోగానీ ఆ ఈతపళ్లు, తేగలూ చూడలేదు.

తెలుగుదేశంలోగూడా ఈ రోజుల్లో ఇవి కనబడ్డం లేదు. ఇప్పుడు ఆ ముసలమ్మలతో బాటు, ఈతచెట్లూ, తేగలూ అంతరించినట్లున్నాయి. విపరీతంగా పెరిగిపోయిన మానవ జనాభా ఆ ఈతచెట్లజాతికి అంతిమశ్వాస(extinction) కలిగించిందనుకొంటా. పెరిగిపోతున్న మానవజనాభా ప్రపంచమంతటా ఇలానే ఎన్నో రకాల అద్భుతమైన చెట్లనూ, పొదలనూ,

జంతువులనూ నాశనం చేస్తోంది. ఇది చూస్తోంటే మానవజాతి బంగారుగుడ్లు పెట్టే పెంపుడు బాతులను చంపుకు తినేస్తున్నట్లనిపిస్తోంది.

## 2. నా మొదటి సినిమా అనుభవం, తెరవెనుక జ్ఞానోదయం

నా జీవితంలో మొట్టమొదటి సారి సినిమా చూశినప్పటిది చాలా వింతైన అనుభవం. అది నామనస్సులో చెరగని ముద్ర వేసుకుంది. అప్పుడు నావయస్సు ఎంతో తెలియదు. బహుశా నేను  అప్పుడు "ఎల్లకాలం ఊహాలోకంలో విహరించే 3,4 సంవత్సరాల పిల్లవాణ్ణి" అయి ఉండవచ్చునుకుంటాను. పసితనమంతా ఊహాలోకంలో గడపడం ***మానవజాతి ముఖ్యలక్షణం (పసి మానవదనం)*** గదా!

ఆ కాలంలో పర్మినెంటు బిల్డింగుల్లో సినిమా థియేటర్లు నగరంలో ఉండేవేమో నాకు తెలియదు కానీ, పల్లెటూర్లలో ఉండేవి కావు. పల్లెటూర్లకు అప్పుడప్పుడూ టూరింగు సినిమాలు వచ్చేవి. ఈ  టూరింగు సినిమా వాళ్ళు ఒక పల్లెటూరు వచ్చినప్పుడు ఊరిబయట మైదానంలో పెద్దడేరా వేశి, దానిలోపల సినిమా చూపించేవారు. వాటికి రెండేక్లాసులు టిక్కెట్లు ఉండేవి. తెరముందుది నేలక్లాసు, అక్కడ ప్రేక్షకులు ఇసుకనేలమీద కూర్చుంటారు. దానిపైన బెంచిక్లాసు ఉండేది. ఆ ఊర్లో  ప్రేక్షకుల సంఖ్య తగ్గిపోతే గుడారం ఎత్తేశి కంపెనీ వాళ్ళు ఇంకోఊరు వెళ్ళేవారు.

నా తల్లిదండ్రులు చీరాల దగ్గర పందిళ్ళపల్లి గ్రామంనుంచి వచ్చారు. నా చిన్నతనమంతా ఆ గ్రామంలోనే గడిచింది. తెల్లటి ఇసుకతిన్నెలతో, జీడిమామిడి, మామిడి, తమలపాకు, మిరపతోటలతో ఊరు చాలా బావుండేది. నేను మొదటిసారి సినిమా చూడడం ఆ ఊరులోనే ఒక టూరింగ్ సినిమా డేరాలో జరిగింది.

నా అనుభవాన్ని పూర్తిగా అవగాహన చేసుకోవడానికి, అప్పటి నా మనస్థితిని గురించి తెలుసుకోవడం అవసరం. దీనికి అప్పటి మా కుటుంబ పరిస్థితులను గురించి కొంత మీకు చెప్పాలి. దీనిలో కొన్ని ముఖ్యమైన తెలుగుదనాలు తెలుస్తాయి గూడా.

మా నాన్నగారు పుట్టకముందే మా తాతయ్య (నాన్నగారి తండ్రి) బొంబాయి దగ్గర బుసావల్ అనే ఊరులో ఏదో ఉద్యోగం సంపాదించి (బహుశా రైల్వేలో అయి ఉండవచ్చు,

ఇప్పుడు ఖచ్చితంగా ఎవ్వరూ చెప్పలేక పోతున్నారు) తన భార్య అయిన నా నాయనమ్మతో అక్కడకు వెళ్లాడట. ఉద్యోగంలో ఆయన చాలా చాలా డబ్బు గడించాడని నా చిన్నపుడు అందరూ చెప్పుకోగా పలుమార్లు విన్నాను. వాళ్ళు ఆ ఊరులో ఉండగానే మా నాన్నగారు పుట్టారు. కొన్ని సంవత్సరాల తర్వాత తాతయ్య, నాయనమ్మ, పసికందుతో మా ఊరు తిరిగి వచ్చేశారు. (దీనికి కారణం నాకు ఎవ్వరూ చెప్పలేక పోయారు. నేను పుట్టక ముందే తాతయ్య చనిపోయాడు). బయలుదేరేముందు, సంపాదించుకున్న డబ్బంతా ఏమి చెయ్యాలనే సమస్య, మా తాతయ్యకు కల్గింది. అక్కడ ఒక మహారాష్ట్రకుటుంబం, వాళ్ళకు చాలా ముఖ్య స్నేహితులుగా ఉండేవారు. ఆ మహారాష్ట్రా ఆయన వర్తకుడు. ఆయన మా తాతగారితో "ఈ డబ్బు నీతో తీసుకువెళ్ళితే ఎవరైనా దొంగిలించవచ్చు దారిలో. నీకు నచ్చితే కొంత నాకు అప్పుగా ఇవ్వు. నేను నీకు మంచి వడ్డీ ఇస్తాను. నువ్వు మీ ఊరు వెళ్ళి సెటిల్ అయ్యాక ఎప్పుడు కావాలంటే అప్పుడు నీకు డబ్బంతా పంపించేస్తాను" అన్నాడట. ఇంతకు ముందు ఎన్నోసార్లు చాలా సహాయం చేశినవాడు అవడం మూలాన ఆ మహారాష్ట్రా ఆయన్ని నమ్మి, కొంత డబ్బు అప్పుగా ఇచ్చి, మిగతాడబ్బుతో మా తాతగారు తిరిగివచ్చారట ఊరుకు.

తెచ్చుకున్న డబ్బూ, మహారాష్ట్రా ఆయన మనియార్డర్ లో పంపించే వడ్డీడబ్బుతో కొన్ని సంవత్సరాలు మా తాతగారి కుటుంబం దర్జాగా నివసించారట. కానీ కొన్నేళ్ళ తర్వాత మనియార్డర్లు రావడం మానేశాయి. కనుక్కోవడానికి బుసావల్ వెళ్ళితే మహారాష్ట్రా ఆయన "నాకు వ్యాపారంలో చాలా నష్టం వచ్చింది. ఇప్పుడు నీ డబ్బు ఇవ్వలేను. కొంత వ్యవధి ఇస్తే, నీ పూర్తి డబ్బు పంపించేస్తాను" అన్నాడట. ఉత్తిచేతులతో తిరిగి వచ్చాడు తాతయ్య. అప్పుడు కుటుంబం కష్టాలలో పడింది. ఆ డబ్బు రాబట్టుకోవడానికి తాపత్రయం చాలా సంవత్సరాలు సాగింది. నాచిన్నప్పుడు మా నాన్నగారు కూడా బుసావల్‌కి కొన్ని ట్రిపులు వేశారుగానీ ఫలితం లేకపోయింది. బుసావల్‌నుంచి ఉత్తి చేతులతో తిరిగివచ్చినప్పుడల్లా నాన్నగారు "ఆ దగుల్బాజీ మహారాష్ట్రా ఆయన్ను నమ్మి, మన డబ్బు వృధా చేశారు" అంటూ నాయనమ్మ మీద విసుక్కునేవారు. "ఏం చెయ్యం నాయనా, అక్కడ మాకు ఎవ్వరూ తెలియనప్పుడు ఆయన మమ్మల్ని చేరదీసి ఎంతో సహాయం చేశాడు. అందుకనే ఆయనను నమ్మాము" అని నాయనమ్మ చెప్పేది. నాన్నగారేమో "నల్లనివన్నీ నీళ్ళూ, తెల్లనివన్నీ పాలూ అని నమ్మకూడదని మీకు తెలియలేదా?" అనేవారు.

ఇలా చెమటోడ్చి సంపాదించుకున్న డబ్బు సద్వినియోగం కాకముందే పోగొట్టుకోవడం **ఒక సాధారణ తెలుగుదనం**. కొందరు, మోసగాళ్ళను నమ్మి పోగొట్టుకుంటారు, మరికొందరు దుర్వ్యసనాల మీద దుర్వినియోగం చేశి పోగొట్టుకుంటారు. రెండవకోవకు ఉదాహరణ మన తెలుగు మహాభారత గ్రంధాలన్నిటిలోనూ "ధర్మరాజు" అనే టైటిల్‌తో వ్యవహరించబడే యుధిష్టరుడి పాత్ర జూదవ్యసనం వల్ల రాజ్యాన్ని, భార్యను కూడా పోగొట్టుకోవడం. కనుక సంపాదనను అనుభవించే ముందు పోగోట్టుకోవడం **అనాది నుంచీ సాగుతున్న భారతీయదనం** అని చెప్పుకోవచ్చు.

ఇంతలో మా తాతగారు చనిపోవడంతో ఒక్కడే కొడుకైన మా నాన్నగారిని సాకి, పెద్దవాణ్ణి చెయ్యడానికి నాయనమ్మ ఎన్నో కష్టాలు పడింది. ఎలాగో మా నాన్నగారిని చదివించి, ఆయన్ను ఊరిలో మొట్టమొదటి B.A. పట్టభద్రుడుగా చేశింది. కానీ చాలా మంచిరోజులు చూశిన ఆవిడకు, మా నాన్నగారి గుమాస్తాజీతం గొప్ప తృప్తిని కల్గించలేదు.

నేను పుట్టేటప్పటికే మా నాయనమ్మ ముసలిదయిపోయింది. నా చిన్నప్పుడు "నువ్వుబాగా చదువుకొని తాతగారిలా గొప్ప ఉద్యోగం సంపాదించి కుటుంబాన్ని ఆదుకోవాలిరా" అంటుండేది.

మా కుటుంబం వాళ్ళు అన్నిదేవుళ్ళకూ, దేవతలకూ ప్రార్ధన చేశేవారు. మా నాయనమ్మకు మాత్రం కృష్ణుడంటే చాలా ఇష్టం. మా ఇంట్లో చాలా అందమైన మురళి వాయిస్తున్న కృష్ణుడి విగ్రహం ఉండేది. నాయనమ్మ ఎప్పుడూ ఆ విగ్రహానికి ప్రార్ధనలు చేస్తూ "నా మనవణ్ణి తాతగారంత గొప్పవాడిగా అయ్యేట్లు దీవించు తండ్రీ" అంటూ కోరుకునేది. అప్పటికే ముసలితనంతో ఆరోగ్యం క్షీణించి చాలా నొప్పులతో బాధపడుతుండేది మా నాయనమ్మ. అందుకనే తరచూ కృష్ణుణ్ణి తలచుకొని "నీ దర్శన భాగ్యం ఎప్పుడు కల్గిస్తావోగదా. త్వరలో నాకు ప్రత్యక్షమయ్యి నన్ను నీ దగ్గరకు తీసుకువెళ్ళు భగవాన్ " అనుకుంటూ ఉండేది. ముసలితనంలో, "నన్ను నీ దగ్గరకు త్వరగా తీసుకొనివెళ్లు స్వామి" అంటూ ప్రార్దించడం **వయస్సు మళ్ళినవారి సాధరణ తెలుగుదనం**. పరమేశ్వరుడికి ఆవిడ విన్నవంచుకునే ఈ కోర్కెలు నేను ఎన్నోసార్లు విన్నాను. నేనూ భగవంతుణ్ణి స్మరించి "మా నాయనమ్మ బాగయ్యేట్లు చూడు దేవుడా" అనుకుంటుండేవాణ్ణి.

ఇప్పుడు నా మొదటి సినిమా అనుభవం గురించి చెప్తాను. మా కుటుంబం అంతా ఆ

రాత్రి సినిమాకు వెళ్ళాం. మేము నేల క్లాసు టిక్కెట్లే తీసుకున్నాం. ఆ రాత్రి ప్రేక్షకులతో డేరా నిండిపోయింది. సినిమా పేరు గుర్తులేదు గానీ, నేను దాంట్లో పూర్తిగా లీనమయిపోయాను. తెరమీద కనపడుతున్నదంతా ప్రొజెక్టర్ నుండి వచ్చే కదిలే బొమ్మలనీ, నటననీ, నాకు తెలియదు గదా. అది నిజంగా నా కళ్ళముందు జరుగుతున్న విషయమేననేఊహలో నేనున్నాను. అప్పుడు కొంతసేపయ్యాక తెరమీదకు కృష్ణుడు మురళితో వచ్చి, ఎంతో శ్రావ్యంగా దాన్ని వాయించడం వినిపించి  నన్ను ముగ్థుణ్ణి  చేసింది. కొన్ని నిమిషాలు కృష్ణుణ్ణి చూశాక "నాయనమ్మా, అదిగో మనకు కృష్ణుడు  ప్రత్యక్షమయ్యాడు . మన ప్రార్థనలన్నీ ఫలించాయి నాయనమ్మా . నీ వరాలడుగు " అంటూ నుంచోని గట్టిగా అరవడం మొదలుపెట్టాను. నాయనమ్మ "కూర్చోబాబూ, అది నిజం కృష్ణుడు కాదు, ఉత్తిబొమ్మబాబు " అని చెప్పడానికి ప్రయత్నించింది. కానీ ఊహాలోకంలో ఉన్న నాకు అది అర్థం కాలేదు. "నాకు బాగా కనిపిస్తున్నాడే, నీ కెందుకు కనపడ్డం లేదు? అది నిజం కృష్ణుడే నాయనమ్మా" అంటూ నేను అరుస్తున్నాను. ఇంతలో మిగతా ప్రేక్షకులంతా "నిశ్శబ్దంగా కూర్చోకుర్రాడా" అంటూ గోల చేశారు. మా అమ్మ నన్ను బలవంతంగా లాగి కూర్చోబెట్టి నా నోటిని తన చేత్తో అదిమి మూశేశింది మాట్లాడడానికి వీలు లేకుండా. అంత స్పష్టంగా కనపడుతున్న కృష్ణుణ్ణి వీళ్ళంతా కాదంటారెందుకనో నాకు అప్పుడు అర్థంకానేలేదు. తెరమీద కృష్ణుడు కనపించినంతసేపూ నేను అమ్మ, నాయనమ్మలతో వాదిస్తూనే గడిపాను.

సినిమా చివరి సీను వచ్చేటప్పటికి మా నాన్నగారు, "అక్కడ కనపడేవన్నీ కదిలే బొమ్మలురా, కావాలంటే చూపెడ్తానురా" అంటూ ప్రేక్షకులముందు వ్రేలాడుతున్న తెర వెనకాలకు తీసుకు వెళ్ళారు. వెనకాల క్రొద్దిగా చీకటిగా ఉన్నా, తెరమీద కనపడిన వాళ్ళెవ్వరూ అక్కడ లేరని నాకు తెలిసిపోయింది. అప్పుడే, అవి కదిలే బొమ్మలే అని అర్థం అయ్యింది. నాన్నగారు అంటుండే "నల్లనివన్నీ నీళ్ళనీ, తెల్లనివన్నీ పాలనీ నమ్మగూడదు" అనే సామెత నిజం అర్థం నాకు బోధపడింది కూడా.

ఇలా జరిగింది నా చిన్నతనంలో నేను మర్చిపోలేని మొదటి సినిమా దర్శనం.

## 3. తెలుగు పసికందుల ఆలనా, పాలనా

ఈ మధ్య University of Michigan, అన్ఆర్బర్ మా డిపార్టుమెంటులో క్రిస్ అనే ఒక

తెల్ల టెక్నీషియన్ తన భార్య మొదటి సంతానంతో గర్భవతిగా ఉన్నప్పుడు వాళ్లిద్దరూ YMCA లో The Indian Method of Rearing Infants అనే కోర్సు తీసుకున్నామని చెప్పాడు. టీచర్ ఒక తెలుగావిడ అట. కోర్సు చాలా ఆసక్తికరంగా ఉందని చెప్పాడు. పసికందు మొదటి సంవత్సరంలోనే ఇంటి పెద్దలతో అనుబంధం ఏర్పరచడానికి తెలుగుదేశంలో ఏమి చేస్తారో ఆవిడ బోధించిందట ఆ కోర్సులో.

ప్రతి రోజూ పసికందుని స్నానం చేయించే పెద్దవారు కాళ్లు చాచి కూర్చుని, పసికందుని చాచిన కాళ్ళమీద పడుకోబెట్టుకొని, పిల్లలకథలు చెప్పడంగానీ, జోలపాటలు పాడడంగానీ చేస్తూ, చిన్ని చేతులనూ, కాళ్లనూ సున్నితంగా రుద్దుతూ, మర్దన చేస్తూ స్నానం చేయించడానికి ముందు కాసేపు గడపడం చాలా ముఖ్యమని ఆవిడ చెప్పిందట.

అతను ఇది చెప్తున్నప్పుడు, బందరులో నా చిన్నతనం రోజులు గుర్తుకి వచ్చాయి. నేను శిశువుగా ఉన్నప్పుడు జరిగిన విషయాలు గుర్తులేవుగానీ, నాతమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ శిశువులుగా ఉన్నప్పటి విషయాలు నాకు ఇంకాబాగా గుర్తు. ప్రతిరోజూ మా అమ్మగానీ, నాయనమ్మగానీ కాళ్ళుచాచుకుని కూర్చుని, శిశువుని కాళ్ళమీద పడుకోబెట్టి జోలపాడుతూనో, లేక ఏదో కబుర్లు చెప్తూనో, చిన్ని చేతులకూ, కాళ్ళకూ, మిగతా ఒంటికంతా నూనెరుద్ది, తర్వాత ముద్దగా చేశిన తడిసున్నిపిండి పేస్టు రాశి మర్దన చేస్తూ సాగదీసేవాళ్ళు. ఇది చాలాసేపు జరిగేది. దానితర్వాత ఒంటికి రాశిన ఆ సున్నిపిండిపేస్టు ఎండి, రుద్దడం వల్ల ... క గోరు వెచ్చని నీళ్ళతో స్నానం చేయ



ఇది జరుగుతున్నంతసేపూ, చేయిస్తున్న పెద్దవారు శిశువుతో ఏదో మాట్లాడుతూనే ఉండేవారు. శిశువు వారిమీద కన్నులు నిలిపి చూస్తూ, చాలా ఏకాగ్రతతో వింటుండేది. ఈ తతంగం ప్రతి రోజూ కనీసం గంటసేపయినా సాగేది. దీన్ని చూస్తున్న నాకే ఎంతో ఆసక్తికరంగా ఉండేది, ఆ శిశువుకి అంతకన్నా హాయిని కలిగించి ఉండాలి. ఆ టీచర్ చెప్పినట్లు ఈ తతంగం వల్ల శిశువుకీ, పెంచుతున్న పెద్ద వారికీ మంచి అనుబంధం ఏర్పడుతుంది.

ఆ టీచర్ సున్నిపిండిని గురించి చెప్పిందో లేదో తెలియదు గానీ, క్రిస్ భార్య పురుడు పోసుకున్నాక, ఒక సున్నుపిండి పాకెట్టు కానుకగా ఇచ్చి, అది ఎలా తయారు చేశి శిశువుకి మర్దన చెయ్యాలో చెప్పాను. ఈ కాలం అమెరికాలో శిశువుకి అలాంటి స్నానం ప్రతి దినం చేయించటం చాలా కష్టం కానీ, ప్రతి వారాంతం ఒక రోజు అలా వాళ్ళ అమ్మాయికి సున్నిపిండి స్నానం చేయించారట రెండు సంవత్సరాల వయస్సు వచ్చే వరకు. It was a lot of fun both for ourselves and our kid అని చెప్పాడు.

అతనికి సున్నిపిండి చాలా నచ్చింది. కనీసం నెలకొకరోజు సబ్బు వాడకుండా సున్నిపిండి రాసుకొని స్నానం చేయడం ఇతను అలవాటు చేసుకున్నాడు. నేను ఇండియా వెళ్ళినప్పుడల్లా ఇతనికి ఒక సున్నిపిండి పాకెట్టు కానుకగా తెస్తుంటాను.

నా చిన్నతనం మా ఇంట్లో పిల్లలను పెంచిన పద్ధతి ***గొప్ప తెలుగుదనం*** అని నేను అనుకుంటాను.

# 4. కథలు చెప్పించుకోవడానికి తెలుగు పిల్లల ఉత్సాహం

కథలు చెప్పమని పెద్దవారిని వేధించడం, ఎవ్వరైనా కథలు చెబుతున్నప్పుడు ఊకొడుతూ ఉత్సాహంతో వినడం ***తెలుగు పిల్లల విశిష్ట తెలుగుదనం***.

నాచిన్నప్పుడు మా అమ్మ, నాయనమ్మ మిగతా పెద్దవాళ్ళచేతా, నేను ఇలా కథలు చెప్పించుకొని వింటుండేవాడిని. మా నాన్నగారు ఎప్పుడూ ఆఫీసు పనుల్లో బిజీగా ఉండేవారు గనుక ఆయన మాకు ఎక్కువగా కథలు చెప్పినట్లు గుర్తులేదు కానీ, మిగతా పెద్దవారందరూ మాకు ఎన్నో కథలు చెప్పేవారు. రాత్రి పడుకోవడానికి ముందు, ప్రొద్దున్న నడకకు వెళ్ళేటప్పుడు, సాయంత్రం ఆడుకోవడానికి వెళ్ళేముందు, మధ్యాహ్నం భోజనం

చేసేటప్పుడు, ఇలా ఎప్పుడు వీలయ్యి, చెప్పే పెద్దవాళ్ళు దొరికితే అప్పుడు కథలు వింటుండే వాళ్ళం.

నా పసితనంలో విన్న కథలన్నిటిలోకీ ఒక కథ నామెదడులో మరుపురాని ముద్ర వేసుకొంది. ఆ కథ ఇప్పుడు చర్చిస్తాను. ముందు కథ చెప్తాను (ఈ కాలపరిస్థితులకనుగుణంగా ఉండడానికని కథలో "ఏడుగురు కుమారులు" సమాసాన్ని "ఇద్దరు కుమార్తెలు"గా మార్చాను).

"అనగనగా ఒకరాజు. ఆరాజుకు ఇద్దరు కుమార్తెలు. వాళ్ళిద్దరూ వేటకు వెళ్లి రెండు చేపలను పట్టుకున్నారు. వాటిని ఒక మైదానంలో ఎండ బెట్టారు. మరునాడు వచ్చి చూస్తే ఆ చేపలు అస్సలు ఎండలేదు. "చేపలూ, చేపలూ, మీరెందుకు ఎండలేదు?" అని వాటిని అడిగారు. "మాకు ఎండ తగలలేదు, అందుకనే మేము ఎండలేదు" అని చేపలు చెప్పాయి.

అప్పుడు రాజు గారి కుమార్తెలు ఎండను "ఎండా, ఎండా, నువ్వుచేపలకు ఎందుకు తగల్లేదు నిన్న?" అని అడిగారు. "గడ్డిదుబ్బు నన్ను తగలనీయకుండా అడ్డు వచ్చింది" అని ఎండ చెప్పింది.

అప్పుడు రాకుమార్తెలు గడ్డిదుబ్బుని "గడ్డిదుబ్బా, గడ్డిదుబ్బా, నువ్వు ఎండ చేపలకు తగలకుండా ఎందుకు అడ్డువచ్చావూ నిన్న?" అని అడిగారు. "పేదరాశి పెద్దమ్మ నన్ను కొయ్యలేదు. అందుకనే ఎండకు అడ్డు వచ్చాను." అని గడ్డిదుబ్బు చెప్పింది.

అప్పుడు రాజు గారి కుమార్తెలు పేదరాశి పెద్దమ్మదగ్గరకు వెళ్ళి "పేదరాశి పెద్దమ్మా, పేదరాశి పెద్దమ్మా, నువ్వు గడ్డిదుబ్బుని నిన్న ఎందుకు కొయ్యలేదు?" అని అడిగారు. " నిన్నంతా మాపాప ఏడుస్తూ కూర్చుంది. అందుకనే నేను గడ్డిదుబ్బుని కొయ్యలేక పోయాను" అని చెప్పింది పేదరాశి పెద్దమ్మ.

అప్పుడు రాకుమార్తెలు పాపను "పాపా, పాపా, నువ్వుఎందుకు ఏడ్చావు నిన్న" అని అడిగారు. " నన్ను చీమ కుట్టింది నిన్న. అందుకనే నేను ఏడ్చాను." అని పాప చెప్పింది.

అప్పుడు రాజుగారి కుమార్తెలు చీమదగ్గరకు వెళ్ళి " చీమా, చీమా, నువ్వు పాపను ఎందుకు కుట్టావు నిన్న" అని అడిగారు. " మరి నాబంగారు కూనలో వేలు పెడ్తే నేను కుట్టనా?" అంది చీమ.

కథ కంచికీ, మనమంటికీ.

ఇలా కథపూర్తి అవగానే, కథచెప్పే పెద్దవారు సర్వసాధారణంగా పిల్లల చంకలో

కితకితలు పెట్టి నవ్వించడం, ఆకార్యక్రమాన్ని కథకన్నా ఎక్కువగా వాళ్ళు ఆనందించడం జరిగేది.

ఈ కథ నేనువిన్న కథలన్నిటిలోకీ అత్యుత్తమమైనదని అనడానికి నా కారణాలు చెప్తాను.

"అనగనగా" అనేది ఇలాంటి పిల్లల కథలన్నిటికీ ఆదిసమాసం. ఈ సమాసం విన్నవెంటనే పిల్లలు, కథ మొదలవుతుందని తెలుసుకొని, ఆటలు ఆపేసి తమ ధ్యాసను కథవినడానికి మర్లిస్తారు. ఇలాంటి సమాసాన్నే కంప్యూటర్ సైన్సులో Begin Statement అంటారు.

"ఒక రాజుగారున్నారు, ఆయనకు ఇద్దరు కుమార్తెలు" అనే సమాచారంతో కథ మొదలవుతుంది. ఈ సమాచారం మీద కథ నిర్మాణం జరుగుతుందన్నమాట. గణిత శాస్త్రంలో ఇలాంటి సమాచారాన్నే Set of Axioms అంటారు. కంప్యూటర్ సైన్సులో అలాంటి సమాచారాన్ని "డేటా" అంటారు.

"కథకంచికీ మనమింటికీ" అనేది ఈ పిల్లలకథలకు ముగింపు వాక్యం. ఇలాంటి వాక్యాన్నే కంప్యూటర్ సైన్సులో termination statement అని పిలుస్తారు. ఈ వాక్యం విన్న వెంటనే పిల్లలకు కథ అయిపోయినట్లు తెలుస్తుంది.

"జరిగే ప్రతి దానికీ ఒక కారణం ఉంటుంది, అది కనుక్కోవడం చాలా ముఖ్యం" అనే సూత్రాన్ని పిల్లలకు నేర్పిస్తుంది ఈ కథ. ఇలా కారణాలు వెదుక్కుంటూ వెనక్కు పోతుంటే ప్రతి విషయం ఇంకోదానికి దారి తీస్తుంది. ఇలాకూలంకషంగా అన్వేషణ చేస్తే ఈ జరిగిన విషయాలన్నిటికీ మూల కారణం తెలుస్తుంది.

సైంటిస్టులు చేసే పరిశోధనలన్నీ ఇలానే జరుగుతుంటాయి. కనుక ఈకథ చిన్నపిల్లలకు శాస్త్రీయ విధానాన్ని గురించీ, తార్కికంగా ఆలోచించే విధానాన్ని గురించీ, deductive processని గురించీ బోధిస్తుంది. శాస్త్రజ్ఞాన సముపార్జనకైవాడే విధానాల్లో పిల్లలకు తర్ఫీదు ఇవ్వడానికి కూర్చిన మొదటి పాఠానికి ఇది మహా అద్భుతమైన కథ.

మేము ఆన్ఆర్బర్ లో నివసించడం మొదలుపెట్టినప్పుడు మాఅమ్మాయి వాణి ప్రతిరోజూ నేను సాయంత్రం యూనివర్శిటీ నుంచి ఇంటికి రాగానే ఒక కథ చెప్పమంటూ అడిగేది. "నాన్న గారిని ముందు డిన్నర్ తిననియ్యవే, అన్నం చల్లారిపోతుందీ" అని మాఆవిడ విసుక్కునేది.

కథకంచికీ మనమింటికీ అన్నతర్వాత కితకితలు పెట్టినప్పుడు దొర్లుకుంటూ

నవ్వుకోవడం వాణికి చాలా ఇష్టంగా ఉండేది. తనకు కథలెప్పుడూ తెలుగు లోనే చెప్పేవాణ్ణి. అందుకనే తనకు తెలుగు బాగా వచ్చింది.

ప్రక్క ఇళ్ళ తెల్ల పిల్లల స్నేహం అయ్యాక, వాళ్ళ గుంపుతో వచ్చి వాణి తన స్నేహితులకు కూడా నాకథ వినాలని ఉందనీ, అందరికీ ఇంగ్లీషులో చెప్పమనీ అడిగేది. అలా నాకథలు వినడం, అవి అయ్యాక కితకితలు పెట్టించుకోవడం వాణితో బాటు మాప్రక్క ఇంటి పిల్లలకు కూడా చాలా ఇష్టంగా ఉండేది. మాఇంట్లో ఎవ్వరూ ఇలా కథలు చెప్పరు అంటుండేవాళ్ళు ఆపిల్లలు.

పెద్దవాళ్ళు పిల్లలకు కథలు చెప్పి కితకితలు పెట్టి నవ్వించడం, పిల్లలు పెద్దవాళ్ళ చేత కథలు చెప్పించుకొని ఉత్సాహంగా ఊకొడుతూ వినడం, **తెలుగు జాతి వారి ముఖ్య లక్షణాలలో చాలా గొప్పది**.

# 5. తెలుగు మగపిల్లల బైసికిల్ వ్యామోహం

చిన్నప్పుడు నన్ను ఎక్కడికైనా తీసుకు వెళ్ళాల్సివస్తే మానాన్నగారు సైకిల్ ముందు బార్ మీద కూర్చోబెట్టుకుని తీసుకు వెళ్ళేవారు. అలా వెళ్తున్నప్పుడు క్రింద చూస్తే కంకర రాళ్ళతో చేశిన రోడ్డు ఎంతోవేగంతో ముందుకు సాగిపోతున్నట్లు కనపడేది. అలాసాగిపోతున్న రోడ్డును చూడ్డం ఎంతో ఇష్టంగా ఉండేది. కనుక ఇలాంటి ట్రిప్పుల కొరకు నేనెప్పుడూ ఎదురు చూస్తుండేవాడిని.

నాకు పది సంవత్సరాలప్పుడు మాఇంటి చుట్టుప్రక్కల మొగపిల్లలు అందరూ సైకిల్ త్రొక్కడం మొదలు పెట్టారు. నేను కూడా ప్రయత్నించాను గానీ, మాటిమాటికీ పడిపోయి దెబ్బలు తగలడంతో మానెయ్యాల్సి వచ్చేది.

ఇప్పుడంటే సైకిళ్ళు పెద్దా, చిన్నా సైజుల్లోనూ, రకరకాల గాడ్జెట్లతోనూ వస్తున్నాయి గానీ, ఆ కాలంలో ఒక్క ఎడల్టుసైజు బరువైన బైసికిలే ఉండేది మాఇంట్లో. నేను పొట్టి గనుక, సీటుపైన కూర్చుంటే క్రింద పెడల్ కాలికి అందేది కాదు. ఎన్ని సార్లు పడిపోయి దెబ్బలు తిన్నా మళ్ళీ మళ్ళీ ప్రయత్నించి కొన్ని నెలల్లో సీటుమీద ఎక్కకుండా పెడల్సు మీద నుంచొని త్రొక్కడం నేర్చుకున్నాను. చాలా రోజులు ఇలానే పెడల్స్ మీద నుంచొని సైకిల్ త్రొక్కేవాడిని. పిల్లలు పెడల్స్ మీదే నుంచొని సైకిల్ త్రొక్కడం ఒక్కతెలుగు దేశంలో

తప్పించి ప్రపంచంలో ఇంకెక్కడా కనిపించదనుకుంటాను. ***ఇది ఒక వింత తెలుగుదనం.***



ఇలా త్రొక్కగా, కొన్నాళ్ళకు సైకిల్ బాలన్సు చెయ్యడం బాగా అలవాటయ్యింది. అప్పటికి నా పొడువు



ర్చొని సైకిల్ త్రొక్కడం మొదలు పెట్టాను. దానితర్వాత మాఇంటికి షాపింగ్ అంతా నేనే చేసి సరుకులన్నీ సైకిల్ మీద వెళ్ళి తెచ్చేవాడిని. హాండిల్ బార్ కి రెండువైపులా సరుకులతో నిండుగా ఉన్న

గుడ్డసంచులు వ్రేలాడుతూ ఉన్న సైకిల్ త్రొక్కుతున్న పిల్లలను చూడడం **ఒక విశిష్ట తెలుగుదనం.**

ఆ రోజుల్లో సైకిల్ త్రొక్కడమంటే ఎంతో సరదాగా ఉండేది. సైకిల్ ఉంటేచాలు, ఎంతదూరమైనా వెళ్ళేవాడిని. సైకిల్ నా ముఖ్యవాహనంగా ఇలా చాలాసంవత్సరాలు గడిచాయి.

మ్రద్రాసు, కలకత్తా నగరాలలో ఉన్నప్పుడు అక్కడ రోడ్లమీద ట్రాఫిక్ మరీ ఎక్కువ గనుక సైకిల్ మీద వెళ్ళడం సేఫ్ కాదని ఆ నగరాల్లో బస్సుల మీద ప్రయాణం చేశేవాడిని, కానీ ఇంటికి శెలవల మీద వచ్చినప్పుడు రోజూ సైకిల్ వాడేవాడిని. అప్పుడు మా తమ్ముళ్ళుకూడా సైకిల్ త్రొక్కడం నేర్చుకున్నారు. మేము అద్దె సైకిళ్ళు తీసుకొని వాటి మీద దూర ప్రయాణాలకు కూడా వెళ్తుండేవాళ్ళం. సైకిళ్ళు అద్దెకిచ్చే బిజినెస్ కూడా **ఒక పత్యేక తెలుగుదనమని** చెప్పవచ్చు.

ఒక సారి నేను కలకత్తా నుంచి శెలవల మీద వచ్చినప్పుడు నేనూ, మా తమ్ముడూ విజయవాడ నుంచి నాగార్జునసాగరుకి వెళ్ళాం రెండు అద్దెసైకిళ్ళ మీద. విజయవాడ నుంచి నాగార్జునసాగర్ 120 మైళ్ళ దూరం. విజయవాడలో ప్రొద్దున బయల్దేరి సాయంత్రం పల్నాడుగుండా వెళ్తుండగా ఒక అనుకోని ప్రమాదం జరిగింది. అక్కడ అడ్డంగా రోడ్డు వెడల్పంతా పూర్తిగా పెద్ద గొయ్యి త్రవ్వి అలానే ఉంచేశారు. "రోడ్డు మీద గొయ్యి ఉంది జాగ్రత్త" అనే వార్నింగ్ ఏమీ పెట్టలేదు. ముందు వెళ్తున్న మా తమ్ముడి సైకిల్ గోతిలో పడిపోయి అతనికి చాలా దెబ్బలు తగిలి రక్తం కారడం మొదలెట్టింది. నేను మా తమ్ముడ్నీ, సైకిలునూ బయటకు తీశి ప్రక్కనే ఉన్న చిన్న పల్నాడు గ్రామానికి తీసుకువెళ్ళాను. "రోడ్డు మీద గోతులు రాబోతున్నాయి స్పీడు తగ్గించుకొని జాగ్రత్త పడండి" అంటూ ప్రయాణీకులకు హెచ్చరిక ఇచ్చే నోటీసును పెట్టకపోవడం **మనం సిగ్గు పడాల్సిన ఒక తెలుగుదనం.**

ఆ ఊరులో వసారాల మీద కుర్చోని పిచ్చిపాటీ మాట్లాడుకుంటున్న పెద్దవాళ్ళు మమ్మల్ని చూశి, వెంటనే మా తమ్ముణ్ణి ఊళ్ళో ఉన్న చిన్న క్లినిక్కి తీసుకు వెళ్ళారు. దాంట్లో, దెబ్బలు తగిలిన చోట శుభ్రం చేశి, టింక్చర్ వేశి కట్లు కట్టారు.

ఊరి పెద్దలు ఆరాత్రి మాకు విందు భోజనం ఏర్పాటు చేశారు. నేను కలకత్తాలో పని

చేస్తున్నానని తెలిసి ఆనగరం విశేషాలన్నీ నాచేత చెప్పించుకున్నారు. మేము ఇంతదూరం సైకిల్ ప్రయాణం తలపెట్టడం వాళ్ళకు చాలా ఆశ్చర్యం కల్గించింది. "బస్సుల్లో వెళ్ళి ఉండచ్చు గదా బాబూ!" అని అడిగారు. "సైకిల్ మీద వెళ్ళడం సరదాగా ఉంటుందని బయల్దేరామండీ" అని చెప్పాము

ఆ రాత్రికి అక్కడ స్కూలులో ఒక విశాలమైన గదిలో మాకు మంచాలు వేశి పడుకోడానికి వసతి కల్పించారు. మర్నాడు ఊరి పెద్దరైతు ఇంట్లో చక్కటి ఇడ్లీ, కొబ్బరి పచ్చడీ బ్రేక్ ఫాస్టు తిన్నాక మా తమ్ముడు తనకు బాగానే ఉందని చెప్పాడు. అప్పుడు ఊరిపెద్దల దీవెనలతో మేము మళ్ళీ నాగార్జునసాగర్ వైపు బయల్దేరాం. మాపై వాళ్ళు చూపించిన మర్యాద, ఆదరణా మన ***గ్రామాల్లో తగిలే చక్కటి తెలుగుదనమని*** చెప్పవచ్చు.

ఆ సాయంత్రానికి మేము నాగార్జునసాగర్ చేరుకున్నాం. అక్కడ రెండు రోజులు గెస్టు హౌసులో బసజేసి, అక్కడి విశేషాలన్నీ చూశి తిరుగు ప్రయాణం జాగ్రత్తగానే వచ్చేశాం.

Ph.D. విద్యార్థిగా బెర్క్లీ, కాలిఫోర్నియా వెళ్లినప్పుడు అక్కడా ఒక సైకిల్ సంపాదించాను. మేము యూనివర్శిటీ Married Student Housingలో ఉండే వాళ్ళం. అది యూనివర్శిటీకి 3 మైళ్ల దూరంలో ఉండేది. నేను రోజూ సైకిల్ మీదే వెళ్లి వచ్చేవాడిని. బెర్క్లీలో ఉన్న మూడు సంవత్సరాలూ గ్రోసరీ షాపింగ్ అంతా సైకిల్ మీదనే చేసేవాడిని. దూరంగా ఉండే డిపార్టుమెంట్‌స్టోర్స్ కి మాత్రం ఎవరైనా కారున్న స్నేహితులు, వాళ్ల కారులో వెల్లినప్పుడు, వాళ్లతో వైళ్తుండేవాళ్ళం. 3 సంవత్సరాలు బెర్క్లీలో ఉన్నాక నామొదటి కారు కొన్నాను. దాని తర్వాత నా బైసికిల్ వాడకం తగ్గింది.

ఇప్పుడు తెలుగుదేశంలోనే చాలామంది స్కూటర్లు, కార్లు కొనుక్కోవడం మొదలయ్యాక సైకిళ్ళ పాప్యులారిటీ తగ్గింది. కానీ ఇప్పటికీ పెద్ద నగరాలని వదిలి చిన్న పట్టణాలకూ, గ్రామాలకు వెళితే, అక్కడ పిల్లల సైకిల్ వ్యామోహం చూడవచ్చు. ***ఇది ఒక ప్రత్యేక తెలుగుదనం.***

మగపిల్లలకు ఇలా సైకిల్ వ్యామోహం ఎక్కువగానీ, ఎందుకనో చాలా తక్కువమంది ఆడపిల్లలు సైకిల్ త్రొక్కడం నేర్చుకుంటారు. ***కొంతమంది తెలుగు పెద్దలు ఆడపిల్లలను సైకిలు త్రొక్కనివ్వరు.***

నాకు ఇప్పటికీ సైకిలు త్రొక్కడమంటే చాలా సరదాగానీ నాతమ్ముళ్ళకు మాత్రం వాళ్ళు స్కూటర్లు కార్లు డ్రైవ్ చెయ్యడం మొదలుపెట్టాక వాళ్ళకు సైకిల్ త్రొక్కడం మీద ఉత్సాహం పూర్తిగా పోయింది. "కొత్తొక వింతా, పాతొక రోతా" అంటారు గదా.

# 6. పల్నాడులో జొన్నల ప్రాముఖ్యం

వెయ్యి సంవత్సరాల క్రితమే శ్రీనాథ మహాకవి పల్నాడు ప్రాంతంలో జొన్నల ప్రాముఖ్యాన్ని ఈ పద్యంలో వివరించారు.

జొన్న కలి, జొన్నయంబలి
జొన్నన్నము, జొన్న పిసరు, జొన్నలెతప్పన్
సన్నన్నము సున్న సుమీ
పన్నుగ పలనాటి సీమ ప్రజలందరికిన్.

ఇప్పటికీ పల్నాడు ప్రాంతం వారి భోజనాలలో జొన్న రొట్టెలు ప్రముఖంగా కన్పడి, పల్నాడు ప్రజలకీ జొన్నలకీ ఏదో అవినాభావ సంబంధం ఉందనిపిస్తుంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన తెలుగు వారికి జొన్నలతో చేశిన వంటకాలు అలనాడు శ్రీనాధుడికిలాగానే అస్సలు నచ్చవు. కానీ జొన్నరొట్టెలు ఆప్యాయంగా తినడం ***పల్నాటివారి తెలుగుదనం.***

ఈ విషయం గురించి పల్నాడులో విన్న ఒక ప్రాంతీయ జోక్ చెప్తాను:

పల్నాడులో ఒక దంపతులు వివాహం చేసుకున్నప్పటి నుంచీ సంతానం కొరకు కలలు కంటున్నారు. కానీ పాపం చాలా సంవత్సరాలు గడిచేంతవరకూ వాళ్ళ వాంఛ తీరలేదు. చివరకు 12 సంవత్సరాలయ్యాక ఆవిడ కడుపు కాశింది. గర్భం, పురుడూ మామూలుగానే సాగి ఆవిడ ఒక చక్కటి పిల్లవాడ్ని కనింది.

అబ్బాయిని అల్లారు ముద్దుగా పెంచింది. వాణ్ణి రోజూ స్నానం చేయించేటప్పుడు ఆవిడకు ఏదో అనుమానం కల్గి వేధించడం మొదలు పట్టింది. చివరకు వాడికి 4 సంవత్సరాలు వచ్చాక డాక్టరుని కలిశినప్పుడు ఆయనకు తన అనుమానం వ్యక్తపరిచింది. "డాక్టరుగారూ, మావాడి లింగం మరీ చిన్నదిగా ఉన్నట్లు నా కనిపిస్తోందండీ, దానికేదైనా మందియ్యండీ" అని అడిగింది. "దాన్ని గురించి ఏమీ దిగులు చెందమాకమ్మా, మీ అబ్బాయికి రోజూ జొన్నరొట్టె తినిపించు, త్వరలోనే మార్పు చూస్తావు" అని డాక్టరు చెప్పాడు.

ఆ రోజు సాయంత్రం ఆవిడ జొన్నరొట్టెలు చేశి, డిన్నర్ టేబిల్ మీద ఒక ప్లేటులో 12 రొట్టెలుంచింది. బయట ఆడుకొని లోపలికొచ్చినప్పుడు వాళ్ళబ్బాయి అవి చూశి, "థ్యాంక్సమ్మా, ఈ రొట్టెలన్నీ నాకే కదా చేశావు" అని అన్నాడు. "లేదు నాన్నా, దాంట్లో ఒకటి నీకు, మిగతావన్నీ మీనాన్నగారికి" అని చెప్పింది ఆవిడ!

# 7. నాకు తెలుగు సాహిత్యం గురించి నేర్పించిన టీచర్.

చిన్నప్పుడు మేము బందరు నక్కల తోటలో ఉండేటప్పుడు నాకు ఒక ముఖ్య స్నేహితుడుండేవాడు. ఇతని తల్లిదండ్రులు తమిళులు. వాళ్ళ ఇంట్లో తమిళంలోనే మాట్లాడుకునేవారు, కానీ బయట అందరితో చక్కటి తెలుగులో మాట్లడేవారు. ఇతను స్కూలులో తెలుగు కోర్సు తీసుకునే వాడు. నాకు సంస్కృతం నేర్చుకోవాలని గొప్ప అభిలాష ఉండేది, అందుకని తెలుగు బదులు సంస్కృతం కోర్సు తీసుకునే వాణ్ణి నేను. సంస్కృతం కోర్సులో చాలా తక్కువమంది విద్యార్థులుండేవారు. తెలుగు కోర్సు విద్యార్థులు మమ్మల్ని చూశి "యశ జ్ఞాన దయాసింధో, గొడదూకితే అదే సందో" శ్లోకం సరీగా నేర్చుకున్నావా లేదా?" అని ఎప్పుడూ ఎగతాళి చేస్తుండేవారు.

నా తమిళ స్నేహితుడికి తెలుగు పంతులుగారు చాలా నచ్చారు. ప్రతి రోజూ తను నేర్చుకున్న పద్యాలు, తెలుగు సాహిత్యం గురించి నాకు చెప్పేవాడు. తెలుగు సాహిత్యం గురించి నేను నేర్చుకున్నదంతా ఈ సంభాషణల గుండానే. అందువల్ల ఈ తమిళస్నేహితుడే నా తెలుగు టీచర్ అని చెప్పవచ్చు.

# 8. తెలుగు పిల్లల్లో ఫస్టు రావాలనే స్పిరిట్

తెలుగుదేశంలో తల్లిదండ్రులు పసితనంలోనే పిల్లలకు అన్నిటిలోనూ తామే ఫస్టు రావాలనే ఉత్సాహాన్ని కల్గిస్తుంటారు. ***ఇది ఒక ప్రత్యేక తెలుగుదనం.*** దీనివల్ల తెలుగుపిల్లల్లో చాలా మందికి ప్రతిదాంట్లోనూ ఫస్టు రావాలనే గాఢమైన కోర్కె ఉంటుంది.

నా తమిళక్లాస్మేటూ, నేనూ రోజూ కలిసి స్కూలుకు వెళ్తుండేవాళ్ళం. ఒక సంవత్సరం నేనూ నా తమిళస్నేహితుడు ఒక కెమిస్ట్రీకోర్సు కలిశి తీసుకున్నాం. ఆ కోర్సు midterm పరీక్షల్లో జరిగిన అనుభవం గురించి చెప్తాను:

క్లాసులో చాలామంది విధ్యార్థులుండడం మూలాన, పరీక్ష పేపర్లు దిద్దడానికి టీచరుకి టైము పట్టింది. ఒక రోజు క్లాసులో సగంమంది పేపర్లు తిరిగి ఇచ్చారు. దాంట్లో నా పేపరు వచ్చింది, నా స్నేహితుడిది రాలేదు. ఇచ్చినవాటిలో నాకు Highest grade (96%) వచ్చింది. ఇది నాకు చాలా గర్వాన్ని కల్గించింది. మేము ఇంటికి వెళ్తున్నప్పుడు నా స్నేహితుడు మిగతావాళ్ళతో అన్నాడు "గోపాలం తనకు 96% వచ్చిందని చాలా గర్వంగా ఉన్నాడు " అని.

మా అమ్మ వంటలన్నింట్లోనూ అప్పుడు నాకు బెల్లంపూరీలు చాలా నచ్చేవి. కానీ, అవి తను నోములునోచుకునే రోజుల్లోనే చేశేది. ఆ రోజు రాత్రి మాత్రం నాకు మంచి మార్కులు వచ్చినందువల్ల నాకు నచ్చిన బెల్లంపూరీలు చేశి పెట్టింది.

మరుసటిరోజు కెమిస్ట్రీ టీచర్ గారు నాస్నేహితుడి పేపరు తిరిగి ఇచ్చారు. అతనికి 100% వచ్చింది. అది చూచినప్పుడు క్రితం రోజు నా గర్వమంతా నీరుగారి పోయి, నేను 4 మార్కులు అనవసరంగా పోగొట్టుకున్నానని విచారం పట్టింది. నా ప్రాణమిత్రుడికి పరీక్షలో 100% వచ్చినందుకు సంతోషం కల్గడానికి బదులు అతని మీద అసూయే నన్ను వేధించసాగింది. ఇతరులు తనకన్నా బాగా ఉండడం చూస్తే అసూయచెందడం ***సాధారణమైన తెలుగుదనమని*** అందరూ అంటారుగదా!

క్లాసు తర్వాత టీచర్ గారు మా ఇద్దరినీ అభినందించి కెమిస్ట్రీరీసెర్చికి వెళ్ళమని ప్రోత్సాహించారు. అప్పుడుగానీ నా మనస్సు కుదుటబడలేదు. టీచర్లు బాగా మార్కులు వచ్చిన విద్యార్థులను అభినందించడం ***ఒక మంచి తెలుగుదనం.***

నా తల్లిదండ్రులు చాలావరకు నాకు పరీక్షల్లో వచ్చే మార్కులను గురించి పట్టించుకునేవారు కాదు. నన్ను చదువుకోమని అంతగా బలవంతం చేశేవారు కాదు. నా చదువు బాధ్యత నేనే స్వయంగా చూసుకోగలననే ధైర్యం వాళ్ళకుండేది. కనుక నా స్కూలు విషయాలు నాకే వదిలిపెట్టేవారు.

కొంతమంది తెలుగు తల్లిదండ్రులు మాత్రం చదువులో ఫస్టు రావాలని వాళ్ళ పిల్లల్ని చాలా ఒత్తిడి చేస్తుంటారు. మేము కైకలూరులో ఉన్నప్పుడు మా ప్రక్క ఇంట్లో ఒక కుటుంబం ఉండేవారు. వాళ్ళ పెద్దబ్బాయి స్కూలులో నాకు సీనియర్. వాళ్ళ నాన్నగారు ఎప్పుడూ అతన్ని ఆడుకోవడానికి బయటకు వెళ్ళనిచ్చేవారు కాదు. ఎందుకూ కాలం వృధా చెయ్యడం, ఇంకాసేపు చదువుకో అంటూ లోపలికి పంపించేస్తుండేవారు.

ఒకరోజు చెరువులో కాసేపు ఈతకొట్టి నేను ఇంటికి వచ్చినప్పుడు వాళ్ళ ఇంట్లో ఏదో రగడ జరుగుతున్నట్లు వినిపించింది. లోపలున్న ఆ అబ్బాయిమీద వాళ్ళనాన్న గారు ఏదో అరుస్తున్నారు. ఆరోజు అతని పరీక్ష పత్రాలు వచ్చాయట. ఒక పరీక్షలో అతనికి క్లాసులో రెండవగ్రేడు వచ్చిందట. నువ్వు సరీగ్గా చదివి ఉంటే నీకే ఫస్టుగ్రేడు వచ్చేదిగదా అని అతని నాన్నగారు సతాయిస్తున్నారు. ఏడుపు ముఖంతో కన్నీరుగార్చుకుంటూ ఆ అబ్బాయి నిశ్శబ్దంగా ఈయన సతాయింపు వింటున్నాడు. నాకు మాత్రం అప్పుడు నా కంటే పెద్దవాడయిన ఆ అబ్బాయి మీద చాలా జాలివేశింది.

మర్నాడు మామూలుగానే స్కూలుకి వెళ్ళాడు అతను, కానీ సాయంత్రం ఇంటికి తిరిగిరాలేదు. కాస్సేపు చూశి, వాళ్ళనాన్నగారు, మా నాన్నగారు, ఇంకొంతమంది పెద్దలు స్కూలు చుట్టూ, చెరువుల దగ్గరా వెదికి చీకటి పడ్డాక గానీ తిరిగిరాలేదు. విసుగెత్తి ఇంట్లోంచి పారిపోవడం మంచిపని చేశాడని నేను మనస్సులో అనుకున్నాను. కొన్ని రోజులతర్వాత కైకలూరు నుంచి నేను బందరు వెళ్ళిపోయాను. అంతవరకూ అతను తిరిగిరాలేదు. ఆ తర్వాత అతన్ని గురించి నాకేమీ తెలియలేదు. చిన్న వయస్సులోనే ధైర్యంచేసి ఇంట్లోంచి పారిపోయాడంటే, ఆ కుర్రవాడు వాళ్ళ నాన్నగారి సతాయింపుకి ఎంతో బాధపడి ఉండాలి.

# 9. తెలుగు సువానలు

నా చిన్నప్పుడు నక్కలతోటలో మాదొడ్డిలో మల్లెతీగలూ, సన్నజాజులూ, రాత్రికిరాణులూ, ఇంకా ఎన్నో రకాల పూలపాదులూ, తీగలూ పెరుగుతూండేవి. అన్నీ విరివిగా పువ్వులూ పూశేవి కూడా. అప్పుడు నక్కలతోట నగరం బయట కొత్తగా మొదలయిన పేట. ఇళ్ళు చాలా తక్కువ ఉండేవి. మురికినీటి కాలువలు అస్సలు లేవు. అందుకనే పాదులు పూశిన పువ్వులసువాసనలతో గాలి ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది. ఈ సువాసనలు నేను ఎంతో ఆనందించేవాడిని.

ఇప్పుడు తెలుగుదేశంలో పట్టణాలన్నీ జనాభా పెరిగిపోవడం మూలాన విపరీతమైన ట్రాఫిక్, అన్ని రోడ్లకిరువైపులా మురికి నీటి కాలువలతో కనపడ్తాయి. దుమ్ము, దుర్గంధాలతో నిండి ఉంటోంది గాలి ఈ పట్టణాలలో. ఇలాంటి చోట్ల పాదులు పువ్వులు పూశినా, వాటి సువాసన మనం తెలుసుకోలేము.

అయినా తెలుగువారు సన్నజాజి, మల్లెలాంటి సువాసనభరితమైన పువ్వులు పూశే పాదులను ఎంతో ఇష్టంగా పెంచుతుంటారు. దూరప్రాంతాల్లోనూ, చలిదేశాల్లోనూ ఉండే ప్రవాసాంధ్రులు కూడా ఎక్కడెక్కడో వెదికి మల్లెపాదులను సంపాదించి ఇంటి లోపల కుండీలోనైనా సరే పెంచుతుంటారు. మల్లెపాదుకీ, తెలుగు వారికి ఏదో అవినాభావ సంబంధం ఉండాలి, మల్లెపాదులను పెంచడం ***ఒక విశిష్ట తెలుగుదనం*** అని చెప్పవచ్చు.

తెలుగుదేశంలోనే కాదు, ఇండియా అంతటా జనాభా ఎక్కువవడం మూలాన, హాయిని కల్గించే పూలపాదులను పెంచుకోవాలనే ఉత్సాహం ఉన్నవాళ్ళకి కూడా అలాపెంచడానికి చోటు దొరకకపోవడం (స్థలాభావం) చూస్తూనే ఉన్నాం. ఇలా పెరిగిపోతున్న జనాభాను ఎలా కంట్రోల్ చెయ్యాలో ఎవ్వరికీ తెలియడం లేదు. ఇఖ ఏమి చెయ్యాలో తోచక బృహదారణ్యకోపనిషత్తులోని 3 చరణాల అద్భుత ప్రార్థనశ్లోకానికి ఈ క్రింది 4 వ చరణం కల్పించి నేను అప్పుడప్పుడూ ప్రార్థన చేస్తూంటాను.

అసతోమా సద్గమయ<br>
తమసోమా జ్యోతిర్గమయ<br>
మృత్యోర్మా మామృతంగమయ<br>
అధిక సంతానో మామితసంతానఃగమయ

ఒకసారి ఆన్‌ఆర్బర్ నుంచి నేను ఇండియా ట్రిప్పుమీద వచ్చినప్పుడు నాతో ఇటలీనుంచి అమెరికా వలసవచ్చిన ఒక దగ్గర స్నేహితుడు కూడా వచ్చాడు. అప్పుడు ఉత్తరాంచల్లో హిమాచల ప్రాంతాలను రెండు వారాలు మేము టూర్ చేశాం. దైవప్రార్థన చేశినప్పుడల్లా నేను "మానవ జనాభా తగ్గేట్లు చెయ్యి తండ్రీ" అని కోరుకుంటానని ఇతనికి తెలుసు. తను హిందువుకాకపోయినా, టూర్ లో తగిలిన గుడులన్నిటిలోనూ, కర్పూరం, మిగతా పూజా సామాగ్రితో " let us convey God your usual prayer" అంటూ పూజలు చేయించాడు.

జనాభా పెరగడం ఒక్క ఇండియాలోనే గాదు, ప్రపంమంతటా జరుగుతోంది. పుట్టుకలు, వలసలవల్ల నేను మెట్టిన అమెరికా దేశంలో కూడా జనాభా తెగ పెరిగిపోతోంది.

ఈ విషయం చర్చించినప్పుడు 2000 సంవత్సరంలో ప్రపంచమంతటా మారుమ్రోగిన ఒక వార్తను చెప్పుకోవాలి. వెనుకబడ్డ దేశాలన్నింటికీ ఎలా ప్రవర్తించాలో తెగ సుత్తికొడ్తుండే బ్రిటీషుదేశ ప్రధాని టోనీ బ్లెయిర్ తన కుటుంబంలో 4 వ సంతానాన్ని పుట్టించారు ఆ సంవత్సరం. "యధారాజా, తధాప్రజా" అంటారు గదా, పెద్ద పదవిలో ఉన్న ఆయన, తన ప్రజలకు ఆదర్శప్రాయంగా ఉండనందుకు నాకు విచారం కల్గింది.

"పెరుగుట విరుగుట కొరకే" అంటారు గదా, మానవజనాభాకి మాత్రం ఎప్పుడూ పెరగడమే గానీ, విరుగుడు ఉండేట్లు లేదు.

# 10. తెలుగువారి మతాలు

ఇండియాలో ఉన్నప్పుడే నాకు హిందూ, ఇస్లాం, క్రిష్టియన్ మతాలతో పరిచయం కల్గింది. ఆ పరిచయాలను గురించి చెప్తాను.

నక్కలతోటకు 2 మైళ్ళ దూరంలో చిలకలపూడిలో పెద్ద పాండురంగడి గుడి ఉండేది. నా చిన్నప్పుడు నేనూ, నా తమిళస్నేహితుడూ, 2, 3 రోజులకొకసారి ఆ గుడికి నడిచి వెళ్తుండేవాళ్ళం. ఆ గుడి కట్టించి నడుపుతున్న ఆయనను అంతా "తాతగారు" అని పిలుస్తుండేవారు. తాతగారి కుటుంబసభ్యులందరితోనూ మాకు పరిచయం కల్గింది. గుడికి వెళ్ళినప్పుడల్లా సాధారణంగా తాతగారి ఇంట్లో ఆగి అందర్నీ పలకరిస్తుండేవాళ్ళం మేము.

తాతగారి కుమారుడు ఒకాయన మరాఠీలో ఉన్న పాండురంగ విఠ్ఠలుడి భక్తుల చారిత్రక గ్రంథం తెలుగులోకి అనువాదం చేశే ప్రాజెక్టు మొదలు పెట్టారు. నేనూ, నా తమిళ స్నేహితుడూ, ఈయనకు, వినాయకుడు వ్యాసమహర్షికి మహాభారత రచనకు చేశిన సహాయం చేశాం. అంటే ఆయన మరాఠీ గ్రంధం చూస్తూ దాని తెలుగు అనువాదం ధారావాహినిగా చెప్తే, మేము దాన్ని వ్రాశామన్నమాట. ఈ ప్రాజెక్టుకి సలహాదారుడిగా మహారాష్ట్రలో పాండురంగడి గుడినుంచి ఒకాయన వచ్చి కొన్నాళ్ళు చిలకలపూడిలో ఉన్నాడు. మొదట్లో ఆయనకు తెలుగు రాదు, కానీ, త్వరలోనే నేర్చుకొని, మాతో హిందూమతంలోని గొప్ప అంశాలను గురించి చర్చిస్తూండేవాడు. వీటన్నిటివల్లా నాకు హిందూ మతాన్ని గురించీ, హిందూ పురాణగాధలూ, ఉపనిషత్తులను గురించీ మంచి జ్ఞానం కల్గింది.

గుళ్ళో తరచూ భజనలు జరుగుతుండేవి. వాటిలో మేము పాల్గొనే వాళ్ళం. భజన చేశేవారిలో కొందరికి ఉద్వేగం ఎక్కువయ్యి పూనకంలా వస్తూండేది. పూనకం వాళ్ళప్రవర్తనను మార్చేస్తుంది. కొంతమంది ఆపుకోలేని కన్నీరు కారుస్తారు. మరికొందరు భజనను గట్టిగా చెప్పేస్తూ ఒళ్ళు తెలియని స్థితిలో తల ఆడించేస్తారు.

ఇలా పూనకం వచ్చినవాళ్ళను అందరూ మెచ్చుకొని, "మీకు ఇవ్వాళ్ళ గొప్పఅనుభవం కల్గింది" అంటూ చెప్పేవాళ్ళు. నాకు కూడా అలాంటి అనుభవం కల్గి అందరి మెప్పుదల పొందాలనే కోర్కె నాకు ఉండేది. ఒకరోజు ప్రొద్దున భజన చేస్తున్నప్పుడు నాకూ పూనకంలా వచ్చింది. భజన చేస్తూనే జోరుగా కారే కన్నీరుతో ఆపలేని ఏడ్పు వచ్చేశింది. ఆ ప్రొద్దునంతా గుళ్ళో నేను ఏడుస్తూనే ఉన్నాను. అందరు నన్ను మెచ్చుకున్నారు ఆ రోజు. నా స్నేహితుడితో ఇంటికి నడిచేటప్పుడు నేనే ప్రపంచాన్నంతా జయించేస్తే కల్గేటంతటి గర్వం కల్గింది నాకు. అలాంటి పూనకం మళ్ళీ నాకు ఎప్పుడూ రాలేదు. నా స్నేహితుడికి పూనకం రావడం నేనెప్పుడూ చూడలేదు.

నక్కలతోటలో మా ఇంటి ప్రక్కనే ఒక సాయిబాబా గుడి ఉండేది. ఆరోజుల్లో మాకు దూరపు బంధువు ఒకాయన నక్కలతోటకు 10 మైళ్ళ దూరంలో ఒక చిన్న ఊర్లో నివశిస్తూ ఈ సాయిబాబా గుళ్ళో భజన చెయ్యడానికి వస్తుండేవాడు. భజన చేశినప్పుడు ఈయనకు ఎప్పుడూ మైకం వచ్చి చాలా జోరుగా చేశేవాడు.

నేను కలకత్తా ISI (Indian Statistical Institue)లో ఉద్యోగం చేస్తున్నప్పుడు మా కుటుంబానికి ఈ బంధువు భజనమైకం వల్ల దారుణమైన అనుభవం కల్గింది. అప్పటికే మా

కుటుంబం విజయవాడకు మారిపోయారు. కృష్ణానదిలో ఒక పడవమీద జరగబోయే భజన ప్రోగ్రాంకి వెళుతూ ఈ బంధువు దారిలో విజయవాడ మా ఇంట్లో ఆగాడట. ఆ భజనకు పదేళ్ళ నా చిన్నతమ్ముణ్ణి కూడా తనతో తీసుకు వెళ్ళాడట. పడవమీద జనం కిక్కిరిసి ఎక్కారట. వీళ్ళు  జోరుగా భజన చేస్తుండగా పడవ మునిగిపోయిందట. భజన మైకంలో ఆయన  మా తమ్ముణ్ణి రక్షించలేకపోయాడు గానీ, తను మాత్రం ఎలానో ఈదుకొని గట్టు క్షేమంగానే చేరుకున్నాడు. కొన్ని గంటల తర్వాత ప్రవాహవేగంలో కొట్టుకుపోయి మా తమ్ముడి శవం కొంత దూరం నదిదిగుదలలో కనపడితే ఇంటికి తీసుకు వచ్చారు. చివరి సంతానం గనుక వాడంటే మా అమ్మకు చాలప్రేమగా ఉండేది. తన సంతాపం తీర్చడానికి నెలరోజుల పైనే పట్టింది, కానీ ఇప్పటికీ అప్పుడప్పుడూ వాడిని తలచుకొని కన్నీరు కారుస్తూ ఉంటుంది మా అమ్మ. ఈ సంఘటన తర్వాత ఆ బంధువు మళ్ళీ మా ఇంటికి ఎప్పుడూ రాలేదు.

ఇఖ ఇస్లాం పరిచయం గురించి చెప్తాను. మద్రాసులో చదువుతున్నప్పుడు ఒక ముస్లిం క్లాసుమేటు నాకు చాల దగ్గర స్నేహితుడయ్యాడు. కలకత్తాలో ఉన్నప్పుడు కూడా ఒక ముస్లిం స్నేహితుడుండేవాడు. వీళ్ళనుంచి ఇస్లాం మతం గురించీ, కొరాన్ గురించి చాలా తెలుసుకున్నాను. తర్వాత డహరాన్, సౌదీఅరేబియాలో ఒక యూనివర్శిటీలో నేను ఒక సంవత్సరం గడిపాను. అక్కడ ఇంగ్లీషు వార్తా పత్రికలో ప్రతిరోజూ ఇస్లాంమతం మీద Question and Answer కాలమ్  వేశేవారు. దాని నుంచి గూడా ఇస్లాం యొక్క పవిత్ర గ్రంధాలను గురించి తెలుసుకున్నాను.

హిందూ, ఇస్లాం రెండు మతాల ముఖ్యోద్దేశం మానవులకు భగవత్ చింతన అలవరచి చివరకు మానవుడి ఆత్మ భగవంతుణ్ణి చేరేట్లు చేద్దామనే. ఈ రెండు మతాల్లో కొన్ని ఆచారాలు వేరుగా ఉండవచ్చు. హిందువులకు ముస్లింల ఆచారాలు కొన్ని, ముస్లింలకు హిందువుల ఆచారాలు కొన్ని వింతగా కనిపించవచ్చు. ఈ మాత్రానికే పోట్లాడుకోవాలా? "ఎవరి పిచ్చి వారికానందం" అనుకొని ఎవరి మానాన వాళ్ళు బ్రతకువచ్చు కదా! ఈ మతాల మధ్య బేధాలు చాలా స్వల్పం అని గ్రహించకుండా, తెలుగు దేశంలోనే కాకుండా, ఇండియా అంతటా తరచూ రెండు గుంపులూ కొట్లాడుకునే వరకూ వస్తోంది. ఇది **చాలా *విచారకరమైన తెలుగుదనం, భారతీయదనం.***

ఇఖ క్రిష్టియన్ మత పరిచయం గురించి చెప్తాను. నక్కలతోటలో నా చిన్నప్పుడు ఒక క్రిష్టియన్ మిషనరీ తెలుగావిడ మా ఇళ్ళకు వచ్చి క్రిష్టియన్ మతం గొప్పలు చెప్తూ ఉండేది. "మీ దేవుళ్ళు రాముడూ, కృష్ణుడూ, శివుడూ, పాండురంగడూ అంతా కల్తీ దేవుళ్ళు. మా క్రిష్టియన్ దేవుడొక్కడే అసలైన దేవుడు. మీరు మీ దేవుళ్ళనే పూజిస్తూ ఉంటే తప్పకుండా నరకానికి పోతారు. మిమ్మల్ని నరకం నుండి రక్షించడానికే ఏసుక్రీస్తు కృషి చేశి చనిపోయాడు" అంటూ బోధించేది. "నువ్వు చెప్పేది నిజమని నీకెలా తెలుసు, రుజువేమైనా ఉందా" అని మేము ప్రశ్నిస్తే, తెలుగులో ప్రచురించబడ్డ ఆ మత ప్రోపగాండా పుస్తకాలు కొన్ని చదవమని ఇచ్చేది. వీటినుంచీ, ఈవిడతో సంభాషణల నుంచీ క్రిష్టియానిటీ గురించి నేను కొంత తెలుసుకున్నాను. ఆ పుస్తకాలలో ప్రచురించబడినవి గనుక, తను చెప్పేవన్నీ పరమ సత్యాలని ఆవిడ వాదించేది. మేమేమో రాముడూ, కృష్ణుడూ దేవుడి అవతారాలేనని చెప్తున్న హిందూపురాణ పుస్తకాలు ఆవిడకు చూపించి వాదించేవాళ్ళం. కానీ ఆవిడ మనస్సు ఎంతకూ మారలేదు. విసుగెత్తి ఆవిడను అడిగాం "అమ్మా, నీ బోధన మూలంగా క్రిష్టియన్ మతానికి మారిన ప్రతిమనిషికీ నీకు ఎంతడబ్బు ముట్టుతుందీ?" అని, అప్పుడు తన మాటలు మేము నమ్మబోయేది లేదని ఆవిడ తెలుసుకున్నట్లుంది, ఆ తర్వాత మా ఇళ్ళకు రావడం మానేశింది.

ఇలా బోలెడు డబ్బు వ్యయం చేశి పెద్దఎత్తున ఇతర మతస్థులను తమ మతానికి మార్పించి ప్రపంచంలో తమ మతస్థుల సంఖ్య పెంచే ప్రయత్నం ఇప్పుడు రెండే రెండు మతాలు చేస్తున్నాయి: క్రిష్టియానిటీ, ఇస్లాం. ఈ రెండు మతాలు చేశే conversions మూలాన కొన్ని Native Cultures నాశనమయిపోతున్నాయి, అందుకని మత మార్పిడీ ప్రయత్నం నిషేధించాలి అని కొందరు వాదిస్తారు.

అదీకాక, ప్రపంచంలో అన్ని మతాల్లోకి తమ మతస్థుల సంఖ్య ఎలా అయినా ఎక్కువగా ఉండేట్లు చెయ్యాలి అనుకోవడం ఒకరకమైన Growth worshiping attitude and greedy behaviour. ఇలాంటి Growth attitude సర్వసాధారణంగా బిజినెస్ లో చూస్తాం. Growth కి ఈ మతాలు చేస్తున్న కృషి చాలావరకూ బిజినెస్ స్టయిల్లోనే ఉంటోంది. ఇలాంటి పేరాశ (Greed) మత మూలసూత్రాలకే వ్యతిరేకంగా ఉన్నా ఈ కృషి ఇంకా ఉధృతంగా సాగుతూనే ఉంది.

ఇతర మతస్థులను క్రిష్టియన్ మతానికి మార్పించడానికి ప్రయత్నించే మిషనరీలు అప్పుడప్పుడూ అమెరికాలో మాఇళ్ళకు వచ్చి మాట్లాడుతుంటారు. వీళ్ళతో ఒక

తెలుగుస్నేహితుడి అనుభవం గురించి చెప్తాను. తక్కువ వ్యవధిలో రెండుసార్లు ఇలా జరగడంతో అతను విసుగెత్తిపోయడు. మూడవసారి చాలా అందమైన ఇద్దరుయువతులు ఒక అదివారం మధ్యాహ్నం అతను బయట తోటలో పని చేసుకుంటూంటే పెద్దకారులోవచ్చారట. ఆ అనుభవాన్ని గురించి అతను ఇలా చెప్పాడు:

(వాతావరణం ; నిరుద్యోగసమస్య ; పెరిగిపోతున్నధరలూ, సంఘంలో అవినీతిని గురించి ఒకపావుగంట మాట్లాడాక)

యువతులు : మీది ఏమతం.

అతను : మేము హిందువులం.

యవతులు : మీరు ఇంకా ఆపాతకాలపు మతంలోనే ఉన్నారా!
చనిపోయాక స్వర్గానికి వెళ్ళాలంటే మీరు ఆధునికమైన క్రిష్టియన్ మతానికి మారండి?

అతను :మీరిద్దరూ స్వర్గానికి వెళ్తారా.

యువతులు : అవును మేము క్రిష్టియన్ మతానికి చాలా సేవచేస్తాం.
మాదేవుడు మమ్మల్ని స్వర్గానికి తీసుకువెళ్తాడు.

అతను : అలా అయితే మాకు స్వర్గం వద్దు, మాకు నరకానికే వెళ్ళాలని ఉంది!

హిందూమతంలో కులాలు ఉన్నట్లు క్రిష్టియానిటీలో చాలా శాఖలు ఉన్నాయి. మా ఇంటికి మీషనరీలు వచ్చినప్పుడు ఇలానే కొంతసేపు అవీ ఇవీ మాట్లాడాక, మీది ఏ మతం అని అడుగుతారు. అప్పుడు వాళ్ళ శాఖ ఏమిటో అడిగి కనుక్కొని, మేమూ క్రిష్టియన్లమే, మా శాఖ ఫలానా అని ఇంకో శాఖపేరు చెప్తుంటాను. దీంతో వాళ్ళు థాంక్సు చెప్పి నవ్వుకుంటూ వెళ్ళిపోతారు.

నేను తెలుసుకున్న విషయాలను బట్టి మనం మంచి ప్రవర్తనలు అనుకునేవి అన్ని మత గ్రంథాలలోను ఉంటాయి. అందుకనే కాబోలు మహాత్మాగాంధీగారు తను అన్ని మతాలకు చెందినవాడినే అని చెప్పుకునేవారు.

నేను మాత్రం అలాకాకుండా ప్రకృతి రక్షణ ముఖ్య సిద్ధాంతంగా పెట్టుకుని "

మూర్తిజం" అనే సొంత మతాన్ని కల్పించి దానిని అవలంభించడం మొదలు పెట్టాను. కనుక ఈ మధ్య ఎవరైనా నీది ఏమతం, నువ్వు హిందువువే కదా అని అడిగితే, "లేదు, నేను ఏమతానికీ చెందను, స్వయంగా కల్పించుకున్న మూర్తిజం అనే మతాన్నే నేను ప్రాక్టీస్ చేస్తాను" అని చెప్తుంటాను.

మహాత్మాగాంధీ గారు తరచూ అంతరాత్మ (conscience) ని గురించి మాట్లాడేవారు. ఏది ఒప్పో, ఏది తప్పో మీకు ఎలా తెలుస్తుంది అని అడిగితే, "నా అంతరాత్మే నాకు ధర్మబద్ధమైన మార్గాన్ని చూపిస్తుంది" అని చెప్పేవారు ఆయన. "అందరికీ అంతరాత్మ ఉంటుంది, మీకు ఏది చెయ్యాలో తెలియకపోతే మీ అంతరాత్మనడిగి తెలుసుకోండి" అని అందరికీ సలహా ఇచ్చేవారు.

మతాల పేరిట, దేవుళ్ళ పేరిట, హింసాకాండ జరగడం ఎన్నాళ్ళ నుంచో చూస్తున్నాం కదా. ఈ మధ్య ఈ గుంపులమధ్యనే కాక వివిధ జాతులమధ్య, దేశాలమధ్య పోరాటాలు చాల అమానుష్యంగా ఉంటున్నాయి. ఇవన్నీ చూస్తోంటే ఇప్పటి మనుష్యులకు అంతరాత్మలు నశించి పోయాయా అనిపిస్తుంది.

ఈ సందర్భంలో నిస్సహాయురాలైన ఇరాక్ దేశాన్ని వారి క్రూడ్ ఆయిల్ దోచుకోవడానికని ఏవో కల్లిబొల్లి సాకులు చెప్పి అమెరికన్లు ఆక్రమించుకున్నప్పుడు మా ఆవిడ వ్రాశిన రెండు పద్యాలు గుర్తుకు వస్తున్నాయి. అప్పుడు ఎన్నో చరిత్రాత్మకమైన సంపదలు ఇరాక్ నేషనల్ మ్యూజియం నుంచి దోచుకోబడ్డాయి. చేతులు, కాళ్ళూ పూర్తిగా కోల్పోయిన ఒక అంగవిహీన ఇరాక్ బాలుడి ఫొటో ప్రపంచపత్రికలన్నిటిలోనూ వేశారు. మా ఆవిడ మాంసాహారి. మొదటి పద్యం అమెరికా ప్రభుత్వానికి సందేశంగానూ, రెండవది దేవుడికి విన్నపంగానూ వ్రాశింది.

### **అధర్మ క్షేత్రే** (విజయ కట్టా)

1. అరాచకాన్ని అణుస్తానంటూ అరాచకాన్నే పెంచావా?
2. చరిత్ర కెక్కాలనుకొని చరిత్రనే చెరిపేశావా?
3. చరిత్రహీనుడా నీకు చరిత్ర విలువెలా అర్థం అవుతుంది?
4. అందలం ఎక్కాననుకోకు, ముందుంది ముసళ్ళ పండగ.

## న్యాయాన్యాయాలు (విజయ కట్టా)

1. కోట్లాది కోట్ల ప్రజల విలాపనలకంటే ఒక్క కరిరాజు విలాపానికే విలువెక్కువా ప్రభూ?
2. అంతర్యామినని అంతేలేకుండా పోయావా?
3. వామనావతారం బలిచక్రవర్తిగురించయితే మరి ఇప్పుడు ఏ అవతారంలేదా?
4. కలియుగమని కల్లిబొల్లి మాటలు కట్టిపెట్టు
5. కరుణామయా, మా కన్నీటి ప్రవాహంతో నీకాళ్ళు కడిగినా కరుణ చూపవా, నిన్ను అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తున్న మాకు అర్థమే లేకుండా పోయావా?
6. మతభేదాలను మరచి అన్ని దేవుళ్ళనూ ప్రార్థించినా పరమాత్మవు నీకు చేరలేదా, లేక మతంలో నీవే ఇరుక్కుపోయావా?
7. ముడితైలం కోసం ఒకరు కుటుంబాలనే మట్టిచేస్తూ అంగవిహీనుణ్ణి చేశిన బాలునిపై కురిపించే మా కరుణ హృదయాలకు జోహార్లు అంటున్నావా?
8. ఓ మాంసాహారీ, నా కన్ని ప్రాణాలూ సమానమేనని పరిహాసం చేస్తున్నావా?
9. ఆదిపురుషా, కర్తవు నీవే, కర్మవు నీవే, అంతా అంతటా నువ్వే అయితే అనాదిగా అమానుష్యం ఎందుకు ప్రబలుతోందీ?
10. మానవజాతి మంచిని పెంచు తండ్రీ, మానవసంఖ్యను కాదు
11. రామరాజ్యం కోరను, ధర్మరాజ్యం అడగను, శాంతిరాజ్యం చాలు, సమానత్వం చాలు

    ఓం శాంతి, శాంతి, శాంతి.

## అంతరాత్మ నశింపుకు ప్రాచీన కాలంలోనే నిదర్శనలు

అన్ని గ్రంథాల్లోకీ వేల సంవత్సరాల క్రితం రచించబడిన మహాభారతం నాకు చాలా నచ్చుతుంది. ఎన్నిసార్లు చదివినా ఇంకొకసారి చదవాలనిపించే గ్రంథం ఇది. ఇది కృష్ణపరమాత్ముడి చరిత్రగాథలా కాక, వ్యాసుడు అల్లిన అద్భుతమైన కథలాగనే పరిగణిస్తాను నేను. ప్రపంచంలో చూశే అన్ని రకాల మానవస్వభావాలు (మంచి, చెడు) వ్యాసుడు ఈ

గ్రంథంలో చిత్రీకరిస్తాడు.  ఇంత అద్భుతమైన గ్రంథాన్ని రచించినందుకు వ్యాసుడికి " ప్రపంచ సాహిత్యశిరోమణి" ఎవార్డు ఇవ్వవచ్చు.

మహాభారతంలో రెండు ముఖ్యపాత్రల ప్రవర్తన పరిశీలిస్తే ఆకాలంలోనే వారికి అంతరాత్మ ఉండేదా? అని సందేహం కలుగుతుంది.

వీటిలో మొదటి పాత్ర పంచపాండవులలో జ్యేష్టుడైన యుధిష్టరుడిది. యుధిష్టరుడు జూదంమీద తన వ్యసనం వల్ల తన కుటుంబానికంతా ఎన్నో ఇక్కట్లు కలిగించి కురుక్షేత్ర యుద్ధానికి ముఖ్యకారకుడయ్యాడు. అయినా, ఎప్పుడూ, ఎక్కడా తను చేసిన పనికి సంతాపాన్ని తెలియబరుస్తూ ఒక్క చిన్నమాటైనా తమ్ముళ్ళతోగానీ, భార్యతోగాని చెప్పినట్లు మహాభారత గ్రంథంలో నేనెక్కడా చూడలేదు. తను చేసిన పనికి కొద్దిగానైనా సిగ్గుపడినట్లు గోచరించదు. అదీకాక తను ఎంతో గొప్ప ధర్మరాజునని ఎప్పుడూ సొంత డబ్బా వాయించుకోవడమే కాక, తన తమ్ముళ్ళచేత కూడా వాయించుకున్నాడు. "నువ్వు చేసిన పని చాలా తప్పు పని" అని హెచ్చరించే అంతరాత్మ యుధిష్టరుడికి ఉండేదా అనే సందేహం రాక తప్పదు.

ఈ యుధిష్టరుడి పాత్రను గురించి ఇంకో విషయం చెప్తాను. ఇతనికి రెండు ఛాన్సులు వస్తాయి. మొదటిసారి జూదం ఆటలో రాజ్యాన్ని ఓడిపోయినప్పుడు పెద్దలు దాన్ని తిరిగి ఇప్పించేస్తారు. కానీ, మళ్ళీ వెంటనే రెండోసారి జూదం ఆడడానికి ఒప్పుకొని ఈసారి అన్నీ పోగొట్టుకుంటాడు. తప్పులు చెయ్యడం మానవసహజం అనుకోండి. కానీ, ఒకసారి చేశిన తప్పిదాన్నుంచి నేర్చుకోకపోవడం మూర్ఖుల లక్షణం. ఇలా చేసిన తప్పిదం నుంచి నేర్చుకోకపోవడం **సాధారణ భారతీయదనం**. దీనివల్ల వ్యాసుడు చిత్రీకరించిన యుధిష్టరుడి పాత్ర మనగౌరవానికి తగని అల్పవ్యక్తిదని నేననుకుంటాను. తెలుగులో ఉన్న మహాభారత గ్రంథాలన్నింటిలోనూ ఈ పాత్రను అసలు పేరైన యుధిష్టరుడు అని పిలువకుండా, ధర్మరాజు అని నిర్వచించడం, శోచనీయం.

రెండో పాత్ర బ్రాహ్మణ - క్షత్రియుడైన ద్రోణాచార్యుడిది. ఈ ద్రోణాచార్యుడు గొప్ప పరజాతిద్వేషి (racist), అహంకారం (egotism) గలవాడు. తనకు తెలిసిన విద్య శూద్రులకు నేర్పడానికి నిరాకరిస్తాడు. తను ఎప్పుడో ఆడిన మాట తప్పుతుందేమో అనే భయం వల్ల, స్వయంకృషితో విలువిద్య నేర్చుకున్న ఏకలవ్యుణ్ణి, అతని కుడిచేతిబొటనవ్రేలు కోశేశి గొప్పవాడైన తనకు కానుకగా ఇమ్మని కోరిన సిగ్గులేని అధముడు ఈ ద్రోణాచార్యుడు. బోయవాడైన ఏకలవ్యుడికి ఆ కుడిచేతి బొటనవేలు  ముఖ్య జీవనాధారమని తెలిసి కుడా ఈ

పనిచేసాడీ ద్రోణాధముడు. మహాభారత గ్రంథంలో అన్ని పాత్రల్లోకి పరమ తుచ్ఛమైన ప్రవర్తన కనిపించేది ద్రోణాచార్యుడి పాత్రలోనే. ఈ ద్రోణాచార్యుడికి అంతరాత్మ ఉండేదా అనే సందేహం చదువరులకు కల్గుతుంది.

కనుక అంతరాత్మ నాశనం ప్రాచీనకాలంలోనే మొదలయ్యి, ఇప్పుడు Epidemic stageకి చేరిందేమో అనిపిస్తుంది. అంతరాత్మ లేకపోవడం ***ఒక విచారకరమైన మానవదనం.***

# 11. అతిమర్యాద

నాచిన్నప్పుడు నక్కలతోట మాఇంట్లో ఒక రాజుగారి కుటుంబం అద్దెకుండేవారు. వాళ్ళు గోదావరి ప్రాంతం నుండి వచ్చారు. ఒకప్పుడు వాళ్ళబ్బాయిలతో వాళ్ళ ఊరు వెళ్ళాను. అప్పుడు తెల్లవారు ఝామున చేదతో బావినీళ్ళు తోడుకొని నేను స్నానం చేస్తుండగా ఒక పెద్దమనిషి బావి దగ్గరకు వచ్చి "చేదతో తమరి పని అయిపోయిందా అయ్యగారూ?" అని అడిగాడు. నేను చిన్నకుర్రాణ్ణి కదా, నన్నెవ్వరూ అంత గౌరవంగా పిలవలేదు అంతవరకూ. ఈ విషయం మాస్నేహితుడితో చెప్తే, వాళ్ళప్రాంతంలో అంతా ఆవిధమైన అతి మర్యాదతో ప్రవర్తిస్తారని అతను చెప్పాడు. దీన్ని గురించి అతను ఈ క్రింది జోక్ చెప్పాడు:

మా ప్రాంతంలో ఒక కుటుంబంలో భార్యకు చాలా సంవత్సరాలవరకూ గర్భం కలుగలేదు. కనుక ఒక రోజు డాక్టర్ పరీక్షతర్వాత ''నువ్వు ఇప్పుడు గర్భవతివమ్మా. 9 నెలల్లో నీ బిడ్డను ఎత్తుకోబోతున్నావు" అని చెప్పినప్పుడు ఆవిడ చాలా సంతోషించింది. దంపతులు పురుడు కొరకు ఎదురు చూశారు. 9 నెలలయిపోయినా పురుడు వచ్చేటట్లు కనపడలా. డాక్టరునడిగితే "బిడ్డలు వాళ్ళు తయారుగా ఉన్నప్పుడు వాళ్ళంతవాళ్ళే బయటకు వస్తారు. నీ గర్భం బాగానేసాగుతోంది. నీకు నొప్పులు మొదలయ్యేనప్పుడు రావమ్మా'' అని చెప్పింది.

పురుడు కొరకు ఆవిడ ఓపిగ్గా నిరీక్షిస్తోంది. నెలలూ, సంవత్సరాలూ గడచిపోతున్నాయి, కడుపు రోజురోజుకీ పెరుగుతూ చాలా పెద్దదయ్యింది. ఆవిణ్ణి చూడ్డానికి ఇతర ప్రాంతాలనుంచీ, దేశాలనుంచీ టూరిస్టులు మాప్రాంతం రావడం మొదలు పెట్టారు.

ఆగ్రా, పుట్టపర్తిలకన్నా మాప్రాంతానికి ఆవిడగర్భాన్ని చూడ్డానికి వచ్చే టూరిస్టులు ఎక్కువయ్యారు.

16 సంవత్సరాలు గడిచాయి. ఒకరోజు ఆవిడ భర్తతో "ఏమండీ, నేను ఈ బరువును ఇంక మోయలేనండీ, నన్ను డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్ళండీ" అని బతిమాలింది. ఆవిణ్ణి చూశి డాక్టరు ఆశ్చర్యపోయింది. వెంటనే సిజేరియన్ ఆపరేషన్ చేశి ఆవిడ గర్భాశయం తెరిచింది. దాంట్లో దృశ్యం డాక్టర్ కి చాలా విస్మయం కల్గించింది. ఇద్దరు గడ్డాలు పెరిగినయువకులు నుంచొని ఒకరికొకరు వంగివంగి సలాములు కొట్టుకుంటూ "తమరు ముందు వెళ్ళండీ", "తమరు ముందు వెళ్ళండీ" అంటూ వాదించుకుంటున్నారు!

**ఈ అతిమర్యాద ఆప్రాంతీయ తెలుగుదనం.**

# 12. ఏ పైచదువు చదవాలీ?

నా 17వ ఏట 1952లో బందరు హిందూకళాశాలలో ఇంటర్మీడియట్ చదువు పూర్తి చేశాక నేను ఏ పైచదువు చదవాలీ అనే క్లిష్ట సమస్యను మాకుటుంబం ఎదుర్కొన్నది. మాకుటుంబంలో అప్పటికే 5గురు పిల్లలు. మానాన్నగారిది చిన్న గుమస్తా ఉద్యోగం అవడం మూలాన జేష్టపుత్రుడినైన నేను మంచి చదువు చదివి, మంచి ఉద్యోగం సంపాదించి కుటుంబాన్ని ఆదుకుంటానని నాతల్లిదండ్రులు చాలా ఆశతో ఉన్నారు (ఆ విషయం స్పష్టంగా నాకు ఆ చిన్నవయస్సులోనే తెలిసి పోయింది).

నాక్లాసుమేట్సు కొంతమంది మెడిసిన్ చదవడానికి అప్లై చేశారు. కానీ నేను శాకాహారిని. మెడిసిన్ విద్యార్థులు తమపరిశోధనలకు కప్పల్నికోయ్యాలని తెలుసుకున్నాను. అమాయకమైన కప్పల్ని చదువు కోసమైనాసరే వధించడానికి నామనస్సు ఒప్పుకోలేదు. అందుకని మెడిసిన్ చదువు నాకు కాదని ఖచ్చితంగా చెప్పేశాను.

నాకు ఇంజనీరింగు చదవాలని ఘట్టికోరికగా ఉంది. కానీ మానాన్నగారికి ఎందుకనో నేను ఇంజనీరింగు చదవడం ఇష్టంలేదు. అప్పటికి కొన్ని నెలలక్రితమే మాఇంట్లో అద్దెకుంటున్న రాజుగారు మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజిలో హెడ్క్లర్కుగా ట్రాన్స్ ఫర్ అయి వెళ్ళిపోయారు (అప్పటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించలేదు). నేను ఏమి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందో సలహా ఇవ్వమని ఆయనకు ఉత్తరం వ్రాశారు మానాన్నగారు. ఆయన

వెంటనే " ఇక్కడ ప్రెసిడెన్సీ కాలేజిలో ఒక సంవత్సరం క్రితమే Statistics అనే కొత్తసబ్జక్టులో B.Sc(Hons) కోర్సు మొదలు పెట్టారు. ఈ కొత్తకోర్సు చదివిన వారికి అమోఘమైన భవిష్యత్తు ఉంటుందని అంతా అనుకుంటున్నారు. గోపాలం ఇది చదివితే బావుంటుంది. ఇక్కడ డిపార్టుమెంటులో ఒక ప్రొఫెసర్ తెలుగాయన నాకు తెలుసు. స్వయంగా మీరు వెంటనే గోపాలంను తీసుకొని వస్తే నేను ఆయనకు సిఫారసు చేశి సీటు ఇప్పించగలను'' అని జవాబు ఇచ్చారు.

Statistics అనే మాటకు నాకు అర్థం తెలియలేదు. డిక్షనరీ చూశాను గానీ దాని నుంచి ఆసబ్జెక్టు ఏమిటో అర్థంకాలేదు. క్లాసుమేట్సందరూ "గోపాలం నువ్వు ఏమిచదువుతావు?" అని అడిగేవారు. "మానాన్నగారు Statistics చదవమంటున్నారు'' అనిచెప్పాను వాళ్ళకి. '' Statistics అంటే ఏమిటీ, మేము ఎప్పుడూ వినలేదే?" అనేవారు. "నాకూ సరీగ్గా తెలియదు" అని చెప్పాల్సి వచ్చింది. ఈ శ్టాటిస్టిక్సు చదవాలని నాకు ఉత్సాహం లేదు. కానీ మానాన్న గారి మాటకు ఎదురు చెప్పే ధైర్యం లేదు అప్పుడు. ఇంట్లో ఎవ్వరికీ తెలియకుండా ఇంజనీరింగు కాలేజికి అప్లికేషన్ మాత్రం దాఖలా చేశాను.

మా మామయ్యలు చాలామంది అప్పటికే మద్రాసు నగరంలో సెటిల్ అయి ఉండేవారు. నాచిన్నతనం మూలాన మానాన్నగారు నన్ను స్వయంగా తనే తీసుకువెళ్ళితే మంచిదని నిశ్చయించారు. సరే మేము మద్రాసు చేరడం, రాజు గారి గుండా ఆ తెలుగు ప్రొఫెసర్ ని కలవడం తృటిలో జరిగిపోయాయి. ఆయన నా మార్కులు చూశి బాగా impress అయ్యారు "మీ అబ్బాయి పొట్టి. ఈ కోర్సులో విద్యార్థులు ప్రతివారం Facit Calculators వాడతారు. మీ అబ్బాయి ఆ కాలుక్యులేటర్ ని షెల్ఫునుంచి తీశి బెంచిమీద పెట్టగల్గితే సీటు ఇప్పిస్తాను" అన్నారు. అది చెయ్యగల్గినట్లు చూపించాను. ఆమధ్యహ్నమే ఫీజు కట్టి కోర్సులో చేర్పించారు.

ప్రెసిడెన్సీ కాలేజి ప్రక్కనే విక్టోరియాహాస్టల్ ఉంది. కానీ ఆ హాస్టలు చాలా ఖరీదవుతుందని చెప్పి మా నాన్నగారు నేను ఉండడానికి మా మామయ్య ఒకాయన ఎపార్టుమెంటులో ఎరేంజి చేశారు. ఆయన ఒంటరిగా ప్రెసిడెన్సీ కాలేజికి దూరంగా (రెండు బస్సులు మారాల్సి వచ్చేది) 2 గదుల ఎపార్టుమెంటులో ఉంటూ దగ్గర్లో ఒక పూటకూళ్ళమ్మ పెట్టే భోజనం తింటూ ఉండేవారు. నేను ఆయనకు రూమ్మేటుగా ఉంటూ, ఆ పూటకూళ్ళమ్మ దగ్గరే భోజనం చేస్తూ మొదటి సంవత్సరం ప్రెసిడెన్సీ కాలేజిలో చదివాను.

ఇలా మొదలయ్యింది నాఉన్నతవిద్యా, నాప్రవాసాంధ్ర జీవనం. దాని తర్వాత

తెలుగుదేశానికి నేను శలవల్లో విజిట్ కి వెళ్ళడమేగానీ, ఎక్కువ కాలం నివశించడానికి వెళ్ళడం ఇంతవరకూ జరగలేదు.

ఇంజనీరింగు కాలేజి నుంచి ఎడ్మిషను ఇంటర్వ్యూకి రమ్మని ఉత్తరం వచ్చినా, మా కుటుంబం వాళ్ళు దాన్నిగురించి నాకు చెప్పనే లేదు, నేను శ్టాటిస్టిక్సు చదివితేనే మంచిదనే నమ్మకంతో.

మొదట్లో శ్టాటిస్టిక్సు అంటే ఏమిటో తెలియక పోయినా, దానికి చాలా అప్లికేషన్లు ఉన్నాయని తెలుసుకొని నేను బాగా చదవగలిగాను. ఆ సంవత్సరం మాబాచ్ లో 12 మంది దక్షిణాది పలురాష్ట్రాలనుంచి వచ్చిన తెలివైన విద్యార్థుల మధ్య మెసలడం, మొదటి సంవత్సరం మామయ్య శిక్షణా నామనోవికాసానికి చాలా తోడ్పడ్డాయి. బస్సు ప్రయాణానికి చాలా టైము అవుతోందని మొదటి సంవత్సరం తర్వాత మానాన్న గారు నన్ను విక్టోరియాహాస్టల్లో ఉండే ఏర్పాటు చేశారు.

ఈ శ్టాటిస్టిక్సు, ఆపరేషన్స్ రిసర్చి అనే ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ సబ్జెక్టుకి అవసరమైన prerequisite. శ్టాటిస్టిక్సు చదివాక ఆపరేషన్స్ రిసెర్చికి నా అంతట నేనే మారిపోయి, చివరకు ఇంజనీరు అవ్వాలనే నాస్వప్నవాంఛ తీర్చుకోగల్గాను. కనుక నాసొంత విషయంలో మానాన్నగారు నా పైచదువును గురించి తీసుకున్న నాచిన్నప్పటి నిశ్చయం, అప్పట్లో నాకు నచ్చినది కాకపోయినా, చాలా గొప్పనిశ్చయం అయ్యింది.

కొంత మందికి మాత్రం పైచదువును గురించి తల్లిదండ్రులు చేసిన నిశ్చయాలు పనిచేయకపోవచ్చు. మామయ్యల్లో ఒకాయన వాళ్ళ పెద్దబ్బాయినీ బలవంతంగా మెడిసన్లో చేర్పించారు అతను ససేమిరా వద్దంటున్నా. ఆనిశ్చయం చివరకు ఆఅబ్బాయి ఆత్మహత్య చేసుకోవడం వరకూ వెళ్ళింది. పాపం.

# 13. కుల గోత్రాలు కల్గించే ఇబ్బందులు.

మద్రాసు ప్రెసిడెన్సీకాలేజిలో చదువు మొదలు పెట్టిన రోజుల్లో అక్కడ మేథమేటిక్సు చదువుతున్న ఒక తెలుగు విద్యార్థితో నాకు స్నేహం కుదిరింది. కొన్నినెలల్లో మేము గాఢమిత్రులమయ్యాం. వాళ్ళ నాన్న గారు కొన్ని సంవత్సరాలక్రితం మరణించారు, కనుక అతను వాళ్ళ అమ్మగారితో ఎపార్టుమెంటులో నివసించేవాడు. నేను తరచూ వాళ్ళ

అపార్టుమెంటుకు వెళ్తుండేవాడిని. ఒక సారి వాళ్ళనాన్నగారి శ్రాద్ధం రోజున వాళ్ళ ఇంట్లో జరగబోతున్న పూజకు, దాని తర్వాత ఉండే భోజనానికీ నన్నురమ్మని చెప్పాడు. ఈ పూజ యొక్క సార్ధక్యం చెప్పి, నువ్వు ఫలానా కులస్థుడవని అనుకుంటున్నాను, నిజమే కదా అని అడిగాడు. మాది ఆకులం కాదు, వేరేది అంటూ మాకులం ఏమిటో చెప్పాను. అప్పుడతను "సారీ వోయ్, అలా అయితే దీనికి కుదరదు, నిన్ను ఇంకో రోజున భోజనానికి పిలుస్తాలే" అన్నాడు.

ఆ రోజుతో మాస్నేహం అంతంఅయిందనే చెప్పవచ్చు. దారిలో ఎదురైనప్పుడు "హలో" చెప్పుకోవడం తప్పించి, నాతో కలిశి ఉండడానికి తర్వాత ఎప్పుడూ ముందుకు రాలేదు అతను.

ఆ రోజే నాకు కులాలు కల్గించే సమస్యలను గురించి కనువిప్పు జరిగింది. అప్పుడే నిశ్చయించుకున్నాను, ఇఖ నాకులాన్ని మర్చిపోవడం మంచిదని. ఆతర్వాత ఎవ్వరైనా మీది ఏకులం అనిఅడిగితే, తిరిగి మీది ఏకులం అని అడిగి, వాళ్ళు చెప్పాక, మా కులం కూడా అదే అని చెప్పడం నేర్చుకున్నాను.

పట్టింపులూ, మత, కుల ద్వేషాలూ, ఈర్షలూ, జాత్యహాంకారాలూ, జాతకాల మీద గట్టినమ్మకలూ; తెలుగు దేశంలో నివసించేవారిలోనే కాక చాలామంది ప్రవాసాంధ్రులో కూడా ఇంకా వర్ధిల్లుతున్నాయి. ఒక మనిషి విలువను అతని/ఆమె మతం, కులం, గోత్రం, హోదా, చర్మంరంగు, జాతకం, బట్టి కట్టడం అనాదికాలంనుంచే కాక, ఇంకా జోరుగా నడుస్తున్న ***క్షమించరాని తెలుగుదనం***.

# 14. తెలుగువారికి ప్రీతిపాత్రమైన పేరినెయ్యి, మీగడపెరుగు, కాఫీలు.

ఆవిర్లు గక్కుతున్న వేడివేడి అన్నం, కొత్తఆవకాయ పచ్చడీ, కందిపప్పుతో చేసిన ముద్దపప్పు, పేరిననెయ్యితో కలుపు కొని తినడం తెలుగు వారికి చాలా ఇష్టం. ఇలా తినడం ***ఒక విశిష్ట తెలుగుదనం.***

ఎవరికైనా గొప్ప అదృష్టకరమైన సంఘటన జరిగితే "నీ రొట్టె విరిగి నేతిలో పడిందిలే"

అని అభినందించుతారు తెలుగులో. దీన్ని బట్టి తెలుగు వారికి నెయ్యి అత్యంత ప్రీతికరమైన ఆహారపదార్థం అని తెలుస్తుంది.

నెయ్యి ఖరీదైన వస్తువు గనుక, నాచిన్నప్పుడు మాఇంట్లో ప్రతిరోజూ ఉండేది కాదు. కానీ, అది ఉన్నప్పుడు మేమంతా ఆవకాయఅన్నం లొట్టలువేసుకుంటూ తినేవాళ్ళం.

భోజనంలో చివరి భాగం **ఇంకొక విశిష్ట తెలుగుదనం.** సాధారణంగా ఇది చిక్కటి గేదెపాలు తోడేశి చేశిన మీగడ పెరుగూ, అన్నం, ఉప్పుతో కలుపుకొని, పండిన చక్కెరకేళీ అరటిపండుతో గానీ, బంగినపల్లి మామిడి పండుతోగానీ తినడంతో ముగుస్తుంది.

కృష్ణపరమాత్ముడికి వెన్న, పెరుగూ చాలా ఇష్టమైన ఆహారపదార్థాలని చెప్పే కథలెన్నో మనపురాణాల్లో చదువుతాం. దీన్నిబట్టి పరమాత్ముడి కృష్ణావతారం తెలుగు జాతిలోనే జరిగి ఉంటుందని నాకనిపిస్తుంది.

రక్తనాళాల్లో తెలుగురక్తం ప్రవహిస్తున్న నాకు, చాలా వయస్సు వచ్చేవరకూ ఇలాంటి భోజనం చాలా ప్రీతిపాత్రంగా ఉండేది. కానీ ఒకరోజు ఒక ఆవుకు పాలుపితుకుతుండగా చూశాను. అప్పుడు, కొద్ది దూరంలో ఆ ఆవు కళ్ళకు కనిపించేటట్లు తనదూడను నుంచోబెట్టి ఉంచారు. ఆకలితో నిస్సహాయంగా కన్నీరు కారుస్తూ కనిపించింది ఆదూడ నాకు. అప్పుడే నాకు జ్ఞానోదయమయ్యింది, తన దూడకివ్వడానికి ప్రకృతి ఆవుకి పాలు కల్పించిందనీ, దాన్ని బలత్కారంగా మనం అపహరిస్తున్నామనీ. అప్పటి నుంచీ పాలు, పెరుగు, వెన్న వగైరా అన్నీ తినడం మానేశి నేను వీగన్ (అంటే జంతు సంబంధం ఉన్న పదార్థాలేవీ తినని పూర్తి శాఖాహారి) అయ్యాను.

అమెరికాలో కల్తీలేని స్వచ్ఛమైన వెన్న, మీగడ పెరుగు చేసుకోవడానికి చిక్కటి పాలూ, విరివిగా, చవగ్గా లభిస్తాయి. తెలుగు వారు అమెరికా దేశానికి వలస రావడానికి ఇష్టపడడానికి ఇది ఒక ముఖ్యకారణం. అమెరికాలో నివసించే ప్రవాసాంధ్రులు ప్రతిదినం వీటిని హాయిగా వాడ్తారు. అమెరికాలో తెలుగువారు తరచుగా జరుపుకునే డిన్నర్ పార్టీలన్నిటిలోనూ, మీగడపెరుగూ, కాచిన స్వచ్ఛమైన నెయ్యి, తప్పకుండా ఉంటాయి.

ఇఖ, పానీయాల్లో తెలుగు వారికి అత్యంత ప్రీతికరమైనది చిక్కటిగేదెపాలూ, చక్కెరా కలిపిన వేడివేడి స్ట్రాంగ్ కాఫీ. తెలుగు తల్లులు తమ పిల్లలకు పసితనంలోనే కాఫీతాగడం అలవాటు చేస్తున్నారు. చాలా వయస్సు మళ్ళిన ముసలి వాళ్ళకు గూడా కాఫీలేనిదే, రోజు గడవని పరిస్థితి అయ్యింది ఇప్పుడు. ఇంటికి వచ్చిన వారందరికీ ఠంచనుగా కాఫీ

అందించడం **అతిముఖ్యమైన తెలుగు ఆచారం.**

1940ల్లో రెండవ ప్రపంచ సంగ్రామమప్పుడు ఇండియాలో పంచదార దొరికేది కాదు. అప్పుడు కాఫీని తీపి పరచడానికి బెల్లంవాడేవారు నా తల్లిదండ్రులు. పొద్దున్నే ఆఫీసుకి వెళ్ళేముందు ఈ బెల్లం కాఫీ తాగుతూ, ఇది ఇంకెన్నాళ్లు తాగాలో కదా అని మానాన్నగారు తిట్టుకోవడం నాకింకాగుర్తుంది.

నాచిన్నతనంలోనే ఎక్కడో చదివాను కాఫీడికాక్షన్లో శరీరానికి పనికివచ్చే పోషకపదార్థాలేవీ లేవని. అదీకాక కాఫీకయ్యేఖర్చు, అది చెయ్యడానికి మాఅమ్మ ఎన్ని గిన్నెలు కడగాల్సివచ్చేదో చూసేవాణ్ణి. వీటన్నిటిమూలానా కాఫీ త్రాగడంపై నాకు చిన్నప్పుడే విముఖత్వంకల్గింది. అప్పుడప్పుడూ స్నేహితులంతా త్రాగుతుంటే క్రొద్దిగా కాఫీ త్రాగడానికి నాకు అభ్యంతరం ఉండేదికాదు గానీ, ప్రతి రోజూ కాఫీత్రాగే అలవాటు మాత్రం నాకు ఎప్పుడూ లేదు.

నేను ఒకసంవత్సరం డహరాన్, సాదీఅరేబియాలో ఉన్న యూనివర్సిటీ ఆఫ్ పెట్రోలియం అండ్ మినిరల్స్ (UPM) లో విజిటింగ్ ప్రొఫెసరుగా పనిచేశాను. అప్పుడు అక్కడి స్నేహితుల ద్వారా కాఫీ చరిత్రను తెలుసుకున్నాను. కాఫీని అరబ్బులు కనిపెట్టారు. కాఫీ చెట్టు చాలాపళ్ళు కాస్తుంది. పండినప్పుడు అవి కుంకుడుగింజంత ఉంది ఎర్రగా మెరుస్తుంటాయి. ఎర్రతోలు క్రింద పసుపుపచ్చటి గుజ్జు ఉంటుంది ఆపళ్ళల్లో. ఈ గుజ్జు మధ్య ఒక గింజ ఉంటుంది. ఆ గింజనే కాఫీబీన్ అంటారు. పురాతన కాలంలో, పండులోని పసుపుపచ్చగుజ్జును వేడినీళ్ళల్లో కలిపి కాఫీపానీయాన్ని చేసేవారు అరబ్బులు. ఇలాచెయ్యడం వల్ల కాఫీబీన్ ని పనికిరాని వస్తువుగా పారేశేవాళ్ళు అరబ్బులు అప్పుడు. ఇలా చేశిన కాఫీపానీయం లేతపసుపుపచ్చ రంగుతో చూడ్డానికి ముచ్చటగా, మహారుచిగా ఉంటుంది. ఇప్పటికీ కాఫీపళ్ళు దొరికినప్పుడు అరబ్బులు ఇలా గుజ్జుతో చేశిన కాఫీపానీయాన్ని చిన్నిచిన్ని కప్పులలో త్రాగుతారు. UPMలో మాకొలీగ్ ఒకతను కాఫీచెట్లు పెంచేవాడు. అతను రోజూ కాఫీగుజ్జును యాలుకలపొడితో కలిపి చేశిన పానీయాన్ని ఒక చిన్ని ఫ్లాస్కులో తెచ్చుకునేవాడు. దాంట్లో ఒక చిన్నికప్పు నాకు ఇస్తుండేవాడు. కాఫీ, యాలుకల ఘుమఘుమలతో ఆపానీయం చాలాబావుండేది.

యూరోపియన్లు మొట్టమొదట అరబ్బుదేశాలకు వచ్చినప్పుడు వేడివేడి కాఫీగుజ్జుపానీయం తాగి చాలా ఇష్టపడ్డారట. వాళ్ళు యూరప్ కి తిరిగి వెళ్ళేటప్పుడు కాఫీపళ్ళు తమతో తీసుకు వెళ్ళారట. ఆకాలంలో సముద్రంపై పడవల మీద అరబ్ దేశాల

నుంచి యూరప్ కి వెళ్ళడానికి కొన్ని నెలలు పట్టేది. వాళ్ళు యూరప్ చేరుకునేటప్పటికి ఆ కాఫీపళ్ళు బాగా ఎండిపోయాయి, కాఫీపానీయం ఎలాచెయ్యాలో వాళ్ళుపూర్తిగా మర్చిపొయ్యారు. కానీ దాన్ని వేడిగా త్రాగినట్లు గుర్తు తెచ్చుకొని, బహుశా ఎండిన కాఫీపళ్ళను వేయించి పొడిచేశి, ఆ పొడిని వేడినీటిలోకలిపి చేశారనుకొని అలా చేశారట. మనం ప్రస్థుతం తాగేకాఫీచరిత్ర ఇలా మొదలయ్యింది అని చెప్పారు డహరాన్ లో నాసౌదీస్నేహితులు.

మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజిలో చదువుకుంటూ, దగ్గర విక్టోరియా హాస్టల్లో ఉన్నప్పుడు కాఫీవల్ల జరిగిన ఒక అనుభవం చెప్తాను. అప్పుడు నాకు నెలనెలా డబ్బు పంపించడానికి మానాన్నగారు ఎంతకష్ట పడేవారో తెలుసు గనుక, నేను తక్కువ ఖర్చుతో, చాలా పొదుపుగా కాలం గడిపేవాణ్ణి.

తెలుగు వాళ్ళందరూ ధనికులైన భూస్వాములు అనే అభిప్రాయం ఉండేది ప్రెసిడెన్సీ కాలేజిలో నాతమిళ స్నేహితులకు. నాకు బాగా తెలిసిన తమిళ స్నేహితుడు " నీకేమోయ్, మీనాన్నగారు బంగారు ఇటుకల్ని మీఇంటిగోడల్లో దాచిపెట్టి ఉంటారు." అంటూ నవ్వుతూ అనేవాడు. "అదంతా నీ ఊహాగానం" అంటూ నేను ఆక్షేపణ చెప్పేవాణ్ణి గానీ, "మేము చాలా బీదవాళ్ళం, మానాన్నగారిది చాలా తక్కువ జీతంవచ్చే గుమస్తా ఉద్యోగం" అని చెప్పుకోవడానికి నాకు సిగ్గువేశేది. ఇలా, ఉన్న విషయం నిజాయితీగా చెప్పుకోడానికి సిగ్గుపడడం ***కొందరి తెలుగువారి తెలుగుదనం.***

ఒక మధ్యాహ్నం నాగదికి వచ్చాడు ఆ తమిళ స్నేహితుడు. కనీసం కాఫీ అయినా ఇప్పించక పోతే నేను పిసినిగొట్టుననుకొంటాడేమోనని భయపడ్డాను అప్పుడు. "నాకు డబ్బు కొరతగా ఉంది, నేను కాఫీ త్రాగను, నీకు కాఫీ ఇప్పించ లేను" అనిచెప్పడానికి మొహమాట పడ్డాను. ఇలా మొహమాట పడడం ***కొందరి తెలుగు వారి తెలుగుదనం.***

ఆ జంకు మూలాన, కాఫీ ఆర్డర్ చెయ్యడానికి మెస్ కి వెళ్ళాను. ఏమీ కావాలో చెప్పండి, గదికి తెచ్చి ఇస్తాం అన్నాడు సర్వరు. రెండు కాఫీలు మాత్రమే అనిచెప్పాను, వీటికి బిల్లు చెల్లించాలని గ్రహించిన నేను.

కాసేపట్లో ఆ సర్వరు ఒకట్రేతో వచ్చాడు. దాంట్లో రెండు కాఫీలే గాక, ఆరు కేక్ ముక్కలు కూడా తెచ్చాడు. వీడు నేను అడగని కేక్ ముక్కలు ఎందుకు తెచ్చాడూ, నా స్నేహితుడు దాంట్లో ఒకటి తింటే నా బిల్లు ఎంత పెరుగుతుందో గదా అని భయపడ్డాను

నేను మనస్సులో.

ఆ తమిళ స్నేహితుడు "థ్యాంక్యూ, నేను లంచ్ ఇంకా తినలేదు" అని చెప్పుతూ, నేను భయపడినట్లు ఆ ఆరు కేక్ ముక్కలూ తినేశాడు!

ఈ విషయం తర్వాత మామయ్యకు చెప్పాను నేను. "ఇంకా నయం, మొహమాటంవల్ల చిన్నవ్వయంతో సరిపోయింది ఈ సారి నీకు. కుంతీదేవికి చిన్నవయస్సులోనే మొహమాటంవల్ల కడుపయ్యిందని మహాభారతంలో చదివే ఉంటావు గదా!" అన్నాడు మామయ్య. మొహమాటానికి పోవడం మూలాన ఎంతటి అనర్థాలు సంభవించవచ్చో అప్పుడు నాకు పూర్తిగా అవగహనం అయ్యింది.

# 15. నా రిసర్చి సబ్జెక్టుతో పరిచయం ఎలాజరిగింది?

మద్రాసులో శ్టాటిస్టిక్సు B.Sc.(Hons) పూర్తి చేశాక 1955లో ISI ( Indian Statistical Institute, కలకత్తా) లో M. Stat కోర్సులో చేరాను. 1957లో అది అయ్యాక ISI, కలకత్తాలోనే ఉద్యోగం వచ్చింది. 1965వరకూ ఆఉద్యోగంలో గడిపాను.

శ్టాటిస్టిక్సు చాలా ఉపయోగకరమైన సబ్జెక్టు గనుక నాకుచాలా నచ్చింది. కానీ శ్టాటిస్టిక్సులో ఇప్పుడు జరుగుతున్న theoretical research అంత ఆసక్తికరంగా అనిపించలేదు నాకు. అందుకని శ్టాటిస్టిక్సులో రిసర్చి చేశే అభిలాష నాకు కల్గలేదు. ISI లో ఉద్యోగం చేస్తున్నప్పుడు Challenging Research Subject కొరకు చూడడం మొదలు పెట్టాను. అప్పుడు ఒకసారి ఒక అమెరికన్ ప్రొఫెసర్ వచ్చి OR (Operations Research) అనే ఆకాలంలో క్రొత్తసబ్జెక్టు మీద 3 లెక్చర్లు ఇస్తాడని తెలిసింది. OR అంటే ఏమిటో నాకు తెలియదు అప్పుడు. డిక్షనరీలో ఆ పదం కనపడలేదు. ఎవ్వరిని అడిగినా తెలియదన్నారు. ఇండియాలో సర్జికల్ ప్రొసీజర్సుని ఆపరేషన్లని పిలుస్తారు కదా, అందుకని బహుశా ఏదో మెడికల్ రిసర్చి టాపిక్ అయి ఉంటుందనుకున్నాను.

కానీ లెక్చర్ లో OR అంటే Research to carry out Operations in any organization in the most efficient and profitable manner possible అని చెప్పారు. ఇంగ్లండు, అమెరికాదేశాల్లో ఇటీవలే మొదలైన కొత్తసబ్జెక్టని చెప్పారు. OR లో కొన్ని ప్రాబ్లమ్స్ వివరిస్తూ TSP (traveling salesman problem) ని గురించి చెప్పారు. TSPలో ఒక

సేల్స్ మన్ ఒక నగరంలో బయల్దేరి, కొన్ని నగరాలు టూర్ చేశి చివరకు మళ్ళీ మొదటి నగరానికి తిరిగి రావాలి. ప్రతి 2 నగరాలజతమధ్య దూరం ఇస్తారు (దీన్నే Problem Input Data అంటారు). టూర్ లో ఈ నగరాలను ఏ ఆర్డర్ లో ప్రయాణంచేస్తే మొత్తం ప్రయాణంచెయ్యాల్సిన దూరం minimum అవుతుందో కనుక్కోవాలి. ఈ ప్రాబ్లం నాకు చాలా challenging అనిపించి దానిమీద ఆలోచించడం మొదలు పెట్టాను. దీనితో నాకు OR మీద అభిరుచి కల్గి, OR లో రిసర్చి చెయ్యాలని అప్పుడే నిశ్చయించుకున్నాను.

OR సబ్జెక్టు గురించి ఇంకొక అనుభవం ISIలో ఉండగా జరిగింది చెప్తాను. పైన చెప్పిన లెక్చర్లు జరిగిన కొన్ని సంవత్సరాల తర్వాత ISIకు ఇంకొక అమెరికన్ ప్రొఫెసర్ లెక్చర్లివ్వడానికి వచ్చాడు. ఈయన తన సతీమణితోబాటు వచ్చాడు. ఈయన సబ్జక్టు వేరే అనుకోండి, కానీ OR ని గురించిన నా అనుభవం ఈయన సతీమణితో సంభాషణల్లో జరిగింది గనుక ఈదంపతుల విజిట్ ని గురించి మీకు చెప్పాలి. ఆవిడ చాలా అందమైన యువతి. అందగత్తె అవడమేగాక ఇష్టాగోష్టి చాలా స్నేహభావంతో మాట్లాడే స్వభావం ఆవిడది. ISIలో యువకులమైన మా అందరికీ ఆవిడను చూస్తూండడం, ఆవిడతో మాట్లాడడం చాలా సరదాగా ఉండేది. అతని లెక్చర్లకి ఆవిడ వచ్చి వెనకాల పంక్తిలో అల్లుకుంటూ కూర్చునేది. ఆయన లెక్చర్లు వినడం కన్నా తలవెనక్కితిప్పి ఆవిడనుచూడ్డం ఇష్టంగా ఉండేది మాకు.

ఒక రోజు ప్రొద్దున ISI డైరక్టర్ నుంచి తన ఆఫీసుకి రమ్మని పిలుపు వచ్చింది నాకు. డైరక్టరు తెలుగాయనే. నన్ను ఎందుకు రమ్మని ఉంటారో అర్థంకాలేదు నాకు. భయంభయంగానే ఆఫీసుకు వెళ్లాను. లోపల చూస్తే ఈవిడకూడా అక్కడ కూర్చొని ఉంది. డైరక్టరుతో నామీద ఏమైనా ఫిర్యాదు చేశిందేమోనని చాలా భయమేశింది. కానీ డైరక్టరు "ఈవిడను విక్టోరియా మెమోరియల్ తీసుకు వెళ్ళి చూపించి రాగలవా" అని అడిగినంతనే నామనస్సుకు స్థిమితం కల్గింది. సరే అన్నాను. మేమిద్దరం ISI transportలో బయల్దేరాం. దారిలో, నువ్వు ఏసబ్జెక్టులో రిసర్చి చేస్తున్నావు, అని అడిగింది ఆవిడ. Operations Research లో అని చెప్పాను. సాధారణంగా చాలామంది ఇదివిన్నవెంటనే అది ఏమిటి అని అడిగేవారు. ఆవిడ అలా అడగలేదు. అమెరికన్ ప్రొఫెసర్ భార్యగదా, ఆవిడకు తెలిశే ఉంటుందనుకున్నాను.

విక్టోరియా మెమోరియల్ చూశేసుకొని సాయంత్రం ISIకు తిరిగివచ్చే దారిలో రోడ్డుకి ఒకప్రక్క పెద్దభవనాలున్న కాంపౌండు కనపడింది. అప్పుడు మాసంభాషణ ఇలాసాగింది;

ఆవిడ: మూర్తీ, అదేంటి?

నేను: అది కలకత్తా జనరల్ హాస్పిటల్. ఇండియాలో అన్నిటికన్నా పెద్దహాస్పిటల్.

ఆవిడ: నువ్వు ఇక్కడ చాలా టైము గడుపుతుంటావుగదా?

నేను: అలా ఎందుకనుకుంటున్నావమ్మా నీవు? నేను చాలా ఆరోగ్యవంతుణ్ణి.

ఆవిడ: అందుకు కాదు. నువ్వు ఆపరేషన్లమీద రిసర్చి చేస్తున్నట్లు చెప్పావుగదా!

నాకు ఈదంపతులతో ఇంకో అద్భుతమైన అనుభవం కల్గింది, దాన్ని గురించి చెప్తాను. వీళ్ళిద్దరూ పూరీ వెళ్ళినప్పుడుకూడా నేనుతోడుగా వెళ్ళాను. ఆట్రిప్పులో సాయంత్రం మేము ముగ్గురం అక్కడ బీచ్ కి వెళ్ళాం. ఆసమయంలో బీచ్ లో ఇంకెవ్వరూలేరు. బీచ్ చేరిన వెంటనే వాళ్ళిద్దరూ సిగ్గేమీ లేకుండా గుడ్డలన్నీ విప్పేసుకుని నగ్నంగా సముద్రంనీటిలోకి దూకారు. ఆవిడ నగ్నసౌందర్యం చూసిన వెంటనే నా కళ్ళు జిగేల్ మన్నాయి. అంతవరకూ స్త్రీ నగ్నసౌందర్యాన్ని చూడలేదు నేను.

మిగతా తెలుగు యువకుల్లాగానే నాకూ నా నగ్నశరీరం ఇతరులు చూస్తారనిపిస్తే చాలాసిగ్గు వేశేది. ఇలాంటి సిగ్గు ***ఒకప్రత్యేక తెలుగుదనం.*** కానీ, వాళ్లను చూశి, గుడ్డలు విడిచేశి సముద్రంలో దిగడానికి నాకుకూడా ధైర్యంవచ్చింది. అప్పటి నుంచి నాకు అలాంటి సిగ్గు పోయిందని చెప్పవచ్చు.

# 16. ఒక బ్రిటీష్ - ఇండియన్ సైంటిస్టు తెలుగుదనం.

JBS Haldane పేరు సంపాదించిన బ్రిటీష్ బయాలజిస్టు. ఆయన ఇంగ్లండులో ఉండగా తనలాబ్ అసిస్టెంటు ఒకావిడతో ప్రేమకలాపాలు చేస్తున్నాడని పుకార్లూ, విమర్శలూ మొదలయ్యాయి. తర్వాత ఆవిడను పెళ్ళిచేసుకున్నా ఈవిమర్శలు సమసిపోలేదు. విసుగెత్తి ఆయన తన సతీమణితో ఇండియావలస వచ్చేశి, వాళ్ళిద్దరూ మా ISI, కలకత్తాల్లో ప్రొఫెసర్లుగా చేరారు. ఇద్దరూ ఇండియన్ సిటిజన్ షిప్పు తీసుకున్నారు. దాని తర్వాత ఈ హాల్డేన్ గారు పాంటు షర్టు వేసుకోవడం మానేశి ఆఫీసుకి లాల్చీ, పైజమా వేసుకొనివచ్చేవారు.

పేరుగల బ్రిటీష్ సైంటిస్టు ఇండియన్ సిటిజన్ షిప్పు తీసుకున్నాడని ఆయనకు ముందు చాలా గౌరవం లభించింది. త్వరలో ఆయనతో రీసర్చి చేయడానికి చాలామంది రిసర్చిస్కాలర్లు చేరారు. ఆశ్చర్యమేమిటంటే వాళ్ళందరూ తెలుగు వాళ్ళే.

నాసబ్జెక్టు బయాలజీ కాకపోవడం మూలాన ఆయనతో నాకు పరిచయం కలగలేదు. కానీ ఆయనతో పని చేస్తున్న తెలుగు రిసెర్చి స్కాలర్లు ఆయన విషయాలు నాకు చెప్తుండేవారు.

ISIలో చాలామంది ప్రొఫెసర్లు అమెరికా, ఇంగ్లండు, జపాన్ లాంటి దేశాల్లో రిసర్చిచేశి ఇండియా తిరిగి వచ్చినవాళ్ళే గనుక వీళ్ళల్లోచాలామంది పేరు గడించినవాళ్ళే. దీనివల్ల కొద్దిరోజుల్లో హాల్డేన్ గారు అనుభవిస్తున్న ప్రత్యేక గౌరవం తగ్గిపోయి ఆయన్నుకూడా అందరిలాగే చూడడం మొదలుపెట్టారు. ఆయన అహంకారం దీనివల్ల దెబ్బతిన్నది.

ఈ వెనుకబడ్డదేశస్థులు తనను నిర్లక్ష్యం చేస్తున్నారనే కోపంతో ఒకసారి Indian Science Congress లో అందరిముందూ, "I am JBS Haldane, the Scientist" అని ఘట్టిగా అరిచారు. ఆయన అహంకారం దెబ్బతిన్నదని నేను అప్పుడే గ్రహించాను.

దీనితర్వాత ఆయన తన కాలమంతా తన రిసర్చిస్కాలర్లతోనే గడపడం మొదలు పెట్టారు. వాళ్ళదగ్గర తెలుగు నేర్చుకుని, Telugu language is the best language in the world అంటూ పత్రికలకు స్టేట్మెంటు ఇచ్చారు. ***ఇది ఈయన తెలుగుదనం***. నాకు సరీగా తెలియదుగానీ, ఈ హాల్డేన్ గారో, లేక ఆయనకుముందు తెలుగు అభిమానుడైన బ్రౌన్ దొరగారో Telugu is the Italian of the East అని వర్ణించారు.

వాళ్ళ రిసర్చిస్కాలర్ల ద్వారా హాల్డేన్ దంపతులిద్దరూ విశాఖపట్టణం ప్రాంతంలో ఒక మెడికల్ కాలేజితో సంబంధం ఏర్పరుచుకొని, ఎక్కువ కాలం ఆకాలేజిలో గడపడం మొదలు పెట్టారు.

ఈ హాల్డేన్ గారి అహంభావం ఆయన రిసర్చిస్కాలర్లకు బాగా అంటినట్లుంది. వాళ్ళల్లో ఒకతను నాతో ఎప్పుడు మాట్లాడినా I am a Scientist అనే సమాసం తరచూ పలుకుతుండేవాడు. మంచి రిసర్చి చేస్తే ఇలా సొంత డబ్బా వాయించుకోవాల్సిన అవసరం ఏమిటో నాకు తెలియదు.

సొంతడబ్బా వాయించుకోవడం తెలుగు వారిలోనే కాదు, అన్ని జాతుల ప్రజల్లోనూ చూస్తాం. **ఇది మానవ దనం**. వేలకొలది సంవత్సరాలక్రితం వ్రాయబడిన మన

పురాణగాథల్లో గూడా ఈ లక్షణం కనపడుతుంది.

ఉదాహరణకు మనపురాణగాథల్లో సొంత డబ్బావాయించుకునే రెండు పాత్రల గురించి చెప్తాను. మొదటి పాత్ర మహాభారతంలోని యధిష్ఠరుడిది. తన జూదవ్యసనంవల్ల తన కుటుంబంలోనూ, రాజ్యంలోను అందరికీ చెప్పలేని కష్టాలకు కారణమైన ఈ పాత్రమీద నాకు గౌరవం లేని మాట నిజం. ఈ యధిష్ఠరుడు తను ధర్మరాజునని సొంతడబ్బా వాయించుకోవడమేగాక , తన తమ్ముళ్ళూ, ఇతర బంధువులందరి చేత ఇలానే పలుమార్లు సుత్తికొట్టించు కోవడం చూస్తాం.

రెండో పాత్ర బోలెడు పురాణాల్లో తగిలే దుర్వాసుడిది. ఈయన ఎక్కడకు వెళ్లినా తను గొప్ప మహర్షినని సొంతడబ్బావాయించుకోవడం, ఆ డబ్బా వినని వాళ్ళమీద మండిపడడం చూస్తాం.

ఒకప్పుడు హాల్డేన్ గారు ఆంధ్రాలో ఆ మెడికల్ కాలేజి నుంచి ISI, కలకత్తాకు విజిట్ మీద వచ్చి ఉండగా అకస్మాత్తుగా మరణించారు. అప్పుడు ఆయన గొప్ప లక్షణాలు బయటపడ్డాయి. ఒకటి తను మరణించినప్పుడు ఏరకమైన Service జరిపించగూడదని చెప్పారు. రెండోది, తన మృతకళేబరాన్ని ఆంధ్రాలోని ఆ మెడికల్ కాలేజికి వాళ్ళ రిసర్చి ప్రోగ్రాంల్లో వాడుకోవడానికి పంపించమని చెప్పారట. ఇలా చెయ్యవచ్చని నాకు అప్పుడే తెలిసింది. ఆయన చెప్పినట్లే ఆయన శవాన్ని మంచులో పాక్ చేశి ఆ మెడికల్ కాలేజీకి పంపించేశారు ISI వాళ్ళు. ఇలా చేసినందుకూ, తెలుగు భాషను మెచ్చుకున్నందుకూ, బోలెడుమంది తెలుగు రిసర్చి స్కాలర్లను ప్రోత్సహించినందుకూ, హాల్డేన్ గారంటే నాకు చాలా గౌరవం కల్గింది.

# 17. ఏ అబ్బాయిని వరించాలీ?

ఎంత మారినా తెలుగు వారిలో ఇంకా పురుషాధిక్యత రాజ్యమేలుతుంది గదా. అందువల్ల పురుషుల అనుభవాలూ, స్త్రీలఅనుభవాలూ వేరుగా ఉంటాయి. నాకు పురుషుల అనుభవాలతోనే ఎక్కువ పరిచయము, కానీ ఒక్క అసాధారణమైన స్త్రీని చూశాను, ఆవిణ్ణి గురించి చెప్తాను.

నేను ప్రవాసాంధ్రుడ్ని అయ్యాక మాకుటుంబం విజయవాడకు మారారు. అప్పుడు

విజయవాడ మా ఇంట్లో ఒక తల్లి, కూతురు చిన్నకుటుంబం ఒక పోర్షన్ లో అద్దెకు చేరారు. అప్పుడు ఆ అమ్మాయికి 21సంవత్సరాలు, తండ్రి చనిపోయాడు. B.Sc.పూర్తి చేసి ఉద్యోగం కోసం వెదుకుతోంది. తల్లి ఆ అమ్మాయికి పెళ్ళిసంబంధాలకోసం వెదుకుతోంది. తమ పిల్లల పెళ్ళిళ్ళను గురించి తాపత్రయపడడం ***తెలుగు తల్లిదండ్రుల ముఖ్య తెలుగుతనం గదా.***

ఆ కాలంలో కలకత్తానుంచి శెలవల్లో నేను మాఇంటికి వచ్చినప్పుడు, ఇండియాలోనే తెలుగుదేశం బయట ఉద్యోగం చేశే ఒక తెలుగుఅబ్బాయి శెలవలమీద వచ్చి సంబంధాలు చూసుకుంటున్నాడని వీళ్ళకు తెలిసింది. నేను అక్కడ ఉన్నప్పుడే ఆ అబ్బాయి పెళ్ళి చూపులకు ఈ అమ్మాయిని చూడ్డానికి వచ్చాడు. తెలుగు దేశంలో నివశించే వాళ్ళు జీవితభాగస్వామిని ఎన్నుకోడానికి సర్వసాధారణంగా వాడే పద్ధతి ఇదే. ఇది ***తెలుగుదేశంలో ఒక ముఖ్య తెలుగుదనం.***

అబ్బాయి చూడ్డానికి బాగానే కనిపించాడు. పెళ్ళిచూపులు మామూలుగానే జరిగిపోయాయి. మరుసటిరోజునే అబ్బాయికి అమ్మాయి నచ్చినట్లు కబురువచ్చింది. అమ్మాయికి కూడా నచ్చితే త్వరలో పెళ్ళిజరిపిద్దామని అబ్బాయి తరుఫువాళ్ళు అన్నారు.

నేను దాని తర్వాత కలకత్తా వెళ్ళిపోయ్యాను. మానాన్నగారి ఉత్తరాల ద్వారా పెళ్ళీ, మూడురాత్రుల ముచ్చటా బాగానే జరిగి, అమ్మాయి కాపురానికి వెళ్ళిందనీ, తల్లిమాత్రం ఇంకా మా ఇంట్లోనే ఉంటుందనీ తెలిశింది.

షుమారు 6 నెలల తర్వాత నేను మళ్ళీ ఇంట్లో దిగాను. అప్పుడు ఆ అమ్మాయి కనిపించింది. "ఏమమ్మా, అమ్మను తీసుకెళ్ళడానికి వచ్చావా" అని అడిగాను. "ఏం చెప్పనన్నయ్యా, నా జీవితం చాలా జటిలంగా అయ్యింది" అంటూ కొన్ని వివరాలు చెప్పింది. తను భర్తను వదిలిపెట్టేశి వచ్చి, ఇక్కడ B.Ed. కోర్సులో చేరినట్లు చెప్పింది.

కొత్తగా కాపురానికి వెళ్ళినప్పుడు, "కొన్నాళ్ళపాటు పిల్లలు లేకుండా జాగ్రత్త తీసుకుందాం" అని భర్తతో అన్నదట. "లేదు, లేదు, మాతల్లిదండ్రులు మనవడికోసం ఎదురుచూస్తున్నారు" అన్నాడట. ఇది మనం ***సాధారణంగా చూసే తెలుగుదనం.***

"నాకు ఇంట్లో ఊరికే కూర్చోడానికి బోరుకొడ్తుంది, ఉద్యోగం చూసుకుంటానంటే", "లేదు, లేదు, మనకి త్వరలో అబ్బాయి పుడ్తాడు గదా, అప్పుడు నువ్వు ఉద్యోగం మానెయ్యాల్సి వస్తుంది. కొన్నాళ్ళకు ఏమి ఉద్యోగం దొరుకుతుంది నీకు?" అన్నాడట.

ఒక సాయంత్రం అతను ఆఫీసునుంచి ఇంటికి వచ్చినప్పుడు కిటికీలన్నీ బార్లా తెరిచి ఉండటం చూశి, "నువ్వు ఎవర్ని చూస్తున్నావే, పక్కింటి అబ్బాయి మీద కన్నువేశావా?" అని అరిచాడట.

తన భార్యాఅందాన్ని ఇతరపురుషుల చూపులనుంచి రక్షించుకోవాలని తాపత్రయపడడం కొందరు **తెలుగు పురుషులలో ఉండే తెలుగుదనం**. "ఇంకా ఎన్నో ఉన్నాయి అన్నయ్యా, నాకు ఇఖ రాణిచీమలాగా కిటికీలన్నీ మూశేసుకొని ఇంట్లోకూర్చోడం ఇష్టంలేక వచ్చేశాను. B.Ed, అయ్యాక టీచరు ఉద్యోగం చూసుకొని అమ్మను పోషించుకుంటూ గడుపుతాను" అంది.

"లోగుట్టు పెరుమాళ్ళకే ఎరుక" అంటారు గానీ, భార్యభర్తల మధ్య ఏమిజరిగిందో పెరుమాళ్ కి కూడా తెలియదు, వాళ్ళిద్దరికే తెలియాలి. మొత్తానికి ఈ అమ్మాయికి మొగుడి ప్రవర్తన, అతను తనని చూసిన విధానం నచ్చలేదని తెలిశింది.

నేను అక్కడ ఉన్నప్పుడే ఒక రోజు ఆమెభర్త వీళ్ళను చూడ్డానికి వస్తున్నాడని కబురందింది. అతను వచ్చినప్పుడు మేమంతా ముందుగదిలో కూర్చుని ఉన్నాం. ఆ అమ్మాయి వెనుకగది గడప దగ్గర నుంచుని ఉంది. సంభాషణ ఇలాసాగింది:

అతను: ఏమే, పద మనింటికి వెళ్దాం.

ఆమె: నువ్వు నాకు ఇష్టం లేదు. మనకు తెగతెంపులు అయిపోయాయి.
నేను ఇఖ రాను.

అతను: నేను ఇష్టం లేకపోతే, నేనిచ్చిన మంగళసూత్రం ఎందుకు వేసుకుంటావు?
నేనంటే నీకు ఇష్టమయ్యే ఉండాలి.

ఆమె వెంటనే ఆ మంగళసూత్రాన్ని మెడలోనుంచి తీశేశి అతని ముఖానికి సూటిగా విసిరేస్తూ "నీ సొత్తు తీసుకుని ఫో, గెటవుట్" అంది. సాధారణంగా తెలుగుఆడవారిలో ఇంత ధైర్యాన్ని చూడలేము. ఆమె చాలా అసాధారణమైన తెలుగు స్త్రీ. ఆమెది ***అసాధారణమైన తెలుగుదనం.***

ఈ అమ్మాయికి జరిగిన ఈ అనుభవం సుఖాంతం అయ్యిందనే నేననుకొన్నాను.

# 18. తెలుగువారిలో బాసిజం, నెపోటిజం.

నాచిన్నప్పుడు మానాన్నగారు రాష్ట్రప్రభుత్వం సర్వీసులో ఒక చిన్న ఊళ్ళో రెవెన్యూఇన్స్పెక్టర్ గా పనిజేశారు. అప్ప్పుడు తన బాస్ అంటే మానాన్నగారు చాలా జంకుతుండేవారు. కేంపుమీద ఆబాస్ ఈ ఊరు వచ్చినప్పుడల్లా ఆయనకు ఖరీదైన భోజనాలు అవీ ఏర్పాటుజేశి ఆయన సేవలో రాత్రింబవళ్లు గడిపేవారు.ఆ బాస్ ప్రవర్తనను గురించి నా తల్లిదండ్రులు మాట్లాడు కోవడం నేను ఒక చెవితో వింటుండేవాణ్ని.

ఆఫీసు పనిలో మానాన్నగారు తరచు ఇంటికి ఆలస్యంగా వచ్చేవారు. శెలవు రోజులు ఆఫీసు పనిలో గడిపేవారు. ఇది జరిగినప్పుడల్లా మానాన్నకొరకు ఎదురు చూస్తూ గడిపేది మాఅమ్మ. ఆ సమయంలో మానాన్నగారి బాస్ ని మనోగతంగా తిట్టుకుంటూ ఉండేది మా అమ్మ.

చిన్నతనం, ప్రపంచపద్ధతులగురించి ఎక్కువగా తెలియని అయోమయంలో నేను అనుకునేవాణ్ణి "పెద్దఅయ్యి ఉద్యోగం చేసినప్పుడు బాస్ అంటే భయపడగూడదు, అస్సలుపిరికిగా ఉండకూడదు" అని.

ఈ బాసిజంకు extreme example నేను కలకత్తా ISIలో ఉద్యోగం చేస్తున్నప్పుడు చూశాను. అప్పుడు నేను ఒక జ్యూట్ మిల్లుకు Quality control consultantగా వెళ్తుండే వాణ్ణి. మేము ఇచ్చిన సలహాలు కంపెనీకి నచ్చి, వాటిని అమలు జరపడానికి ఒక కొత్త ఆఫీసర్ ని నియమించారు. అతను ఒక తెలుగు యువకుడే. పెద్ద ఆఫీసు, దానిమధ్య పెద్ద డస్కుతో ఈయనకుర్చీ. కుర్చీకి రెండువైపులా డస్కు క్రింద షెల్ఫులు ఉండేవి. ఇతనికి ఒక ప్యూనుని కూడా ఇచ్చారు. ఆ ప్యూన్ ముసలివాడు, గది బయట కుర్చీమీద కూర్చుని ఉంటాడు. ప్యూన్ తో అవసరం ఉన్నప్పుడల్లా పిలవడానికి ఈయన డస్కుమీద కాలింగ్ బెల్ ఉండేది.

తనకు ఉద్యోగం రావడానికి మేమే కారకులమని తెలిశి మమ్మల్ని ఎప్పుడూ గౌరవంతో చూసి మాట్లాడేవాడు. కానీ ప్యూన్ మీద గొప్ప బాసిజం చేశేవాడు. కుర్చీలో హుందాగా కూర్చుని, ప్రక్కనే ఉన్న షెల్ఫులో ఏదైనా తీయాలంటే, స్వయంగా దానిని లాగకుండా, కాలింగ్ బెల్ కొట్టేవాడు ప్యూన్ ని వచ్చి తెరవమంటూ. నిజానికి కాలింగ్ బెల్ కొట్టడం కంటే ఆ షెల్ఫు లాగడమే తేలిక. కానీ, తను బాసునని చూపించుకోడానికి కాబోలు

అతను అలా చేసేవాడు. అది చూసినప్పుడల్లా నాకు అఫ్ఘ్యాన్ మీద ఎంతో జాలికల్గేది.

బాసిజం తెలుగు వాళ్ళ ప్రత్యేక లక్షణమేమీ కాదు, ఇది అన్ని జాతుల మానవులకూ ప్రబలిన జబ్బే. ఇది **ఒక మానవదనం.** కానీ ఆ జ్యూట్ మిల్లులో తెలుగు ఆఫీసరు తన ముసలిఫ్యూన్ మీద చూపించిన extreme బాసిజం నేను ఇంకెక్కడా చూడలేదు.

రెండవది నెపొటిజం (బందుపక్షపాతం), అంటే తన చేతిక్రింద ఉన్న సహాయాలను బంధువులకు పంచిపెట్టుకోవడం. నా స్వానుభవంలో దీనికి చెందింది ఒకటి చెప్తాను. కలకత్తాలో ఉంటూ, ఇంకో 6 నెలల్లో అమెరికాలో పైచదువుకు వెళ్ళబోయేముందు ఇంటికి శెలవుల మీద వచ్చినప్పుడు జరిగింది. మాబంధువు ఒకాయన డ్రైవర్స్ లైసెన్సులు ఇచ్చే ఆఫీసులో పని చేసేవాడు అప్పుడు. ఆయన్ను పలకరించడానికి ఆయన ఆఫీసుకి వెళ్ళాను. అంతవరకూ నేనెప్పుడూ కారు స్టీరింగ్ వీలును ముట్టుకోలేదు, కారు డ్రైవ్ చెయ్యడానికి లైసెన్సు పుచ్చుకోవాలనికూడా సరీగ్గా తెలియదు నాకు.

వాళ్ళ ఆఫీసులో జరిగే పని వివరంగా చెప్పి, మేము అంతర్జాతీయ లైసెన్సులు గూడా ఇస్తాం అన్నారు ఆయన. నేను అమెరికా వెళ్ళబోతున్నాను గదా, దాని ముందు మళ్ళీ ఇంటికి వచ్చి, డ్రైవింగ్ నేర్చుకొని, ఈలైసెన్సు పుచ్చుకుంటే బావుంటుంది అని ఊరికే అన్నాను.

దాని తర్వాత పని వత్తిడిలో ఈ విషయాన్నీ, ఆయననూ పూర్తిగా మర్చిపొయ్యాను నేను. కానీ 2 నెలల తర్వాత నాపేరున ఒక అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్సు నా కలకత్తా అడ్రసుకు మెయిల్లో వచ్చేశింది. నాకు సహాయపడ్తుందని, ఏమీ శ్రమలేకుండా తయారు చేశి పంపించేశారు ఆయన.

అదృష్టవశాత్తు అమెరికాకు పిహెచ్. డి. విద్యార్థిగా వెళ్ళాక, 3 సంవత్సరాలవరకూ ఒక కారు ముట్టుకోవడానికికూడా నాకు అవకాశం లేక పోయింది. ఈ లోపల ఆ అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్సు ఎక్కడో పోయింది. కనుక 3 సంవత్సరాల తర్వాత మా మొదటి కారు (15 సంవత్సరాల పాతకారు) కొన్నప్పుడు డ్రైవింగ్ పాఠాలు పుచ్చుకొని, డ్రైవ్ చెయ్యడం నేర్చుకొని, అక్కడి డ్రైవింగు లైసెన్సు పుచ్చుకున్న తర్వాతగానీ మేము దాన్నిడ్రైవ్ చెయ్యడం మొదలుపెట్టలేదు.

ఏ మాత్రం అనుభవం లేనినాకు, ఆ లైసెన్సు పంపించి శ్రమ తగ్గించినందుకు ఆబంధువుకు ధన్యవాదాలు చెప్పుకున్నాను. కానీ, ఇలాంటి సహాయం చెయ్యడం మూలాన రోడ్లమీద నడిచే ప్రజలకూ, వెళ్ళే వాహనాలకూ ప్రమాదాలు జరగవచ్చని ఆయన ఊహించి

ఉండరు. నేను చాలా జాగ్రత్తగల మనిషినని తెలిశి, డ్రైవింగ్ నేర్చుకోకుండా డ్రైవ్ చెయ్యగనే ధైర్యంతో ఆయన అది పంపించారు. కానీ, లైసెన్సు ఇవ్వడం లాంటి సీరియస్ విషయంలో ఏ మనిషి మీదా అంత నమ్మకం ఉంచకూడదని నేననుకుంటాను. ప్రవాసాంధ్రుల ప్రవర్తనలో ఎక్కువ చూడలేదుగానీ, తెలుగుదేశంలో మాత్రం, బంధువులు మంచి హోదాగల పదవుల్లో ఉన్నవారి జీవితం సుళువని ఇప్పటికీ వింటూనే ఉన్నాం. ఇది ***ఒక విశిష్ట తెలుగుదనం.***

# 19. ఏ వధువును చేపట్టాలి?

మద్రాసులో మా మామయ్యలు ఉండేవారని చెప్పాను గదా. వాళ్ళందరిలోకి పెద్దాయన మా నాన్నగారివైపు మామయ్య. ఆయన చాలా డబ్బు సంపాదించాడనీ, కానీ వాళ్ళు చాలా పొదుపుగా ఉంటారనీ చెప్పుకునే వాళ్ళు. నేను ఎలిమెంటరీ స్కూలులో చదువుకుంటున్నప్పుడు మా నాయనమ్మకు చాలా జబ్బుచేస్తే చూడడానికి బందరు వచ్చాడట ఈ మామయ్య. అప్పుడే మా నాయనమ్మ ముందు నాకు వాళ్ళమ్మాయిని చేసుకునేటట్లు మా నాన్నగారి నుంచి వాగ్దానం చేయించున్నాడట. పసితనంలో నాకు ఆ విషయాలేమీ తెలియలేదనుకోండి.

పిల్లలపసితనంలోనే వాళ్ళ పెళ్ళికి పెద్దవాళ్ళు ఇలాంటి ఒప్పందాలు చేసుకోవడం ***ఇంకా జరుగుతున్న తెలుగుదనం.*** అదీగాక దగ్గరబంధువులైనా (ఉదా: బావామరదళ్ళు, మేనమామ మేనకోడళ్ళు) వాళ్ళకు పెళ్ళి చేయడం ***ఇంకొక తెలుగుదనం.***

బంధువుల పెళ్ళి పశ్చిమబెంగాల్ లాంటి మిగతా రాష్ట్రాలలో నిషేధం. ISI లో నా క్లాస్ మేట్ ఒక బెంగాలీ అమ్మాయి తనకు 2వ తరం బంధువైన ఒక అబ్బాయిని ప్రేమించింది. తల్లిదండ్రులు వాళ్ళ పెళ్ళి నిషేధమని చెప్పి, ఒకరినొకరు మర్చిపొమ్మని ఆంక్షలు విధించారట. కానీ వీళ్ళు తల్లిదండ్రులకు తెలియకుండా కలుసుకుంటుండేవారు. చదువైపోయిన తర్వాత వాళ్ళిద్దరూ ఢిల్లీలో ఉద్యోగాలు సంపాదించు కొని పశ్చిమబెంగాల్ ని వదిలేశారు. పెద్దలను ధిక్కరించి, అక్కడ వాళ్ళు రిజిష్టర్ వివాహం చేసుకున్నారని

విన్నాను.

మళ్ళీ నా విషయానికొద్దాం. నేను ప్రెసిడెన్సీ కాలేజీలో చేరాక ఒకసారి సాయంకాలం భోజనం తర్వాత ఈ పెద్దమామయ్యగారి ఇంటికి వెళ్ళాను. "కాఫీ తీసుకుంటావా" అని అడిగారు మామయ్య. నేను కాఫీ త్రాగనని చెప్తే పాలు తీసుకుంటావా అని అడిగారు. నేను సరే అన్నాను. అప్పుడు మామయ్య, అత్తమ్మకు "గోపాలంకు పాలు తీసుకురావే. చిక్కటి పాలు అబ్బాయికి అజీర్ణం చేస్తాయేమో, కొద్దిగా పల్చబరిచి ఒక్క గ్లాసుడు పట్టుకురా" అని చెప్పారు. అది విన్నతర్వాత నాకు ఎందుకనో వాళ్ళతో సంబంధం అంటే విముఖత్వం మొదలయ్యింది. అదీకాక ప్రెసిడెన్సీ కాలేజీలో చాలామంది స్నేహితులు దగ్గరబంధువుల పిల్లలతో వివాహబంధాలు మంచివి కాదని చెప్పారు. వీటన్నిటి మూలాన ఆ మామయ్య కూతురిని చేపట్టకూడదని నిర్ణయించుకున్నాను.

మొదటి సంవత్సరం తర్వాత వేసవి శెలవలకు ఇంటికి వెళ్ళిన వెంటనే తెలిశిన విషయం ఏమిటంటే, ఈ మామయ్య వారంరోజులు క్రితమే ఒక బలగంతో వచ్చి, నానుస్తున్న మా నాన్నగారిని ఒప్పించి, నాకు తన కూతురుతో వివాహం జరిపించడానికి తాంబూలాలు పుచ్చుకుని వెళ్ళిపోయాడని. మద్రాసులోనే ఉంటున్న నాకు ఇది జరుగుబోతున్నట్లు తెలియకుండా రహస్యంగా ఎలా చేశారో ఏమో. నేను వెంటనే నాకీ సంబంధం ఇష్టం లేదని మా తల్లిదండ్రులకు చెప్పాను. ఈ విషయం మా నాన్నగారు మామయ్యకు చెప్పితే "కుర్రవాడికి ఇంకా చిన్నవయస్సే గదా. తర్వాత చెప్తే వింటాడు. మాకు ఆగడానికి అభ్యంతరం లేదు" అన్నాడట.

ఈ విషయం ఇలానే చాలా సంవత్సరాలు సాగింది. నేను మద్రాసులో Bsc.(Honors) పూర్తిచేశి కలకత్తాలో M.Stat పూర్తి చేశి ఉద్యోగంలో చేరిన తర్వాత గూడా కొన్నాళ్ళు సాగింది. చివరకు వాళ్ళకే విసుగెత్తి వాళ్ళమ్మాయికి వేరే సంబంధం చేసుకున్నారట. పాపం ఇన్ని సంవత్సరాలు ఆ అమ్మాయి ఎంత బాధపడి ఉంటుందో.

ఎన్ని మనస్పర్ధలు ఉన్నాసరే, శెలవలమీద వెళ్ళినప్పుడు బంధువులందర్నీ కలవడం నా ముఖ్యమైన అలవాటు. వాళ్ళమ్మాయి పెళ్ళయిన కొన్ని సంవత్సరాల తర్వాత ఈ మామయ్య గారిని కలవడానికి వెళ్ళాను. అప్పుడు అత్తమ్మ అన్నది " మాకు అదృష్టం కుదరక పోయింది నాయనా అయినా నువ్వు ఎవ్వరో నచ్చిన అమ్మాయిని చూశి త్వరలో పెళ్ళి చేసుకో, బ్రహ్మచారి ముదిరినా, బెండకాయ ముదిరినా మంచిది కాదని అంటారు." అప్పుడు నా కనిపించింది బంధువులకు చెయ్యాల్సిన పని మనం చెయ్యకపోయినా, మనం

వాళ్ళని ఆప్యాయంగా పలకరిస్తే, వాళ్ళు ఆప్యాయంగానే జవాబిస్తారు అని.

చివరకు నా వివాహం నా తల్లిదండ్రులు నిశ్చయించిన Arranged match నా ఒప్పందంతోనే జరిగిపోయింది. శుద్ధశాకాహారినైన నేను, ఒక మాంసాహారిని పెళ్ళి చేసుకున్నాను. నాకూ, మా ఆవిడకూ ఎప్పుడు పోట్లాటలే. నా అదృష్టం అలా ఉందనుకోండి. మా ఆవిణ్ణి గురించి చెప్పడానికి ఒక ఉద్గ్రంథం కావాలి, వీలుంటే దాన్ని తర్వాత వ్రాస్తాను. కానీ, నా తల్లిదండ్రులు మాత్రం నేను  స్వయంగా కోరుకున్న అమ్మాయితోనే నా వివాహం జరిపించారని చెప్పక తప్పదు.

నేను జంకకుండా నా మనోవాంఛను చెప్పుకోవడం మూలాన నా వివాహం నా సమ్మతితోనే జరిగింది.

కానీ మరికొందరు తెలుగు స్నేహితుల అనుభవాలు వేరు. మేము కాలిఫోర్నియాలో కలిశిన ఒక తెలుగు స్నేహితుడి అనుభవం చెప్తాను. అప్పుడు అతడు అవివాహితుడు. కానీ ఒక తెల్ల అమ్మాయితో కలిసి నివసించేవాడు. వివాహం కాకపోయినా, వాళ్ళిద్దరూ ఒకే అపార్టుమెంటులో నివసించేవాళ్ళు. ఆ అపార్టుమెంటులో ఒకే ఒక బెడ్ ఉండేది కూడ గూడా.  ఈ ఏర్పాటు చాలా సంవత్సరాలు సాగింది.

ఒకరోజు ఆయనకు తన ఇంటినుంచి తన వయస్సు మళ్ళిన తండ్రి హృద్రోగం చాలా సీరియస్ కండిషన్ లో ఉందనీ, వెంటనే ఇంటికి రమ్మనీ ఫోన్ వచ్చింది. హడావడిగా టిక్కెట్టు కొనుక్కొని అతను ఇండియా బయలు దేరాడు. మేమంతా సాగనంపడానికి విమానాశ్రయానికి వెళ్ళాం. అతన్ని ఆ అమ్మాయే తీసుకువచ్చింది విమానాశ్రయానికి. వెళ్ళేటప్పుడు ఆ అమ్మాయి కంట తడిచూశి "హనీ, రెండు వారాల్లో వచ్చేస్తాను. దిగులు చెందవమాక" అని చెప్పాడు అతను.

అతను ఒంటరిగా తిరిగిరాలేదు. "ఏం చెయ్యను మాస్టారూ, బలవంతం చేశి అక్కడ ఒక అమ్మాయితో పెళ్ళి చేశేశారు" అంటూ చెప్పాడు. అతని తెల్ల స్నేహితురాలు ఏమనుకున్నదో, ఎంత కుమిలిపోయిందో మాకు పూర్తిగా తెలియదు. కానీ, చాలా సంవత్సరాల వరకూ ఆఅమ్మాయి ఒంటరిగానే నివసిస్తున్నట్లు మాకు తెలిశింది. సాధారణంగా తెల్ల అమ్మాయిలు, అబ్బాయిలను మనం దుస్తులు మార్చుకున్నట్లు మార్చేస్తారని అనుకుంటాం గానీ, ఈ అమ్మాయి విషయంలో అది నిజం కాలేదు.

చాలామంది అంటూంటారు "మా తల్లిదండ్రులు, వ్యక్తిగత విషయాల్లో కూడా స్వతంత్రం ఇవ్వకుండా నా జీవితం నాశనం చేశారు." అని. ఆ స్వతంత్రం ఎవరో ఇచ్చేది

కాదు, తామే ధైర్యం చేశి దాన్ని తీసుకోవాలి అని వీళ్ళు నేర్చుకోవాలి.

# 20. తెలుగు వనితల పుట్టింటి సంబంధాలు

పెళ్ళయ్యి, కొత్తగా కాపురానికి వెళ్ళినప్పుడు అమ్మాయిలు తమ నివాసాన్ని తల్లిదండ్రుల ఇంటినుంచి భర్త ఇంటికి మారుస్తారు. దీనివల్ల కొంతమందికి బాధకల్గవచ్చు. ఆ బాధను తగ్గించడానికి కాబోలు మొదటి 2 సంవత్సరాల్లోను ఆషాడమాసమనో, లేక ఇంకేవేవో సాకులు చెప్పి పుట్టింటివాళ్ళు వాళ్ళఅమ్మాయిని తరచు తమ ఇంటికి తీసుకు వస్తుంటారు. విరహం ప్రేమను పెంచుతుంది అంటారు గదా, కొత్త దంపతుల్లో ఒకరిమీద ఒకరికి అనురాగం పెంచి వారి జీవితం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ ఆచారాలు పెట్టి ఉంటారు. భార్యతో దాంపత్య జీవితం కొత్తగా చవిచూస్తున్న అబ్బాయిలకు సాధారణంగా ఈ ఆచారాలు అస్సలు నచ్చవు, అయినా కాపురం క్రొత్తలో తెలుగు వనితలు పుట్టింటికి రాకపోకలు తరచూ సాగిస్తునే ఉంటారు. ఈ ఆచారం ***ఒక విశిష్ట తెలుగుదనం.***

ఇదేకాక సర్వసాధారణంగా తెలుగువనితలు తమ మొదటికాన్పు పురుడు అమ్మ అండలో పోసుకోవడానికి పుట్టింటికి వచ్చేస్తారు. తర్వాత కాన్పులకు కూడా చాలామంది పుట్టింటికి వస్తూంటారు. ఈ ఆచరణ ప్రవాసాంధ్రుల్లో తక్కువగానీ, ఇండియాలో నివశించే తెలుగువారిలో సాధారణం. అందుకే ఇది ***ఒక భారతీయ తెలుగుదనం*** అని చెప్పుకోవచ్చు.

కొంతమంది తెలుగువనితలు చిన్నవయస్సులో ఉన్న పిల్లల్ని తమ తల్లిదండ్రుల ఇంటికి తరచూ పంపిస్తూంటారు. నేను అలానే నాకు 10 సంవత్సరాలు వచ్చేవరకూ సగం కాలం మా తాతగారింట్లో పెరిగాను. దీనివల్ల మా తాత, అమ్మమ్మలతోనూ, మామయ్య, బాబాయిలు, చిన్నమ్మలూ, పెద్దమ్మలతోనూ, వాళ్ళ పిల్లలతోనూ నాకు బాగా స్నేహం ఏర్పడింది.

కూతురు కాపురానికి వెళ్ళి తన కుటుంబాన్ని మొదలు పెట్టిన తర్వాత గూడా ఆఅమ్మాయి బాధ్యతలు తమ నెత్తిమీద వేసుకొని భరించడం ***ఒక తెలుగు ఆచారం***. ఇలాంటి ఆచారాలు ఇతర జాతుల్లో కొద్దోగొప్పో ఉన్నా, తెలుగువారు వీటిని పాటించినంత

ఇతరులు పాటిస్తారనుకోను.

నాచిన్నప్పుడు మాతాతగారి ఊళ్ళో జరిగిన ఒక హాస్యసంఘటన చెప్తాను. అందరి తాతయ్యల్లోకి చిన్నవాడైన మా చిన్నతాతయ్య చాలా పడుచువాడు అప్పుడు. ఆయన భార్య అయిన మా చిన్నమ్మమ్మ చాలా అందమైనది. ఆ చినతాతయ్య రసికుడని అంతా అనుకునేవారు.

ఆ రోజుల్లో మా ఇళ్ళల్లో స్త్రీలు ముట్టయినప్పుడు, పిల్లలకంతా తాకవద్దని హెచ్చరిస్తూ, బయట చాపమీద గడిపేవారు. వీళ్ళకు ముట్టయినట్లు ఎలా తెలుస్తుందా అనీ, మిగతా సెక్సు విషయాలను గురించీ, పిల్లలంతా కుతూహలంగా ఉండేవాళ్ళం.

ఈ సంఘటన జరిగినప్పుడు మా బంధువుల్లో రత్తమ్మ అనే అమ్మాయికి చాలా చిన్నవయస్సులోనే పెళ్ళి జరిగి, మూడురాత్రుల ముచ్చట్లు అవుతున్నాయి. నాకంటే పెద్దవాడైన ఒక అబ్బాయి ఏదో పుస్తకం చంకక్రింద దాచుకొని, "గోపాలం రారా నీకొకటి చూపిస్తాను" అంటూ పిలిచాడు. అది సెక్సుపుస్తకం. మా చినతాతయ్య గారి పోర్షన్లో ఒక బల్లమీద ఇతనికి కనిపించిదట. మేమిద్దరం ఒక స్టోర్ రూము గదిలో మూల కూర్చొని ఆ పుస్తకం చదవడం మొదలుపెట్టాం చాలా ఆత్రంగా. దురదృష్టవశాత్తూ చినతాతయ్య ఆ గదిలోకి వచ్చాడు అప్పుడు. మేము భయం భయంగా చూస్తున్న వైఖరికి అనుమానం వచ్చి, దాచడానికి ప్రయత్నిస్తున్న పుస్తకాన్ని లాక్కొని "ఓరీ వెధవల్లారా, చిన్న పిల్లలు చూడగూడదురా దాన్ని" అంటూ మా ఇద్దరి వీపులూ వాయించాడు. అప్పుడు రెండో అబ్బాయి "అదేంటి తాతయ్యా అలా అంటావు. నాకంటే చిన్నది రత్తమ్మ అప్పుడే వీటిని చెయ్యడంలా?" అంటూ గునిశాడు.

తమ పిల్లలు యవ్వనంలో అడుగుపెడ్తునప్పుడు గూడా, చదువు పూర్తయ్యి పెళ్ళయ్యేంత వరకూ సెక్సుని గురించి వాళ్ళు తెలుసుకోకుండా ఉంచాలని తాపత్రయ పడడం ***తెలుగు పెద్దవారి విశిష్ట తెలుగుదనం.***

# 21. కుటుంబంలో కొత్తకోడలి స్థానం

తెలుగు సాహిత్యంలో ఈ క్రింది అద్భుతమైన గేయం నుంచి ఇంట్లో చేరిన కొత్తకోడలి స్థానం గురించి తెలుసుకోవచ్చు. నాకు చాల నచ్చిన ఈగేయం కొన్ని **ముఖ్యమైన**

తెలుగుదనాలని సూచిస్తుంది.

## కొత్తకోడలు

కలవారి కోడలు కలికి కామాక్షి
కడుగుచున్నది పప్పు కడవలో బోసి
అప్పుడే వచ్చాడు ఆమె పెద్దన్న
కాళ్ళకు నీరిచ్చి కన్నీరు నింపె

అన్న: ఎందుకూ కన్నీరు, ఏమి కష్టాలూ
తుడుచుకో చెల్లెలా తుడుచుకో
పెట్టుకో సొమ్ములూ కట్టుకో చీరె
ముడుచుకో కురులూ, ఎక్కుఅందలమూ
చేరి మీ అత్తమామలకు చెప్పిరావమ్మా
కోడలు: కుర్చీ పీటమీద కూర్చున్న అత్తా
మాయన్నలొచ్చారు, మమ్మంపుతారా?
అత్త: నేనెరుగ, నేనెరుగ, నీ మామనడుగు.
కోడలు: పట్టె మంచం మీద పడుకున్న మామా
మాయన్నలొచ్చారు మమ్మంపుతారా?
మామ: నేనెరుగ, నేనెరుగ, మీయక్క నడుగు
కోడలు: వంటలూ చేశేటి ఓయక్క గారూ
మాయన్నలొచ్చారు, మమ్మంపుతారా?
తోటికోడలు: నేనెరుగ, నేనెరుగ, నీభర్త నడుగు
కోడలు : రచ్చలో కూర్చున్న రాజేంద్ర భోగీ
మాయన్నలొచ్చారు, మమ్మంపుతారా?
భర్త: పెట్టుకో సొమ్ములూ, కట్టుకోచీరా
పోయిరా సుఖముగా పుట్టినింటికినీ
కోడలు: ఇరుగుపొరుగు ఓయమ్మలారా

చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు సేవించబోయి
మరదలూ పెళ్ళికీ మరలి వచ్చేనూ
ఇరుగక్క, పొరుగక్క ఇదే పోయివత్తూ

ఈ గేయం వ్రాయబడిన రోజుల్లో కొత్తకోడలు తను చెయ్యబోయే ప్రతి పనికీ అత్తమామల అనుమతి పొందాలని తెలుస్తుంది. అప్పటికీ, ఇప్పటికీ పరిస్థితుల్లో చాలా మార్పులు వచ్చాయనుకోండి.

అబ్బాయి తన తల్లిదండ్రులుండే ఊరుకాక ఇంకో ఊరులో ఉద్యోగం చేస్తుంటే, కొత్త దంపతులు తమంతట తామే ఆ ఊరులో వేరుగా నివశించడం జరుగుతుంది. అలా అయితే అతని భార్యకు తమ కుటుంబ వ్యవహారాలు తనకు నచ్చిన విధంగా చేసుకోవడానికి కొంత స్వతంత్రం లభిస్తుంది.

అలాకాక, అబ్బాయి, తల్లిదండ్రులు నివసించే ఊరులోనే ఉండేట్లయితే, నూతన దంపతులు అబ్బాయి తల్లిదండ్రులతో సమిష్టి కుటుంబంగా ఉండడం జరుగుతుంది సాధారణంగా ఇండియాలో. ఇలాంటప్పుడు నూతనవధువు తన భర్త తల్లిదండ్రుల వాంఛల ప్రకారం నివసించాల్సి వస్తుంది.

పెళ్ళి అయ్యాక రాబోయే దాంపత్య జీవితానికి ఒక వైపు మనస్సు ఉవ్విళ్ళూరుతున్నా; ఇంకోవైపు, అత్తమామలూ, తనభర్త, తన స్వతంత్రాన్ని అపహరిస్తారని భయపడడం ***తెలుగు వనితల సాధారణమైన తెలుగుదనం.***

తన భర్తతో వేరుగా నివసించే తెలుగు వనితలు గూడా, అత్తమామలు తనింటికి విజిట్ కి వస్తుంటే, వాళ్ళు తన ఇంట్లో ఉన్నన్నాళ్లూ తనమీద బాస్ చేస్తారని భయపడడం ***సర్వసాధారణమైన తెలుగు వనితాదనం.***

# 22. తెలుగు దాంపత్యాల ఆరోగ్యం

నేను బందరు హిందూ హైస్కూలులో చదువుకున్నప్పుడు మాకు మునిమాణిక్యం పంతులుగారు పాఠాలు చెప్పేవారు. మునిమాణిక్యంగారు కూడా మా నక్కలతోటలోనే నివసించేవారు గనుక, ఆయనా, ఆయన సతీమణి నాకు బాగా పరిచయమే.

అప్పుడు ఆయన వ్రాశిన దాంపత్యోపనిషత్తు, కాంతం కథలూ చదివాను. ఈ పుస్తకాలలోని సున్నితమైన హాస్యం నాకు ఎంతో నచ్చింది. దాంపత్యం మీద ప్రపంచ సాహిత్యమంతటిలోనూ ఇవి అతిశ్రేష్టమైన పుస్తకాలని నా అభిప్రాయం.

ఆ మధ్య న్యూజెర్సీలో ఒక ప్రవాసాంధ్రుడి భార్యా పెట్రోలుతో తన శరీరానికి మంటపెట్టుకొని ఆత్మహత్య చేసుకుందని వార్తల్లో విన్నాను. అదేకాక, చాలమంది తెలుగు దంపతులు ఒకరుమీద ఒకరు కసురు కోవడం, తెలుగువనితలు చీటికీ మాటికీ భర్తలమీద అలిగి వాళ్ళకు సెక్సురేషనింగ్ పెట్టడం చూస్తూనే ఉంటాం. *భర్త మీద అలిగినప్పుడు మూతిమూడుచుకొని సెక్సుకి రేషనింగు పెట్టడం* **సర్వసాధారణమైన భారతీయ వనితాదనం** *(వాల్మీకి రామాయణంలో కైకేయి దశరథుడిమీద ఈ ఆయుధాన్నే వాడింది తన కొడుకైన భరతుడికి రాజ్యం ఇప్పించడానికి).*

వీటిని చూశి దంపతులు ఆనందంగా ఉండడానికి సలహాలిచ్చే కవితలను ఎవ్వరైనా అల్లారా అని వెతికాను. తెలుగులో ఏమీ కన్పడలేదు గానీ, సంస్కృతంలో కాళిదాసు వ్రాశిన మంచి శ్లోకం ఒకటి కనపడింది విక్రమోర్వశీయం గ్రంధంలో.

మగవాడిని తృప్తిగా ఉంచడానికి అతని భార్యా ఎలా ప్రవర్తించాలో కాళిదాసు ఈ శ్లోకంలో చెప్పారు.

కార్యేషు మంత్రీ
కరణేషు దాసీ
శయనేచ రంభా
క్షమయా ధరిత్రీ
భోజ్యేషు మాతా
రూపేచ లక్ష్మీ
షట్ కర్మ యుక్తా
కుల ధర్మపత్నీ

ఇదే ఫక్కీలో స్త్రీని తృప్తిగా ఉంచడానికి ఆవిడ భర్త ఎలా ప్రవర్తించాలో చెప్పడానికి నేను ఈ పద్యం కల్పించాను.

రక్షణకు లక్ష్మణుడు
రతి క్రీడకు శ్రీ కృష్ణుడు
విధేయతకు హనుమంతుడు
నమ్మకానికి ఉన్నతజాతి పెంపుడు కుక్క
తోడుకు గువ్వ
ధనార్జనకు బిల్ గేట్సు
డబ్బు పంచుకోడంలో దానకర్ణుడు
యుక్తికి జిత్తులమారి నక్క
నవ్వించడానికి రేలంగి
మెప్పుచూపించడంలో పరవశించిన వీరాభిమాని
సహనానికి లాలించే తండ్రి
ఆదరణకు గౌరవించే గురువు

ఇట్టి పతిని పొందడమే గదా
పడతుల స్వప్న లక్ష్యం

ఇవన్నీ చెప్పడం తేలిక, ఆచరించడం కష్టం అనుకోండి. నా చిన్న అనుభవం ఒకటి చెప్తాను. నేను మద్రాసులో చదువుకునేటప్పుడు నన్ను చాలా ఆప్యాయంగా చూశే ఒక మామయ్య ఇంటికి తరచూ వెళ్తుండేవాణ్ణి.

మామయ్యా, అత్తమ్మా పడుచువాళ్ళే, పిల్లలు ఇంకా లేరు అప్పుడు. అత్తమ్మను చూశినప్పుడల్లా "జీవితం ఎలా ఉంది అత్తమ్మా" అని అడిగితే, నీరసంగా, "ఏముంది గోపాలం, ఏదో సాగుతోంది" అనేది. వాళ్ళతో బాగా చనువు గనుక, వాళ్ళ జీవితాన్ని ఉత్తేజపరచడానికి ఏమి చెయ్యాలో నా ఆలోచనలు మామయ్యతో చర్చిస్తుండేవాణ్ణి. ఒక రోజు మధ్యాహ్నమల్లా ఎండ మాడ్చేశి, సాయంత్రానికి నేను వాళ్ళింటికి చేరేటప్పటికి ఆకాశంలో మేఘాలు చేరి చాలా హాయిగా ఉంది. అప్పుడు మామయ్యను త్వరగా తయారయ్యి అత్తమ్మను మెరీనాబీచ్ కి తీసుకు వెళ్ళమని బలవంతం చేశాను. ఒప్పుకొని, "నువ్వుకూడా రా, కలిసి వెళ్దాం" అన్నాడు. "మధ్యన పానకంలో పుడకలా

నేనెందుకు; అత్తమ్మ, నువ్వూ వెళ్ళి బాగా ఆనందించండి" అంటూ నేను వాళ్ళను బస్సులో ఎక్కించి, ఇంకో మామయ్య ఇంటికి వెళ్ళిపోయాను.

తర్వాత మళ్ళీ కలిశినప్పుడు మామయ్య వాళ్ళ మెరీనాబీచ్ ట్రిప్పు ఎలా జరిగిందో చెప్పాడు. బస్సు దిగి బీచ్ వైపు నడవడం మొదలెట్టేంతవరకూ అంతా బాగానే ఉందట. కానీ కొద్ది నిమిషాల్లో వర్షం కురవడం మొదలు పెట్టిందట. తిరుగు ట్రిప్పు బస్సు రావడానికి చాలా ఆలస్యమయ్యిందట. ఈ లోపల తడిశి ముద్దయిపోయారట. తడిగుడ్డలతో తంటాలుపడి ఇంటికి చేరేప్పటికి చాలా ఆలస్యం అయ్యి బోలెడు చిరాకు వేశింది అన్నాడు....... నీరశించిన మా మామయ్య, అత్తమ్మల దాంపత్యాన్ని ఉత్తేజ పరచడానికి నేను చేసిన చిన్నప్రయత్నం ఇలా అంతమయ్యింది.

అదీకాక, కొంతమందికి ఎంతజేశినా తృప్తి కల్గదనుకోండి. అయినా, భార్యాభర్తలిద్దరూ ఈ శ్లోకం, పద్యాల కనుగుణంగా ప్రవర్తిండం నేర్చుకుంటే, కనీసం కొన్ని సంవత్సరాలు వారి దాంపత్యం హాయిగా గడవచ్చుననిపిస్తోంది.

మేము కైకలూరులో ఉండేటప్పుడు జరిగిన ఒక సంఘటన చెప్తాను. నేను ఎలిమెంటరీస్కూలులో చదువుకుంటున్న రోజులు. మేము రెండు పోర్షన్లు ఉన్న ఒక పెంకుటింట్లో ఒక పోర్షన్లో ఉండేవాళ్ళం. వెనకాల దొడ్డీ, దాని చివర ఒక ఎత్తైన ప్రహారీగోడ ఉండేవి. ఆ ప్రహారీగోడకు మా పోర్షన్లో ఒకచెక్కతలుపు ఉండేది. ఆతలుపు తెరిసి చూస్తే రెండుగోడల మధ్య ఒక సన్నటిసందూ, ఆ సందుగుండా ప్రవహించే మురికినీటి కాలువ కనిపిస్తాయి. అందుకనే ఆతలుపుకి ఎప్పుడూ గొళ్ళెం వేశి ఉంచేవారు. ఆరోజుల్లో ఇంట్లో వచ్చిన కాయగూరల తొక్కలు అన్నీ ఇంటి ముందు ఒక దిబ్బ మీద పడేశేవారు.

అప్పుడు మానాన్నగారు రెవెన్యూఇన్స్పెక్టరుగా ఉద్యోగం చేశేవారు. ఒకసారి తనబాసుతో బాటు ఇంకోక ఊరుకి క్యాంపుమీద వెళ్ళారు మానాన్నగారు. మూడురోజుల తర్వాత ఆయన తిరిగివచ్చేటప్పటికి ఇంట్లో పిల్లలం అంతా పడుకున్నాం. మగతనిద్రలో మానాన్నగారు తలుపుతట్టడం విన్నాను. ఆరోజు రాత్రి మా నాన్నగారూ, అమ్మ వాళ్ళ పడకగదిలో చాలాసేపు మాట్లాడుకోవడం నాకు తెలిశింది. నిద్రవల్ల నాకు వాళ్ళు ఏమి మాట్లడుకున్నారో తెలియలేదు.

ఇలా రాత్రిపడకగదిలో భర్త ఆ దినం ఎలా గడిచిందీ చెప్పడం, భార్య ఓపిగ్గా, విమర్శించకుండా వినడం, అలానే ఆరోజు తన అనుభవాలని భార్య చెబితే భర్త వినడం ***దాంపత్యజీవితంలో అసలైన మధురాతిమధురక్షణాలని నా అభిప్రాయం.***

టి.వి ప్రబలిన ఈ కాలంలో అలాంటి సంభాషణ అరుదైపోతోంది. అదీకాక ఈ కాలంలో స్త్రీలకు, పురుషులకూ ఇతరులు చెప్తుంటే వినే ఓపిక క్షీణిస్తోంది. వీటివల్ల దంపతులమధ్య తిట్లు, కసురులతోకూడిన క్లుప్తసంభాషణలు సామాన్యం అవ్వడం ***ఈ కాలపు మానవదనం*** అయిపోతోంది.

కానీ ఇరువురూ రాత్రి పడకగదిలో అన్యోన్యంగా మాట్లాడుకునే చిత్రం నా మనోఫలకంలో నా తల్లిదండ్రుల దాంపత్యచిహ్నంగా మిగిలిపోయింది.

మర్నాడు ప్రొద్దున వంటగదిలో నేను అంతవరకూ ఎప్పుడూచూడని రెండు కొత్తకాయగూరలు కనిపించాయి. మనాన్నగారు తనక్యాంపునుంచి వాటిని తెచ్చారని అమ్మ చెప్పింది. ఎర్రది బీట్ రూట్ అనీ, పచ్చవి పచ్చిబటాణీ కాయలు అనీ చెప్పింది. మానాన్నగారు, అమ్మకు వాటిని ఎలా చెయ్యాలో చెప్తున్నారు. తొక్కల్ని ఇంటిముందు దిబ్బమీదవేస్తే, ఇరుగూపోరుగూ కుతూహలపడి, ఆరాలుతీశి, ఈర్షపడ్తారు అనీ, అందుకనే తొక్కల్ని ఎవరకీ కనిపించకుండా ఇంటివెనకాల సందులో ఉన్న మురికికాలవలో పడెయ్యమనీ చెప్పారు. పక్కఇళ్ళల్లో ఏదైనా వింత జరుగుతోందని అనుమానం కల్గితే కూతూహలంతో ఆరాలు తియ్యడం, ఆవిషయాలు అందరికీ పుకారులాగా చెప్పడం, ***ఒక తెలుగుదనం గదా.***

మా నాయనమ్మకు ఆకాలంలో రక్తహీనం (ఎనీమియా) ఉండేది. రక్తంరంగులో ఉన్న బీట్రూటు తనకు మంచిచేస్తుందని, ఆకూరంతా మా నాయనమ్మ తినడానికి ఉంచేశారు. మూడురోజులతర్వాత మానాయనమ్మకు నులకమంచం మోకాలమీద గీసుకొని చిన్నిగాయం అయ్యింది. దానివల్ల కొన్ని బొట్లరక్తం కారింది. ఆరక్తం చాలా ఎర్రగా ఉందని అందరూ అనుకున్నారు. దాంతో బీట్ రూటు తనకు చాలా మంచిచేస్తోందనే నమ్మకం కల్గింది అందరికీ. అప్పటినుంచి మానాయనమ్మకు బీటురూటు తరచూ తెప్పించి తినిపించేవారు. ఇలా వృద్ధాప్యంలోనున్న తమ తల్లిదండ్రులను ప్రేమతో బాధ్యతాయుతంగా పోషించడం ఒక జీవితగమ్యంగా ఉండి దంపతులనిరువురనూ ఐక్యపరిచేది ఆకాలంలో.

## 23. కళల పోషణ

కలకత్తాలో ప్రవాసాంధ్రుడిగా 10 సంవత్సరాలు (1955 నుంచి 1965 వరకూ) ఉన్నాను. ఆరోజుల్లో శనివారం కూడా ఆఫీసురోజుగా ఉండేది, వారానికి ఆదివారం ఒక్కరోజే శెలవు రోజుగా ఉండేది. నగరం మధ్య Esplanadeలో కొన్ని సినిమా థియేటర్లు ఆదివారం ప్రొద్దున్న 10 గంటల షోకి తెలుగు సినిమాలు వేశేవారు. నగరం మారుమూలలనుంచి ఎంతో దూరం ప్రయాణం చేసివచ్చే ప్రవాసాంధ్రులతో ఆ షోలు ప్రతి ఆదివారం కిక్కిరిసిపోతుండేవి. ఆ సినిమా చూశి ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి సాయంత్రం అయిపోయి ఆ ఒక్క శెలవు రోజు గడిచి పోయేది.

ఇలానే ఆంధ్ర మహాసభలాంటి సంస్థలు పెట్టే కూచిపూడి, భరతనాట్యం ప్రోగ్రాములూ, తెలుగు నాటకప్రోగ్రాములూ, సినిమా పాటల కచేరీలు కూడా ప్రేక్షకులతో కిక్కిరిసిపోతుండేవి.

కలకత్తాలో నాకు ఒక బెంగాలీ ముస్లిం యువకుడు చాలా దగ్గిర స్నేహితుడయ్యాడు. అతను బెంగాలీ చాలా బాగా మాట్లాతాడు గానీ నాతో ఎప్పుడో ఇంగ్లీషులోనే మాట్లాడేవాడు. నాకు బెంగాలీ నేర్పించమని నేను  అడుగుతున్నా వినేవాడు కాదు. ఒక దీపావళికి కలకత్తా ఆంధ్రమహాసభవారి డిన్నర్ కల్చరల్ ప్రోగ్రాంకి  ఇతన్ని తీసుకువెళ్ళాను. చాలా ఆనందించి, You have such beautiful culture, why do you have to learn Bengali అన్నాడు.

ఎందుకనో శాస్త్రీయ సంగీతం మీద ఎక్కువమంది తెలుగువారికి అభిరుచి ఉండదు, కర్ణాటక సంగీతంలో పెద్దభాగం త్యాగరాజు తెలుగులో వ్రాశిన కృతులే అయినా, మద్రాసు, కలకత్తా, అమెరికా, హాంకాంగ్‌ల్లో శాస్త్రీయ కర్ణాటక సంగీతం  ప్రోగ్రాముల్లో బోలెడంత మంది తమిళ ప్రేక్షకులూ, మిగతా భారతీయులు కనపడ్తారు గానీ, తెలుగువాళ్ళు అరుదు.

## తెలుగుభాషనూ, తెలుగుప్రోగ్రాంలనూ, తెలుగు కల్చర్ నూ కించపరచుకోవడం

హైద్రాబాద్ లో నివసించే మా తమ్ముడిని విజిట్ చేస్తుండగా ఒక సాయంత్రం మామరదలు (తమ్ముడి భార్య) తన తెలుగు స్నేహితురాలు ఒకావిడ, టీవిలో వచ్చే తెలుగు ప్రోగ్రాం చూడ్డానికి వస్తారని చెప్పింది. కాసేపట్లో ఆవిడ ఒంటరిగానే వచ్చారు. చూడ్డానికి బాగా డబ్బు ఉన్న ఆవిడలాగానే కన్పించింది ఆవిడ. మరి టీవిప్రోగ్రాం చూడ్డానికి ఇక్కడకు

ఎందుకు రావలసివచ్చిందో అర్థంకాక "ఏమండీ మీ టీవి రిపేరులో ఉందా?" అని అడిగాను. "లేదండీ, మా టీవి బాగానే పనిచేస్తోంది. మా ఆయనకు తెలుగు ప్రోగ్రాంల మీద గౌరవం లేదు. ఆయన ఎప్పుడూ హింది ప్రోగ్రాంలు చూస్తుంటారు. అందుకనే మంచి తెలుగు ప్రోగ్రాంలు ఉన్నాయని తెలిస్తే నేను ఇక్కడకు వచ్చి చూస్తుంటాను" అని ఆవిడ చెప్పింది.

ఇలానే కొంతమంది తెలుగువాళ్ళు తెలుగు సంగీతం, పాటలను గౌరవించక హిందీ సంగీతమే ఎప్పుడూ వింటుంటారు.

నా చిన్నప్పుడు జరిగిన ఇంకో విషయం చెప్తాను. నా స్నేహితుడిఅన్నయ్య ఏదో ప్రోగ్రాం మీద అమెరికా ఒక సంవత్సరం వెళ్ళాడు. అతను ఇండియా తిరిగివచ్చి ఇంటికి వచ్చిన రోజున నేను వాళ్ళ ఇంట్లోనే ఉన్నాను. వాళ్ళ అమ్మగారు ఎంతో సంతోషంతో "క్షేమంగా తిరిగి వచ్చావా నాయనా" అని ఆప్యాయంగా అతన్ని పలకరించారు. అతను ఇంగ్లీషులో " O mommy, I do not know how I can communicate with you. You see, I have forgotten your language...." అంటూ వాగాడు. నాకు అప్పుడు ఇంగ్లీషు అంతగా రాదు గనుక, పూర్తిగా అర్థంకాలేదు. కానీ పైన చెప్పిన భావం అందులో గ్రహించాను. చిన్నప్పటి నుంచీ మాట్లాడి నేర్చుకున్న తెలుగుభాషను అతను ఒక్క సంవత్సరంలో అంతగా ఎలా మర్చిపోగలిగాడో నాకు తెలియలేదు.

ఇలానే తెలుగు భాషనూ, సంస్కృతినీ నిర్లక్షించడం, కించపరచడం ***కొందరి తెలుగు వారి విచారకరమైన తెలుగుదనం***.

# 24. పుకార్లని నమ్మి సమాజంలో వెదజల్లడం

ISI లో ఐదేళ్ళ గడిపాక 1965లో నేను UCB (యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బెర్క్లీ) లో పిహెచ్.డి. చెయ్యడానికి వెళ్ళాను.

1965లో కలకత్తాలో నేను బెర్క్లీ ప్రయాణానికి తయారవుతున్నది, చైనా కాశ్మీరు మీద దాడిచేశి ఇండియాతో యుద్ధం చేస్తున్న సమయం. పండిత్ నెహ్రూ గారు అప్పుడే పార్లమెంటు స్పీచ్ లో చైనా అపాయం గుర్తించకపోవడం తన మూఢత్వం అంటూ ఒప్పేసుకొని, ఇండియాను రక్షించడానికి అమెరికా అధ్యక్షుడి సహాయం అడిగినట్లు చెప్పారు. అప్పుడు జరిగిన ఒక హాస్య సంఘటన చెప్తాను. దీంట్లో కొన్ని బూతుపదాలు

వస్తాయి కనుక అవి నచ్చనివారు ఈ క్రింది పేరా చదవవద్దు.

నెహ్రూగారి స్పీచ్ తర్వాత ఒక తెలుగు స్నేహితుడు, "చైనాను అమెరికన్లు కూడా ఏమీ చెయ్యలేరండీ" అంటూ వాదించాడు. మీరలా ఎందుకనుకుంటున్నారని అడిగితే ఆయన ఇలా చెప్పాడు, "చైనా వాళ్ళు చాలా వేరండీ. మీకు తెలియక పోవచ్చు, నా స్నేహితుడు ఒకతను చెప్పాడండీ, చైనా స్త్రీలకు పూకురేఖ అందరికీలాగా నిలువుగా ఉండకుండా అడ్డంగా ఉంటుందని. వాళ్లని మిగతా వాళ్ళెవరూ ఏమీ చెయ్యలేరండీ!"

పుకార్లను తేలికగా నమ్మే అమాయకత్వం, నిజానిజాలను తెలుసుకోకుండానే వాటిని సమాజంలో వెదజల్లడం చాలమంది ***తెలుగువారికుండే ఒక తెలుగుదనం.***

# 25. అమెరికాలో కొన్ని పాతా, కొన్ని కొత్తా తెలుగుదనాలు

1965లో బెర్క్లీకి మా ఆవిడా, పెద్దమ్మాయి వాణిలతో వెళ్ళి UCB Married student Housing Flat లో చేరాను. ఆ సంవత్సరం UCBHFకి 6 గురు తెలుగు విద్యార్థులం సతీమణులతోబాటు వచ్చిచేరాం. మిగతా 5 దంపతుల్లో కొంతమందికి అప్పుడే ఒకరూ, ఇద్దరూ పిల్లలున్నారుగానీ, ఆ పిల్లలను ఇండియాలో వదిలేసి వాళ్ళు దంపతులు మాత్రమే వచ్చారు. వీళ్ళందరి మధ్య 1 సంవత్సరం వయస్సుగల మా అమ్మాయి వాణి ఒక్కతే తెలుగు పిల్ల. వాణిని అందుకనే అందరూ చాలా ముద్దు చేశేవారు.

## భోజనప్రియత్వం

అమెరికా వచ్చాక చాలా సంవత్సరాల వరకూ మా సతీమణులు చీరలు కట్టేవారు (ఈ మధ్య వాళ్ళు కూడా skirts, blouses, jackets, పాంట్లు వేసుకోవడం మొదలెట్టారనుకోండి). దీనివల్ల కొత్త తెలుగు విద్యార్థి కుటుంబాలు మేమంతా పరిచయం అవ్వడం కొద్దిరోజుల్లోనే జరిగిపోయింది.

తెలుగుదేశాల్లో తెలుగు కుటుంబాలు ఇతరకుటుంబాలను సాధారణమైన రోజుల్లో భోజనానికి పిలవడం చాలాఅరుదు. పెళ్ళిళ్ళూ, బారసాలలూ, సత్యన్నారాయణ పూజలూ మొదలైన వాటికి బంధువులనూ, స్నేహితులనూ భోజనాలకు పిలుస్తారనుకోండి, కానీ

ఇలాంటి సందర్భాలు లేని సాధారణ రోజుల్లో ఇతరకుటుంబాలను తమ ఇంటికి భోజనానికి పిలవడం చాల అరుదని చెప్పవచ్చు. ***తెలుగుదేశంలో ఇది అరుదైన తెలుగుదనం.***

కానీ బెర్క్లీలో కొత్త తెలుగుదంపతులం పరిచయాలు అయిన కొద్ది రోజుల్లోనే ఒకరినొకరు భోజనాలకు పిలుచుకోవడం జరిగిపోయింది. త్వరలోనే ప్రతివారం ఎవరో ఒకరు మిగతా తెలుగుకుటుంబాలన్నిటినీ తమ ఇంటికి భోజనానికి పిలవడం ఆనవాయితీ అయిపోయింది (కొన్ని వారాలు 2,3 డిన్నర్ పార్టీలు జరిగేవి గూడా). ఎలా ఐనా ***తెలుగువారు భోజనప్రియులుగదా***. మంచివంటకాలు చేసుకోవడానికి, డిన్నర్ పార్టీ మంచి కారణం. అలాంటి వంటకాలు ఇతర స్నేహితులతో పంచుకొని వాళ్ళమెప్పు పొందడం ఒక సరదా. ఇలా ఏమీ పండగ, పబ్బం లేకుండానే ఇతరులను ఇంటికి భోజనానికి పిలవడం ***అమెరికాలో తెలుగువారి కొత్త తెలుగుదనం*** అని నేననుకుంటున్నాను.

మొదటిసారి బెర్క్లీలో డిన్నర్ పార్టీకి వెళ్ళినప్పుడు కొత్తగా పెళ్ళి అయిన ఒక ఇండియన్ దంపతులు కలిశారు. అతన్ని డోగ్రాగారు అని మాకు పరిచయం చేశారు. అతన్ని "మీది కాశ్మీరా" అని అడిగాను. "లేదండీ, మేము తెలుగు వాళ్ళమే. తెలుగుదేశంలో "జామాతా దశమగ్రః" అని సామెత ఉంది కదా. నేను కొత్త అల్లుణ్ణి గనుక దశమగ్రహం అనీ, దగ్రా అనీ పిలవడం మొదలుపెట్టి చివరకు డోగ్రాగా మార్చారు. మా ఆవిడ నూతనవధువు గనుక ఆవిడను నూవమ్మ అని పిలుస్తున్నారు" అని వివరించాడు ఆయన.

సంవత్సరం క్రితమేవచ్చిన ఒక తెలుగు యువకుడు మా డిన్నర్ పార్టీలన్నింటిలోనూ ఉండేవాడు. అతనితండ్రి ఢిల్లీలో చాలాపెద్ద పొజిషన్ లో ఉన్న కేంద్రప్రభుత్వోద్యోగి. ఇతని ట్రిప్పుకి అయ్యే ఖర్చులన్నీ ఒక కంపెనీ వాళ్ళు భరించేటట్లు వాళ్ళ నాన్నగారు ఏర్పరిచారు. హోదా ఉన్నవాళ్ళు తమ పిల్లలకు ఇలా అవకాశాలు కల్పించడం ***ఒక భారతీయదనం.***

మేమంతా UCB స్కాలర్ షిప్పులతో పిహెచ్.డి ప్రోగ్రాంల్లో వచ్చిచేరితే ఈ కుర్రాడు ఆ కంపెనీ డబ్బులతో వచ్చి B.Sc. ప్రోగ్రాంలో చేరాడట. మొదటి సెమిస్టర్ గ్రేడ్సు తక్కువరావడం మూలాన అతని Advisor హైస్కూలుకి మారమని చెప్పాడట.

చదువుసంగతి ఎలాఉన్నా, ఈ కుర్రాడు చాలా కలుపుగోలుమనిషి. "బ్రహ్మచారీ

శతమర్కటః" అంటారు కదా, అలానే కోతిచేష్టలన్నీ చేస్తూ స్త్రీలనందరినీ తెగ నవ్విస్తూ ఉండేవాడు. మొదట్లో మాకెవ్వరికీ కారులు ఉండేవికాదు. ఇతను అవసరం వచ్చిన వాళ్ళకు తన కారులో రైడు ఇచ్చి చాలా సహాయం చేస్తూ ఉండేవాడు.

ఆ కాలంలో డిన్నర్ పార్టీలకు పిలిచిన కుటుంబం వాళ్ళే వంటంతా చేశేవారు. అతిథులు సాధారణంగా ఉత్తి చేతులతోనో, లేక అప్పు డప్పుడూ వైనుసీసాలతోనో వచ్చేవారు. కానీ ఈ మధ్య అమెరికా తెలుగువారిలో ఎవరైనా డిన్నర్ కి పిలిస్తే, "మమ్మల్ని ఏమి చేశి తీసుకురమ్మంటారు" అని అడగడం పరిపాటి అయ్యింది. డిన్నర్ కి వచ్చినవాళ్ళంతా ఏదో ఒక వంటకం తయారుచేసుకొని తీసుకురావడం మమూలయ్యింది. ఇలాంటి డిన్నర్ పార్టీని పాట్లక్ (potluck) అంటారు. పాట్లక్ పార్టీలు తరచూ చేసుకోవడం ***అమెరికా తెలుగువారి కొత్త తెలుగుదనం.***

## కలహప్రియత్వం

పోట్లాడుకోవడం ***తెలుగువాళ్ళ ముఖ్యలక్షణం*** అని తరచూ వింటూంటాం. మేము బెర్క్లీ వచ్చిన కొద్దిరోజుల్లోనే, అక్కడ ఉన్న కొద్దిమంది తెలుగువారిలోనూ కలహాలు మొదలయ్యాయి. రెండు కుటుంబాలు కలహించి ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం మానేశారు. దీని ప్రభావం వాళ్ళ మధ్యనే ఉండక, మా అందరిమీదా చేరింది కూడా. ఆ రెండు కుటుంబాలలో ఎవరినైనా భోజానికి పిలిస్తే "మీరు వాళ్ళను కూడా పిలుస్తున్నారా? అలా అయితే మేము రాము" అని చెప్పేవాళ్ళు. ఆ రెండు కుటుంబాలనూ మళ్ళీ కలపడానికిమేము ఎన్నో ప్లానులు వేశాం, కానీ అవేవీ ఫలించలేదు. వీళ్ళను చూస్తుంటే దేవుళ్ళలో కలహప్రియుడని చెప్పబడే నారదుడు తప్పక తెలుగువాడే అయి ఉండాలనిపించేది.

ఇంకొక కలహప్రియుడైన, ISIలో ఒక తెలుగు స్నేహితుణ్ణి గురించి చెప్తాను. ఇతను ISI కలకత్తాలో ఉండేవాడు. ఈయన అందరితోను పోట్లాటలు పెట్టుకోవడమే కాక, నారదుడిలా ఏవేవో చెప్పి ఇతరులమధ్య కూడా పోట్లాటలు రేకెత్తించేవాడు. ఇతని బాధ భరించలేక హైద్రాబాదుబ్రాంచికి పంపించేశారు. కొన్నాళ్ళ తర్వాత ISI , హైద్రాబాదులో కూడా ఆయనను భరించలేక "బాబ్బాబూ, మీకు జీతం మామూలుగానే ఇస్తాం, కానీ దయచేశి

ఆఫీసుకి రావద్దు. ఇంట్లోనే కూర్చొని మీ పనిచేసుకోండి" అని చెప్పారట.

## ఐకమత్యం లోపించడం

1980లపడిలో ఆన్‌ఆర్బర్ లో ఉన్న తెలుగు స్త్రీలలో ముగ్గురుస్త్రీలు రుచికరమైనవంటలు చెయ్యడంలో చాలా సిద్ధహస్తులని పేరుపొందారు. వీళ్ళుముగ్గురూ కలిసి ఒక ఇండియన్ రెస్టారెంట్ మొదలుపెట్టారు. మొదటి రెండువారాలు చుట్టుపట్ల ఊర్లలోని భారతీయులంతావచ్చి రెస్టారెంటుకి చాలా బిజినెస్ ఇచ్చారు. దాని తర్వాత కస్టమర్స్ సంఖ్య తగ్గడం మొదలయ్యింది. ఒకటిరెండు సార్లు నేను వెళ్ళినప్పుడు ఈ ముగ్గురు స్త్రీలూ కస్టమర్స్ కొరకు ఎదురుచూస్తూ కూర్చొని కనపడ్డారు. కస్టమర్స్ ఎక్కువమంది రావడానికి ఏమిచేయాలి అనే విషయంమీద వీళ్ళముగ్గురికీ బేధాభిప్రాయాలు వచ్చి వాళ్ళమధ్య పోట్లాటలు మొదలయ్యాయి. మూడునెలల్లో ముగ్గురి మధ్యా ఐకమత్యం లేకపోవడం మూలాన రెస్టారెంటుని మూసేశారు.

ఏదైనా లక్ష్యాన్ని సాధించడానికి పలువురు తెలుగువారు ఐకమత్యంతో కలిసి పనిచెయ్యడం చాలా అరుదు. దానికి కావలసిన ఐకమత్యం లోపించడం ***ఒక విచారకరమైన తెలుగుదనం***.

# 26. తెలుగువంటలతో కొన్ని అమెరికన్ల అనుభవాలు

ఇంతవరకూ తెలుగువారి అనుభవాలే చెప్పాను. ఇప్పుడు తెలుగువంటలతో కొన్ని తెల్లఅమెరికన్ల అనుభవాలు చెప్తాను. UCB లో పిహెచ్.డి. పూర్తి చేశాక, UM (University of Michigan, Ann Arbor) లో ప్రొఫెసర్ గా చేరాను. మొదటి రెండు సంవత్సరాలూ ఎపార్ట్మెంటులో ఉండి, తర్వాత సొంత ఇల్లు కొనుక్కొని దాంట్లోకి మారాము.

మా ఇంటి పక్కవాళ్ళంతా తెల్లఅమెరికన్లే. వాళ్ల పిల్లలతో మా పిల్లలు కలిసిపోయారు త్వరలోనే. ప్రక్కవాళ్ళ పిల్లలు మా పిల్లలతో ఆడుకోవడానికి తరచూ మా ఇంటికి వస్తూండేవాళ్ళు.

పాకశాస్త్రంలో మా ఆవిడ గొప్పహస్తవాశిగలది. పురాణాల్లో నలుడు, భీముడు

పాకశాస్త్రంలో గొప్ప కౌసల్యం కలవారని చెప్పారు గానీ, మా ఆవిడతో పోటీలోనుంచుంటే వాళ్ళు తప్పకుండా ఓడిపోతారని నేననుకుంటాను.

మా పిల్లలతో ఆడుకోవడానికి వచ్చినప్పుడు ప్రక్కఇళ్ళ పిల్లలు మా ఇంటివంటకాలు అప్పుడప్పుడూ రుచి చూశేవారు. వాళ్ళకి పూరీ, బంగాళదుంప కూర బాగానచ్చింది. అప్పటినుంచీ మా ఇంట్లో పూరీ చేశినప్పుడల్లా వీళ్ళు హాజరయ్యి మాతో తినేవారు. వాళ్ళకు వచ్చీరాని భాషలో "Auntie you are the greatest cooker in the whole wide world" అని ఎన్నోసార్లు చెప్పారు.

నేను మాదొడ్లో చాలా చెట్లు నాటాను. ప్రక్కవాళ్లంతా లాన్ బాగా పెంచుకునేవారు గానీ చెట్లు ఎక్కువ నాటలేదు. మా చెట్లు కొన్నాళ్ళల్లో గుబురుగా ఎదిగాయి. వాటిక్రింద బాటకు పిల్లలందరూ Indian trail అని పేరు పెట్టేశారు. వాళ్ళకు ఇష్టమైన పని "to go eat puri bangaldomp kura in Vani's house and play on the Indian trail" అని చెప్పేవారు.

UM లోఒక తెల్ల కొలీగ్ కొన్నిసార్లు మా ఇంటికి భోజనానికి వచ్చాడు. అతను మొదటిసారి వచ్చినప్పుడు జరిగింది చెప్తాను. మా ఆవిడ చేశిన కొత్త ఆయకాయ ఊరగాయ చూశి ఆ ఎర్రది నేను చిన్నముక్క రుచి చూడవచ్చా అని అడిగాడు. అది అతనికి చాలా కారంగా ఉండవచ్చునని మా ఆవిడ చెప్పింది. అయినా తనకు రుచి చూడాలని ఉందని చెప్పి చిన్నముక్క నాలుకమీద పెట్టుకున్నాడు. కారం తగిలిన వెంటనే ఒగురుస్తూ మంచినీళ్ళ పంపుదగ్గరకు వెళ్ళి బోలెడు నీళ్ళు త్రాగాడు.

ఇలా ధైర్యంతో కొన్నిసార్లు రుచిచూశాక ఇతనికి మన ఊరగాయలు తినడం అలవాటయ్యింది. ఇప్పుడు ఇతను ఆవకాయరుచి మరిగాడు. "పాకశాస్త్రానికి ఆవకాయ తెలుగువాళ్ళు చేసిన గొప్ప Contribution" అని చెప్తుంటాడు. పులుపు, కారం రెండు రుచులూ కలిపి దాంట్లో ఉంటాయి గనుగ తనకి చాలా ఇష్టమయ్యిందని అంటాడు. ఇప్పుడు తనే ఇండియన్ స్టోర్సుకి వెళ్ళి ప్రియా వాళ్ళ ఆవకాయసీసాలు కొనుక్కొచ్చుకుని వాడుతూంటాడు.

నా చిన్నప్పుడు మా అమ్మ ఆవకాయ చేశేటప్పుడు మామిడి కాయలు కొయ్యడంలో నేను సహాయం చేశేవాణ్ణి. మా అమ్మ ఆవకాయబద్దల్ని పెద్ద పెద్ద సైజుల్లో కొయ్యమనేది, అంత పెద్దబద్దలు నా చిన్ననోట్లో పట్టేవికాదు. "అమ్మా చిన్న చిన్న ముక్కలు కోద్దాం" అంటే తను వినేది కాదు "లేదు నాన్నా, పెద్దముక్కలు కోస్తేనే పచ్చడి బాగావస్తుంది, అది

సాంప్రదాయం" అనేది.

ఇప్పుడు మా ఆవిడ ఇంట్లో ఆవకాయచేశినప్పుడల్లా చిన్నచిన్న ముక్కలు నేనే తరుగుతాను. నిజంగా ఈ చిన్న చిన్న ముక్కలతో చేశిన ఆవకాయే బాగారుచిగా ఉంటుందని నా అభిప్రాయం.

ఏ జాతి మానవులైనా ఆవకాయ రుచి ఆనందించుతున్నప్పుడు వాళ్ళు ***తెలుగుదనం ప్రదర్శిస్తున్నారని చెప్పవచ్చు.***

## తెలుగు వారు కనిపెట్టిన కొన్ని వంటకాలు

పాకశాస్త్రంలో తెలుగువారు కనిపెట్టిన ఆవకాయ గురించి పైన చెప్పుకున్నాంకదా. ఆవకాయేకాక, తెలుగువారు కనిపెట్టిన వంటకాలు ఇంకాచాలా ఉన్నాయి. వీటిలో అన్నిటికంటే ఎక్కువ ప్రసిద్ధికెక్కింది బహుశా గోంగూరపచ్చడి. తెలుగుజాతికీ, గోంగూరకూ ఉన్న బంధం ఇంతగా ప్రసిద్ధికెక్కడానికి ముఖ్యకారణం తమిళులు తెలుగువారిని " గోంగూర సోదరులు " అని పిలవడమే. (అలానే తెలుగువారు తమిళులను "సాంబారు సోదరులు " అని పిలుస్తారు).

1952 లో మద్రాసు ప్రెసిడెన్సీకాలేజీలో నేను ఉన్నతవిద్య మొదలుపెట్టినది ఉమ్మడిమద్రాసు రాష్ట్రం విభజనను గురించి తీవ్రంగా చర్చలు జరుగుతున్న సమయం. తమిళులు మద్రాసునగరం తమిళనాడులో ఉండాలనీ, తెలుగువారు అది ఆంధ్రాకు చెందాలని ప్రతి రోజు నినాదలు చేస్తుండేవారు. నా తమిళక్లాసుమేట్లు తెలుగు విద్యార్థులను "మద్రాసు మనదే, గోంగూర మనదే" అంటూ ఎగతాళి చేస్తుండేవారు.

ఆహార పదార్థంగా గోంగూర విలువనూ, గోంగూరపచ్చడి చేసే విధానాన్నీ కనిపెట్టింది తెలుగువారే. గోంగూరపచ్చడిని ఆప్యాయంగా తినడం ***ఒక విశిష్ట తెలుగుదనం***.

ఆహారపదార్ధంగా దోసకాయను గుర్తించినదికూడా తెలుగువారే. దోసకాయపప్పు, టమోటాపప్పు, మద్దపప్పులను కనిపెట్టింది తెలుగువారే. తమిళులకు సాంబారు ఎంతముఖ్యమో, తెలుగువారికి దోసకాయపప్పు, టమోటాపప్పు, మద్దపప్పులూ అంతే ముఖ్యం.

తమిళులు దోశెను కనిపెడితే, తెలుగువారు అట్లను కనిపెట్టారు. నా చిన్నప్పుడు మా

ఊళ్ళల్లో అట్లతద్దె చాలా ముఖ్యమైన పండగగా జరుపుకునేవారు. అట్లలో పెసరట్టు తెలుగుకల్చర్ కి ముఖ్యచిహ్నంగా పరిగణించబడుతోంది. ఉల్లిపాయ, పచ్చిమిరప, అల్లం ముక్కలను దండుగా వేసి చేసినపెసరట్టును ఉప్మా, పచ్చళ్ళతోనంచుకొని తినడం ***ఒక ప్రముఖ తెలుగుదనం***.

# 27. బాధ్యత ఎవరిది?

అమెరికాలో సెటిల్ అయిన ఒక స్నేహితుడి అనుభవం గురించి చెప్తాను. వాళ్ళ కుటుంబంలో అతను మూడవసంతానం. ఇతను కాక వాళ్ళ కుటుంబంలో 5 గురు ఆడపిల్లలు. ఇతని పెద్దక్క పెళ్ళికి కట్నం సమకూర్చడానికి వాళ్ళ నాన్నగారు ఎంత కష్టపడ్డారో చూచిన ఇతను ఎలానో అమెరికాలో చిన్న ఉద్యోగం సంపాదించి వచ్చేశాడు. జీతం మరీ ఎక్కువకాదు, కానీ పొదుపుగా నివశించి మిగిలిన డబ్బు తండ్రికి పంపించేవాడు. ఆడబ్బుతో తల్లిదండ్రులు క్రమేపీ తమ కూతుర్లందరికీ పెళ్ళిళ్ళు చేశారు. కానీ ఇతని పెళ్ళిని గురించి వాళ్ళెవరూ పట్టించుకోలేదు. స్వతహాగా అమ్మాయిలతో మాట్లాడటమంటే కొద్దిగా జంకు కల్గిన మనిషి అవ్వడం మూలాన ఇతను అమెరికాలో స్త్రీలతో ఎవ్వరితోనూ స్నేహం చెయ్యలేకపోయాడు. సంవత్సరాలు గడిచిపోయాయి. ఇండియాలో అక్కాచెల్లెళ్ళ కుటుంబాలు పెరుగుతున్నా, అమెరికాలో ఇతను ఒంటరి బ్రహ్మచారిగానే ఉండి పోయాడు.

ఒకసారి కలుసుకున్నప్పుడు తనగోడు చెప్పుకున్నాడు. అతని అక్కలు తమ కూతుర్ల పెళ్ళిళ్ళు చెయ్యడానికి ఇతన్ని ఆర్థిక సహాయం అడుగుతున్నారట. ఎవడైనా మెత్తగా కనపడితే చాలు, దగ్గరబంధువులు కూడా తమ బాధ్యతలను వాడిమీద వెయ్యడానికి ప్రయత్నిస్తారు గదా. "సారీ, మీరు పుట్టించుకున్న పిల్లల బాధ్యత మీరే భరించండి" అని వ్రాయమని చెప్పాను అతనికి.

తమ బాధ్యతలను ఇతరులమీద తోసెయ్యడం కొంతమంది ***తెలుగువారి సిగ్గుపడాల్సిన తెలుగుదనం***.

పిల్లలను పుట్టించేటప్పుడు, వాళ్ళ బాధ్యతను తాము భరించ గలమా లేదా అని ఆలోచించకపోవడం ఒక్క తెలుగువారిలోనే కాదు, అన్నిజాతుల మానవుల్లోనూ ఉంది. ఇది

*సిగ్గుపడాల్సిన ఒక మానవదనం.*

# 28. ముసలి తల్లిదండ్రుల పోషణ

అమెరికాలో సెటిల్ అయిన ఇంకొక తెలుగు స్నేహితుడి గురించి చెప్తాను. తల్లిదండ్రులు బాంబేలో నివసించేవారు కనుక ఇతను పుట్టినప్పుడే ప్రవాసాంధ్రుడు. అమెరికాలో పిహెచ్. డి. చేశి ప్రొఫెసర్ ఉద్యోగంలో సెటిల్ అయ్యాడు. కానీ బ్రహ్మచారిగానే ఉండిపోయాడు. తల్లిదండ్రులకు ఏకైక పుత్రుడు. వాళ్ళకు బాంబేలో మంచి ఫ్లాటు (Flat) ఉంది.

వాళ్ళ నాన్నగారు చనిపోయాక అమ్మ ఒక్కత్తే బాంబేఫ్లాటులో ఉంది కొన్నాళ్ళు. తర్వాత ఆమెను అమెరికాకు విజిట్ కి తీసుకువచ్చాడు ఇతను ఒకసారి. దగ్గర్లో స్నేహిరులెవరూ లేకపోవడం మూలాన 3 నెలల్లో బోరుకొట్టి బాంబే వెళ్ళిపోయింది ఆవిడ అప్పుడు.

దాని తర్వాత కొన్ని సంవత్సరాలు ఇండియా, అమెరికాల మధ్య తిరుగుతూ గడిపింది ఆవిడ. ఇప్పుడు ముసలితనం వచ్చేశి ప్రయాణం కష్టం అయ్యింది గనుక కొడుకు దగ్గరే ఉంటోంది. కొడుకు బ్రహ్మచారి కనుక ఈవిడే వంటచేస్తుంది. ఇంగ్లీషు బాగావచ్చుగానీ, వయస్సు మళ్ళింది గనుక ఎక్కువ బయటకు వెళ్ళదు. ఆవిడ కాలమంతా వాళ్ళ ఇంట్లోనే గడిచిపోతుంది.

తల్లి ముసలిది గనుక, అతను ఏ ఊరైనా వెళ్ళితే ఆవిడకు కష్టం, అందుకని అతను ప్రయాణాలు మానుకోవలసి వచ్చింది. ఈ మధ్య కొన్ని సంవత్సరాలుగా కాన్ఫరెన్సెస్ కీ వాటికీ వెళ్ళడం మానేశాడు. అమెరికన్ స్నేహితులు వాళ్ళ అమ్మను old people's home లో చేర్పించమని చెప్తుంటారు. వాళ్ళకు మా అమ్మ నాతోనే ఉంటే మంచిదనుకుంటాను అని చెప్తాడు. వృద్ధురాలైన తల్లి కొరకు తన జీవనవిధానంలో అవసరమైన మార్పులు సంతోషంగా చేసుకొని గడుపుతున్నాడు ఇతను. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ప్రేమతో చూసుకోవడం **మెచ్చుకో దగ్గ తెలుగుదనం.**

# 29. హాంకాంగ్ లో ప్రవాసాంధ్రుల తెలుగుదనాలు

1993 ప్రాంతంలో హాంకాంగ్ లోని బ్రిటీష్ ప్రభుత్వం ఒక కొత్త యూనివర్సిటీ HKUST (హాంకాంగ్ యూనివర్శిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ) మొదలుపెట్టారు. క్లాసులు 1994లో మొదలయ్యాయి. నేను ఆ యూనివర్శిటీలో విజిటింగ్ ప్రొఫెసర్ గా 1995-97ల్లో ఉన్నాను. అప్పుడు ఆ డిపార్టుమెంటులో నేను ఒక్కడినే ప్రొఫెసర్ రాంకులో ఉన్నాను. మిగతా వాళ్ళంతా జూనియర్ ఫాకల్టీ. హాంకాంగ్లో చూచిన కొన్ని తెలుగుదనాలను గురించి చెప్తాను.

నా క్లాసులో మారిషస్ నుంచి వచ్చిన ఒక తెలుగు విద్యార్థి ఉండేవాడు. వచ్చీరాని తెలుగులో పలకరించేవాడు. నేను ఎప్పుడైనా ఇంగ్లీషులో జవాబు చెప్పితే "లేదు పంతులుగారూ, తెలుగులో చెప్పండి. నా తెలుగు బాగు పరచుకోవాలి" అనేవాడు. తెలుగులో చక్కగా మాట్లడడం నేర్చుకోవాలని తహతహపడుతున్న ఈ ప్రవాసాంధ్ర యువకుణ్ణి చూచి నేను చాలా ముగ్ధుడ్నయ్యాను.

సాధారణంగా అమెరికాలోనూ, హాంకాంగ్ లోనూ ప్రవాసాంధ్రులపిల్లలెవరికీ తెలుగు నేర్చుకోవాలనే కుతూహలంగానీ, తెలుగువాళ్ళతో తెలుగులో మాట్లాడుదామనే ఉత్సాహంగానీ ఉండదు. అందుకే తెలుగులో మాట్లాడాలని ఉత్సాహపడుతున్న ఈ మారిషస్ యువకుణ్ణి కలిశినప్పుడల్లా నాకు చాలా సంతోషం కల్గేది.

దీపావళికి హాంకాంగ్ తెలుగు అసోషియేషన్ వాళ్ళు పెద్ద డిన్నర్ పార్టీ, కల్చరల్ ప్రోగ్రాం (ముఖ్యంగా పిల్లల కూచిపూడి వగైరా డాన్సు ప్రోగ్రాంలు) పెట్టారు. తెలుగుదేశం బయట నివిసించే ప్రవాసాంధ్రులు వారి తెలుగుదనాన్ని సాధారణంగా దీపావళి, సంక్రాంతి, ఉగాది పండుగల సమయాల్లో ఇలా డిన్నర్ పార్టీలూ, కల్చరల్ ప్రోగ్రాంలూ (నాట్యాలూ, తెలుగులో నాటికలూ, తెలుగు పాటల గానాలు, వగైరా) పెట్టుకొని వ్యక్తపరుస్తారు. ఈ ప్రోగ్రాంలకు హిందువులే కాకుండా, క్రిష్టియన్, ముస్లిం తెలుగు వాళ్ళుకూడా రావడం చూశాను. ***ఇది ప్రవాసాంధ్రుల తెలుగు దనం.***

హాంకాంగ్ లో జరిగిన దీపావళి డిన్నర్ పార్టీలో చాలా వంటకాలు పెట్టారు. గారెలున్నచోట నేను ఒక గారెను నాప్కిన్ తో ముట్టుకుంటే నూనెతో ఆ నాప్కిన్ తడి అయిపోయింది. ఆ నూనె చూశి, గారెను మళ్ళీ పెట్టేస్తుండగా ప్రక్కన ఒకాయన చూశి "

పంతులుగారూ, నూనెలో తేలుతున్న గారె తీసుకోవాలా వద్దా అని ఆలోచిస్తున్నారా" అంటూ పలకరించాడు.

దాని తర్వాత మేము చాలా సేపు మాట్లాడుకున్నాం. ఆయన భార్య రెండు సంవత్సరాల క్రితం చనిపోయిందట. ప్రస్థుతం ఒంటరిగానే ఉంటున్నాడు ఆయన. సంవత్సరం క్రితం ఆయనకు హార్ట్ బైపాస్ ఆపరేషన్ జరిగిందట. అప్పుడు డాక్టరు నూనె పదార్థాలు తినడం బాగా తగ్గించమని చెప్పాడట. "మన తెలుగు వంటకాలు చాలా తక్కువ నూనెతో చెయ్యవచ్చుగానీ, సాధారణంగా తెలుగువాళ్ళు అలాచెయ్యక నూనె మరీ ఎక్కువ వాడతారండీ. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు" అన్నాడు. ఇలా నూనె ఎక్కువ వాడడం ***ఆరోగ్యరీత్యా మానవలసిన తెలుగుదనం.***

ఆయన గారెలు, పూరీలు, అప్పడాలు, వేపుడు కూరలూ మానేశాడట. నూనె తక్కువ వాడే తెలుగు వంటకాలు చెయ్యడం నేర్చుకొని, స్వయంపాకంతోనే నివసిస్తున్నాడట. రోజూ ప్రొద్దున్న 3.30 AM కు లేచి గంటన్నర జాగింగూ వగైరా వ్యాయామాలు చేస్తాడట. "ఈ మార్పులన్నింటివల్లా నా ఆరోగ్యం ఇప్పుడు చాలా బావుంది" అని చెప్పాడు.

బ్రిటీషువాళ్ళు ఆక్రమించే ముందు హాంకాంగ్ చైనాలోని గోందాన్ రాష్ట్రంలో ఒక భాగం. ఈ రాష్ట్రంలో మాట్లాడే భాష పేరు గోందాన్వా. బ్రిటీషు వాళ్ళు ఈ రాష్ట్రం పేరును కేంటాన్ అనీ, ఆ భాషను కేంటనీస్ అని చెప్పుకుంటారు. హాంకాంగ్ లో ప్రజలు గోందాన్వాలోనే మాట్లాడుతారు.

నేను హాంకాంగ్ లో ఉండగా జరిగిన హాస్య ఘట్టం చెప్తాను. ఇంగ్లాండులో కొత్తగా పిహెచ్. డి. చేశిన ఒక హాంకాంగ్ యువకుణ్ణి మా డిపార్టుమెంటులో ఉద్యోగానికి ఇంటర్వ్యూ చేశాం. అతని పేరు రిచర్డ్. అతను నా టైటిల్ అదీ విని కొద్దిగా భయపడినట్లున్నాడు.

సెమినార్ తర్వాత లంచ్ కి తీసుకువెళ్ళాం. అప్పుడు పిచ్చపాటీ మాట్లాడుతూ "Richard are you a bachelor?" అని అడిగాను. అంటే అతను ఒంటరిగా వస్తాడా లేక కుటుంబంతో వస్తాడా తెలుసుకుందామనే ఉద్దేశంతో. నా ప్రశ్న విని అతని ముఖం కొద్దిగా కళావిహీనం అయినట్లనిపించింది. "No professor, you are mistaken. I am a Ph.D" అని సీరియస్ గా చెప్పాడు!

# 30. కొరియాలో ప్రవాసాంధ్రుల తెలుగుదనం

క్రింతటి సంవత్సరం మేము దక్షిణ కొరియా విజిట్ చేశాం. అక్కడ  పోహాంగ్ నగరంలో  పాస్టెక్ యూనివర్శిటీని విజిట్ చేస్తూ వారం రోజులు గడిపాము. మేము ఉండడానికి వాళ్ళు క్వార్టర్సులో  3 పడక గదుల అపార్ట్ మెంటు ఇచ్చారు.

పాస్టెక్కు, పాస్కో (పోహాంగ్ స్టీలు కంపెనీ) వాళ్ళు మొదలు పెట్టి నడుపుతున్నారు. పాస్కో సంవత్సరానికి 28 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేశి పలుదేశాలకు ఎగుమతి చేస్తుంది. ఒక్క USA కే ప్రతి ఏటా బిలియన్ US $ విలువగల ఉక్కు ఎగుమతి చేస్తారు. ప్రపంచంలోని స్టీల్ మిల్సన్నిటిలోకి పాస్కో పెద్దది.

కంపెనీకి వచ్చే విజిటర్స్, ముందు షోరూము చూస్తారు. ఆ షోరూములో కంపెనీ చరిత్ర, ప్రొడక్షన్ వివరాలు చక్కటి చార్టులతో చూపెడతారు. ఈ గదిలో తెలుగు వాళ్ళు గర్వించదగ్గ ఒక విషయం గమనించాను. కంపెనీలో ప్రొడక్షన్ మొదలయ్యింది 1968లో. బ్లాస్ట్ ఫర్నేస్ లో మొట్టమొదటి ఛార్జి విశాఖపట్టణం పోర్టుగుండా వచ్చిన, తెలుగుదేశపు గనుల్లో తీశిన ఇనపఖనిజం, బొగ్గు.

అక్కడ ఒక ఆదివారం, దగ్గర్లో ఉన్న  గ్రోసరీ స్టోరుకి వెళ్ళాం. దాంట్లో ఒక తెలుగు యువకుడు కలిశాడు. అతను పాస్టెక్ లో రీసెర్చి స్కాలర్ గా పనిచేస్తున్నాడట. మేము తెలుగువాళ్ళమని తెలుసుకుని ఎంతో ఆప్యాయంగా మాట్లడడం మొదలుపెట్టాడు. అతను ఒంటరిగా ఒక పాస్టెక్  ఎపార్ట్ మెంటులో ఉంటున్నాడట. "ఇవ్వాళ సాయంత్రం నేను వంట చేస్తున్నాను. మీరు నా ఎపార్ట్ మెంటుకి రండి, తెలుగుభోజనం పెడతాను."  అని ఆహ్వానించాడు. దూర ప్రదేశంలో మన ప్రాంతం వారు కనపడితే, వారిని వెంటనే ఆప్యాయంగా మన ఇంటికి భోజనానికి రమ్మని ఆహ్యానించడం ***ఒక ప్రధాన తెలుగుదనం.***

# 31. ఆసియాదేశాల్లో తెలుగురుచులు

బియ్యం నీటిలో ఉడకబెట్టి అన్నం చెయ్యడానికి, కొన్ని సంవత్సరాలక్రితం చాలా ఎక్కువ నీరు వాడేవారు. దీనివల్ల ఆ బియ్యం మెత్తటి అన్నంగా అయ్యాక కూడా కొన్ని నీళ్ళు గిన్నెలో మిగిలిపోయేవి. ఆ నీటిని వార్చేవారు. అలా వార్చిన నీటిని గంజి అనేవారు.

బియ్యం సారంతో, గంజి తెల్లగా పాలలాగ ఉంటుంది.

నగరవాసులు సాధారణంగా వార్చిన గంజిని పారబోశేవారు. మా తాతగారి ఇంట్లో ఆ గంజిని చిన్నపిల్లలకు వంటికి మంచిది, తాగమని ఇచ్చేవాళ్ళు. పెద్దవాళ్ళు గంజి తాగడానికి ఇష్టపడేవారుకాదు. కనుక పిల్లలు తాగగా మిగిలిన గంజిని గేదలకు కుడితిలో పోశేశేవారు.

ఇలావండినఅన్నంకన్నా ఆ గంజిలోనే ఎక్కువ న్యూట్రిషన్ (సారం) ఉంటుంది. ఇది తెలుకొని, ఈ మధ్య అన్నం చెయ్యడానికి బియ్యంలో తక్కువ నీటిని వాడి గంజివార్చే అవసరం లేకుండా అన్నం చేసే పద్ధతి అమలులోకి వచ్చింది. దీని తర్వాత పుట్టిన తెలుగువారికి "గంజి" అనే పదానికి అర్థం కూడా తెలియడం లేదు.

సారవంతమైన ఆహారం తిన్నంత మాత్రన సరిపోదు. దానిలోని సారం చిన్న ప్రేగులలో రక్తంలోకి చేరితేగాని దాని ఫలితం శరీరానికి దక్కదు. చిన్నప్రేగులలో రక్తంలోకి చేరేవి నీటిలో ఇంకినవి మాత్రమే. నీటిలోకి ఇంకని ఘనపదార్థాలను శరీరానికి ప్రయోజనం లేకుండా విసర్జించడం జరుగుతుంది. దీనివల్లనే వార్చిన అన్నం కన్నా గంజి శరీరానికి ఎక్కువ ఉపయోగం అని గ్రహించవచ్చు.

వార్చడం మూలాన ఉపయోగకరమైన న్యూట్రిషన్ పారవేయడం మనమే కాదు, ఇప్పటికీ యూరప్, అమెరికా, మిగతా దేశాలవారు చేస్తూనే ఉన్నారు. ఈ దేశాలలో స్ఫగెట్టీ అనీ, నూడుల్సు అని వండుకుంటారు. ఇప్పటికీ వీటిని ఎక్కువ నీటితో ఉడకబెట్టి, ఆ నీటినివడకట్టి పారేస్తున్నారు.

గంజి భక్షించే అలవాటు తెలుగుదేశం నుంచి పురాతనకాలంలోనే ఆసియాలో మిగతా దేశాలకు వెళ్ళింది. ఆ దేశాల్లో దీన్ని "కంజి" అంటారు. ముఖ్యంగా జపాన్ లో దీనికి జనాదరణ ఎక్కువ. వాళ్ళు కంజిలో మిగతా ఆహార పదార్థాలు కలిపి రకరకాల రుచులతో చేసుకుని భక్షిస్తారు. ఇలా గంజి తను పుట్టిన ప్రాంతంలో జనాదరణ కోల్పోయినా, ఇతర దేశాల్లో ఇంకా పాప్యులర్ గా విలసిల్లుతోంది.

# 32. కువయత్ లో తెలుగుదనం

కొన్ని సంవత్సరాల క్రితం కువయత్ వాళ్ళు ఒక అంతర్జాతీయ కాన్ఫరెన్సు చేశారు. దానికి నన్ను ప్లీనరీస్పీకరుగా పిలిచారు. ఆ సందర్భంగా నేను వారంరోజులు కువయత్ లో

ఉన్నాను. కాన్ఫరెన్సుకి వచ్చిన వాళ్ళల్లో ఇండియన్ ఆరిజన్ వాణ్ణి నేనే.

ఒక రోజు సాయంత్రం కువయత్ చూడ్డానికని కొంత మందికి టాక్సీ ఏర్పరిచారు. టాక్సీ డ్రైవరు సుడాన్ నుంచి వచ్చిన అరబ్ అతను. అతనికి ఇంగ్లీషు ఎక్కువ రాదు. మాకు అరబిక్ అంతకన్న తక్కువ వచ్చు. అందుకని అతనితో మాట్లాడడం కష్టం అయ్యింది.

ముందు మెయిన్ మార్కెట్టుకు తీసుకు వెళ్ళాడు. ఆ వీధిలో చాలా షాపులున్నాయి. కాసేపు నడిచి తిరుగుదామని అతన్ని ఆపమన్నాము. దిగి, కొంత దూరం నడిచిన వెంటనే నాకు తెలుగుపలుకులు వినపడ్డాయి. ఒక గుంపు తెలుగువాళ్ళు నవ్వుకుంటూ నడుస్తున్నారు. దగ్గర్లో టూరిస్టులు చూడదగ్గ ప్రదేశాలు ఏమైనా ఉన్నాయా అని వాళ్ళని అడిగాను. "పంతులుగారూ, ఈ దేశం డబ్బులు గడించుకోవడానికి మాత్రమే. డబ్బులు తప్పించి, ఇక్కడ చూడ్డానికీ, చెయ్యడానికీ ఏవీ లేవనే చెప్పవచ్చు. ఇక్కడున్న వాళ్ళంతా డబ్బులకోసమే ఉంటున్నారు. అది లేకపోతే ఇక్కడెవడుంటాడండీ?" అని వాళ్ళల్లో ఒకతను చెప్పి నవ్వాడు.

తెలుగు దేశంలో లభించేదానికంటే మంచి జీవనోపాధి దొరికే ప్రదేశానికి తరలిపోవడం తెలుగువారే కాక అన్ని జాతులవారు అనాదినుంచీ చేస్తున్నదే కదా అని నాకు అప్పుడు అనిపించింది.

# 33. తెలుగు నుడికారం, తెలుగు భాష చక్కదనం

హాల్డేన్ గారితో నాకు స్వయంగా పరిచయం కల్గలేదు గనుక ఆయన Telugu is the best language in the world అని వక్కాణించడానికి ఏ ఆధారాలు వాడారో నాకు తెలియదు. కాని తెలుగులో నాకు ఆనందాన్ని కలిగించే కొన్ని లక్షణాలు ఇక్కడ చెప్తాను.

కొంతమంది తెలుగును దీర్ఘాలు సాగదీస్తూ చాలా ఇంపుగా మాట్లాడుతారు. ఉదాహరణకు, ఒక మగవాడు తన భార్యను మందలించ డానికి " ఏందే ( ఏఏఏ.....) అంతలా (ఆఆఆ...) మిడిసిపడ్తుండా (ఆఆఆ..) వేందీ (ఈఈఈ...)" అని దీర్ఘాలు తీస్తూ అంటాడు. ఆవిడ " ఏందయ్యా (ఆఆఆ...) ఊరికే (ఏఏఏ....) నోరుబారేసుకుంటుండా (ఆఆఆ...) వూ (ఊఊ...)" అంటూ జవాబిస్తుంది.

చదువుకున్నవాళ్ళు ఇలా మాట్లాడడం గౌరవనీయం కాదనుకుంటారు. వాళ్ళెవ్వరూ

ఇంచక్కగా మాట్లడడం నేను వినలేదు. సాధారణంగా ప్రవాసాంధ్రులెవ్వరూ ఇలా మాట్లాడలేరు. తెలుగుదేశంలో కూడా నగరాలలో ఇలాంటి స్వరాలు వినబడవు. అందుకనే తెలుగుదేశానికి వెళ్ళినప్పుడు నగరాలలో ఉంటే నాకు త్వరలో బోరుకొట్టేస్తుంది. గ్రామాల్లో అనుక్షణం దీర్ఘాలతో తెలుగు స్వరాలు వినపడ్తుంటాయి. ఆ ఇంపైన స్వరాలు చెవిలో పడుతుండడం వల్ల తెలుగు గ్రామాల్లో ఎన్ని రోజులున్నా ఇంకా ఉండాలనిపిస్తుంది.

హాంకాంగులో ప్రజలు గోందాన్వా భాషలో ఇలానే దీర్ఘాలు సాగదీస్తూ మాట్లాడుతారు. హాంకాంగ్ లో పుట్టిపెరిగిన ఒక తెలుగు అమ్మాయిని నేను హాంకాంగ్ లో ఉన్నప్పుడు కలిశాను. ఆ అమ్మాయికి తెలుగూ, గోందాన్వా రెండు భాషలూ బాగా వచ్చు. తను భాషలమీద రిసెర్చి చేసేది. ప్రపంచంలో తెలుగు, గోందాన్వా, రెండు భాషలవాళ్ళే ఇంచక్కా దీర్ఘాలు సాగదీస్తారని చెప్పింది. తెలుగు వాడుకభాషలో దీర్ఘాలు మొత్తం 7 స్వరాల్లో (tones) ఉంటాయట. అలానే గోందాన్వా వాడుక భాషలో కూడా మొత్తం 7 స్వరాలు ఉంటాయట.

తెలుగు దేశంలో పల్లె ప్రజలు మాత్రమే దీర్ఘాలు సాగదీస్తూ మాట్లాడుతారని చెప్పుకున్నాం గదా. గోందాన్వా అలాకాదు, అందరూ దీర్ఘాలతోనే మాట్లాడుతారు. అందుకనే ఇతర ప్రాంతాలవాళ్ళు గోందాన్వాలో మాట్లాడడం నేర్చుకోవడం చాల కష్టమంటారు.

ఇఖ తెలుగు నుడికారాన్ని గురించి చర్చిద్దాం. నాకు చిన్నప్పుడు ఒక తెలుగు భాష మాత్రమే వచ్చేది. ఇంగ్లీషు, సంస్కృతం చదవడం మొదలు పెట్టినా, వాటిని నేర్చుకోవడానికి చాలా ఏళ్ళు పట్టింది. చిన్నప్పుడు వీధిలో బూతులతో తిట్లు విన్నప్పుడు, తిట్టడానికి తెలుగు భాష ఎంతో గొప్పదో అనుకునేవాణ్ణి.

కొన్ని భావాలు తెలుగులో చెప్పినంత సుళువుగా ఇతరభాషల్లో చెప్పడం కష్టం అనిపిస్తుంది. ఈ సుళువునే నుడికారం అంటారు. ముఖ్యంగా పద్యరూపంలో భావాలు వ్యక్తపరచడానికి తెలుగు చాలా అనువైన భాష. ఒక కారణం తెలుగులోని వేమన, సుమతి, త్యాగరాయ లాంటి మకుటాలు. ఇలాంటి మకుటాలు ఇతర భాషల్లో నేను చూడలేదు.

ఉదాహరణకు నేను వ్రాశిన ఒక బూతు పద్యం చెప్తాను (మీకు బూతు సాహిత్యం చదవడం ఇష్టం లేకపోతే ఇది చదవవద్దు).

చెవి దూరిన జోరీగ
ఇల్లు దూరిన దొంగ

పూకు దూరిన మడ్డ
బుద్ధిగా నిలువ లేరయా
విశ్వదాభిరామ వినురవేమా

దీనిని ఇతర భాషల్లో ఇంత సుళువుగా చెప్పలేమనిపిస్తోంది.

## తెలుగు సామెతలు

తెలుగు భాషకూ, తెలుగునుడికారానికీ, ఉన్న ఖజానాలో ఒక ప్రముఖ (అంటే యూరో, డాలర్లలాంటి) సొత్తు తెలుగు సామెతలే. అన్నిపరిస్థితులను వర్ణించడానికి వర్తించే సామెతలూ, అన్ని రసాలనూ, భావాలనూ పోషించేసామెతలూ, తెలుగు ఖజానాలో ఉన్నాయి. నా చిన్నప్పుడు పెద్దవారి సంభాషణల్లో తరచూ సామెతలు ముత్యాల్లాగా దొర్లుతుండేవి.

అనువైనసామెతలను వాడితే సంభాషణ చాలా రక్తికరంగా ఉంటుంది కదా. అందుకనే సామెతలు నాకు చాలా ఇష్టం. అవి మంచి సంభాషణకూ, రచనకూ, ప్రముఖచిహ్నం అని నా అభిప్రాయం. ఇతర భాషల్లో సామెతలను ఎక్కువ చూడం.

కొన్ని వజ్రాల్లాంటి బూతు సామెతలుగూడా నేను విన్నాను. ఉదాహరణకు ఒకటి చెప్తాను. 4వ సెక్షన్ చివర "కొత్తక వింతా, పాతొక రోతా" చెప్పుకున్నాంగదా. ఈ విషయాన్నే ఇంకా బాగా చెప్పే బూత సామెత "పూకు  మరిగాక  చెయ్యి బావుండదు".

ఈ సెక్షన్ను ఇంకే భాషలోకి తర్జుమా చెయ్యడానికి వీలుకాని ఒక అచ్చతెలుగు జోక్ తో ముగిస్తాను. దీన్ని, నేను చూశిన ఒక అష్టావధానం  టేపులో అప్రస్థుత ప్రసంగిగారు చెప్పారు. మొదటిసారి చదివినప్పుడు అర్థం కాకపోతే రెండు మూడు సార్లు చదవండి  మీకే తెలుస్తుంది:  ఒక హోటల్ ముందు వీధిమీద పెట్టిన సైను "ఇచ్చట చక్కని తెలుగు భోజనమూ,  మరి యువ సతులూ లభించును".

# 34. తెలుగు వారు, పేకాటలు

కలకత్తాలోనూ, ఆ తర్వాత అమెరికాలనూ తెలుగువారి పార్టీల్లో ఎప్పుడూ పేకాటలు ముఖ్యమైన కార్యకలాపాలుగా ఉండడం చూశాను.

నేను కూడా బ్రిడ్జి, లిటరేచర్, గాడిద ఆటల్లో కొన్నాళ్ళు ఉత్సాహంగా పాల్గొనేవాడిని. ప్రవాసాంధ్రులకు పేకాటలు చాలా ముఖ్యమైన వినోద కార్యక్రమాలని చెప్పవచ్చు. కొందరు ప్రవాసాంధ్రులకు పేకాట ఒక వ్యసనమనే చెప్పవచ్చు.

పేకాట బాగా ఉల్లాసంగా ఉండవచ్చుగానీ, దానివల్ల శరీరానికి ఏమీ ఎక్సర్ సైజు (వ్యాయామం) కల్గదు. చాలామంది ప్రవాసాంధ్రులు వ్యాయామాలేవీ చెయ్యరు. తెలుగుదేశంలో నివసించేవారికి నిత్యజీవితం వల్లనే మంచి వ్యాయామం లభిస్తుంది కానీ, ఆధునిక మెకానికల్ సౌకర్యాలను నిండుగా వాడే ప్రవాసాంధ్రులకు ఇదిలేదు. అందుకనే వీరు రోజూ వ్యాయామం చెయ్యడం చాలా అవసరం.

వ్యాయామం లేకపోవడం మూలానేమో, ప్రవాసాంధ్రులలో చాలమందికి చిన్నవయస్సులోనే కొలెస్టరాల్ ఎక్కువవ్వడం, గుండె సమస్యలు, డయాబెటీస్, స్థూలకాయత్వం లాంటి ఆరోగ్య సమస్యలూ వస్తున్నాయి.

ఆన్‌ఆర్బరులో మేము పదేళ్ళు నివసించాక ఒకసారి తెలుగు స్నేహితుడొకతను మా ఇంటిలో వారం రోజులు వచ్చిఉన్నాడు. అతను జాగింగు చేశేవాడు. నన్ను కూడా రమ్మని ప్రోత్సహించాడు అప్పుడు. నాకు అప్పుడే మొదలయ్యింది ప్రతిరోజూ జాగ్ చేసే అలవాటు. జాగింగు మొదలెట్టాక నేను పేకాటలో పాల్గొనలేదు.

# 35. తెలుగువారూ, వ్యాయామాలూ

పదేళ్ళ క్రితం నాకు రెండు చేతి వ్రేళ్ళల్లో అంతవరకూ నేను కనీవినీ ఎరుగని ఒక సమస్య మొదలయ్యింది. వాటిని మడిస్తే, మళ్ళీ వాటంతట వాటిని నిటారుగా చేయలేకపోయాను. ఇంకొక వేలుతో వాటిని నిటారుగా చేస్తేనే గాని అవి నిటారుగా అయ్యేవి కాదు. ఈ రెండు వేళ్ళకే ఆ సమస్య వచ్చింది, మిగతా వ్రేళ్ళన్నీ బాగానే ఉన్నాయి.

నా అమెరికన్ డాక్టరుకి చూపిస్తే, దీన్ని "ట్రిగ్గర్ ఫింగర్స్" అంటారు అని చెప్పి స్పెషలిస్టు దగ్గరకు పంపించాడు. ఆ స్పెషలిస్ట్ "దీనికి సర్జరీ చెయ్యవచ్చు, సర్జరీ అరచేతి

మీద చెయ్యాలి గనుక కొన్నాళ్ళు చాలా నొప్పివేస్తుంది" అన్నాడు. ఆయన్నడిగాను వ్రేళ్ళకి ఏదైనా ఎక్సర్ సైజు చేస్తే ఇది నయమవుతుందా అని. అలాంటివేవీ లేవు, సర్జరీ ఒక్కటే దీన్ని నయం చెయ్యడానికి మార్గం అన్నాడు ఆయన. నీకు సర్జరీ చెయ్యించుకోవాలని ఉంటే నర్సుతో మాట్లాడి ఎపాయింట్ మెంట్ పుచ్చుకో అన్నాడు.

సర్జరీ చెయ్యించుకునేముందు, ఎక్సర్ సైజు వల్ల ఇది తగ్గుతుందేమో చూద్దామని, జాగ్ చేసినప్పుడు వ్రేళ్ళను జోరుగా మడిచి, నిటారుగా చెయ్యడం మొదలు పెట్టాను. ఆరునెలల తర్వాత ఆ వ్రేళ్ళ ట్రిగ్గర్ ఫింగర్ కండిషన్ చాలా వరకూ పోయి అవి మామూలు స్థితికి వచ్చాయి. అలా ఈ సమస్యను సర్జరీ లేకుండా వ్యాయామంతోనే కుదుర్చుకున్నాను.

ఆరోగ్యమే మహాభాగ్యం కదా, మన శరీరాలకు వచ్చే సమస్యలు కొన్ని సరియైన వ్యాయామంతోనే నయం చేసుకోవచ్చుని చెప్పడానికి ఇది చర్చించాను. ఇది నేను కొత్తగా కనిపెట్టిన పరమ సూత్రమేమీ కాదు. వేలకొలదీ సంవత్సరాల క్రితమే ఇండియాలో మన పూర్వీకులు ఈ విషయం గ్రహించి ఎన్నో అద్భుతమైన యోగాసనాలు, కుండలినీ యోగాలులాంటి పద్ధతులు కనిపెట్టారు.

నా చిన్నప్పుడు మా ఇంటికి దగ్గరలో రైలుపట్టాలుండేవి. వాటిమీద రైలుబండ్లు దొర్లుతున్నంత కాలం అవి తుప్పుపట్టకుండా మంచి కండిషన్ లో ఉండేవి. కొన్నాళ్ళ తర్వాత ఒక కొత్త లైను వెయ్యడం మూలాన ఆ రైలులైనులో ఒక భాగం వాడడం మానేశారు. అలా వాడడం మానేశిన భాగంలో కొద్ది కాలంలోనే రైలుపట్టాలు తుప్పుపట్టేశి ధ్వంసం అయిపోయాయి.

మానవశరీరానికి కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. రోజూ వాడుతుంటే మన అవయవాలు కూడా చాలాకాలం ఆరోగ్యంగా బాగా పని చేస్తుంటాయి. ఏ అవయవాన్నైనా కొన్నాళ్ళు వాడకపోతే తక్కువ కాలంలోనే అది పనిచెయ్యడం మానేశి కుంచించుకుని పోతుంది. దీనివల్లనే, జీవనోపాధికి కాయకష్టం చేశేవారికి తమ పనిలోనే అన్ని అవయవాలు రోజూ వాడడం జరుగుతుంది గనుక సాధారణంగా వారి ఆరోగ్యం బాగుంటుంది. అలా కాకుండా కుర్చీ మీద కూర్చుని కృషిజేశే ఉద్యోగాలు గలవారు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిదినం అవయవాలన్నింటికీ పని కల్పించే వ్యాయామాలు చెయ్యడం ఎంతో అవసరం.

## దొర్లింగ్

నేను జాగ్ చేశినప్పుడు రెండు చేతులూ జోరుగా అటూఇటూ ఊపుతుంటాను. చేతివ్రేళ్ళు జోరుగా మడిచి, విడుస్తుంటాను. తలను కూడ మాంచి హుషారుగా అటూఇటూ ఊగిస్తాను. శరీరమంతా అటూఇటూ నాట్యం చేస్తున్నట్లు ఊపుతూ గెంతులు వేస్తుంటాను.

తలను ఎందుకు ఊపుతానో చెప్తాను. ముసలితనంలో కొంతమందికి Alzheimer's వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి మెదడులోని మెమరీని ధ్వంసం చేసుంది. Alzheimer's వ్యాధి గ్రస్తులకు ఏమీ గుర్తుండదు, ఎవ్వరినీ గుర్తుపట్టలేరు. ఒంటరిగా బయటకువెళ్ళితే మళ్ళీ ఇంటికి తిరిగిరాలేరు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా ఇతరుల సహాయం కావాలి. కనుక Alzheimer's వ్యాధిగ్రస్తులను చూసుకోవడానికి కుటుంబసభ్యులందరూ ఎంతో కష్టపడాల్సి వస్తుంది.

మెదడుకు వ్యాయామం కల్పిస్తే Alzheimer's వ్యాధి రావడానికి అవకాశం తక్కువవుతుందని నా ఉద్దేశం. తలను జోరుగా ఊపడం వల్ల మెదడుకి వ్యాయామం కలుగుతుంది.

కొంతమంది ఎప్పుడూ depressed గా ఉంటారు. దీన్నే తెలుగులో "బుద్ధిమాంద్యత" అంటారు. ఈ మధ్య ఇదీ ఒక వ్యాధి అని కనిపెట్టారు. శరీరం క్రింద భాగం నుంచీ ఎడమవైపు గుండా మెదడుకు చేరే నెర్వుని "వేగాస్ నెర్వు" అంటారు. ఆ వేగాస్ నెర్వుని ఉత్తేజ పరిస్తే బుద్ధిమాంద్యం తగ్గుతుందని ఈ మధ్య కనిపెట్టారు. తలనూ, చేతులనూ హుషారుగా అటూ ఇటూ ఊగించడం మూలాన మెడకూ, మెదడుకూ, వేగాస్ నెర్వుకీ కూడా వ్యాయామం కల్గుతుందని నేనలా చేస్తాను.

ఒక స్నేహితుడు నా జాగింగ్ చూశి, కొండనుంచి క్రిందకు దొర్లుతున్న బంతి గుర్తుకు వస్తోందని చెప్పాడు. అందుకే నేను చేశే జాగింగ్ విధానానికి "దొర్లింగ్" అని పేరు పెట్టాను.

కొన్ని సంవత్సరాల క్రితం AUA (American University of Armenia) (యెరవాన్, ఆర్మేనియాలో ఉన్నది)ని 3 నెలలపాటు విజిట్ చేశాను. అక్కడ నాకు సైకమోరు మహా వృక్షాలతో నిండిఉన్న చక్కటి పార్కు దగ్గర ఎపార్టుమెంటు ఇచ్చారు. రోజూ ప్రొద్దున్న ఆ పార్కులో దొర్లింగ్ చేశేవాణ్ణి. ఆర్మేనియా వాళ్ళకు జాగింగ్ కొత్తనుకుంటా. ఎంతో మంది నా దొర్లింగ్ వింతగా చూస్తూండేవారు. కొందరు నన్ను ఆపకుండానే Handshake కి చెయ్యి చాచేవారు. ఒకసారి పార్కు ప్రక్కగా వెళ్తున్న బస్సు డ్రైవరు బస్సును నాకు దగ్గరగా ఆపి, తలుపు తెరచి, అతనూ, లోపల పాసింజెర్లందరూ చప్పట్లు కొట్టారు.

# గోడకుర్చీ, వణుకు

నా చిన్నప్పుడు, తెలుగు ప్రాంతాల్లో పంతుళ్లూ, తల్లిదండ్రులూ, పిల్లలు ఏమైనా చెయ్యకూడని పని చేస్తే వాళ్ళ చేత గోడకుర్చీ వేయించేవారు. ఈ గోడకుర్చీ ***తెలుగు వాళ్ళు కనిపెట్టిందే,*** తెలుగు వాళ్ళకి తప్పించి ఇంకెవ్వరికీ తెలియదు దీన్ని గురించి. చాలా వరకూ దీన్ని వ్యాయామంలా కాక, పిల్లలను క్రమశిక్షణ చెయ్యడానికి వాడేవారు.

For exercise video, visit either of the following websites:

http://www.telugudiaspora.com/telugu_publications_article14.htm

http://www-personal.engin.umich.edu/~murty/

తెలియని వారికి గోడకుర్చీ అంటే ఏమిటో చెప్తాను. గోడకు ఆనుకొని ఒక కుర్చీ ఉందని ఊహించండి. ఆ ఊహాకుర్చీ మీద కూర్చున్న పోజులో శరీరాన్ని పెట్టి, అలానే కొద్దిసేపు ఉంచడాన్ని [illegible] గోడకుర్చీ వెయ్యాల్సి వచ్చేది.



ఒకేపోజులో శరీరాన్ని కొంతసేపు ఉంచడం గనుక గోడకుర్చీని ఒక Static exercise

అనవచ్చు. దీన్నే Dynamic గా మారిస్తే మంచి వ్యాయామం అవుతుందని కనుక్కొని, ఆ వ్యాయామానికి "వణుకు" అని పేరు పెట్టాను.

గోడకుర్చీ గోడకు వీపు ఆనించి చేస్తారు. వణుకు గోడకు దూరంగా ఖాళీ స్థలంలో చెయ్యాలి.

వణుకులో గోడకుర్చీలో లాగానే వంగి కూర్చున్నపోజులో ఉండి, అలా static గా ఉండేబదులు చేతులు జోరుగా ఊపుతూ, తలను హుషారుగా ఆడిస్తూ శరీరాన్నంతా అటూ ఇటూ కదుపుతాను. చలిలో శరీరం వణికినట్లుంది గనుక దీనికి "వణుకు" అని పేరుపెట్టాను. వణుకులో శరీరంలోని internal organs అన్నీ కూడా అటూఇటూ కదులుతాయి కనుక వాటికి కూడా వ్యాయామం కలుగుతుంది.

నేను రోజూ ప్రొద్దున్న దొర్లింగ్ తర్వాత, 5,10 నిమిషాలు వణుకు చేస్తాను. దీనివల్ల కిడ్నీలు, పొట్ట, చిన్న, పెద్దప్రేగులూ, మగవాళ్ళలో ప్రాస్ట్రేట్ గ్లాండూ ఆరోగ్యంగా ఉంటాయని నా నమ్మకం.

విజయవాడ నేను విజిట్ చేశినప్పుడల్లా మా ఇంటికి దగ్గర్లో ఉన్న సిద్ధార్థ కాలేజీ గ్రౌండ్సులో రోజూ ప్రొద్దున్న దొర్లింగ్ కు వెళ్తాను. నేను అక్కడకు వెళ్ళడం మొదలు పెట్టినప్పుడు కొన్నాళ్ళు అక్కడ వ్యాయమాలు చేస్తున్న వాళ్ళంతా నా దొర్లింగ్ వింతగా చూస్తూఉండేవారు. ఒకసారి ఒకాయన మీ దొర్లింగ్ చూడ్డానికి చాలా బాగుందండీ అని మెచ్చుకున్నాడు. ఇంకొకాయన మీ వయస్సెంతండీ అని అడిగాడు. నేను చెప్పాను. "ఈ వయస్సులో అంతజోరు వ్యాయామం శరీరానికి అపాయమండీ, మెల్లగా చెయ్యండి" అని సలహా ఇచ్చాడు.

ఇప్పుడిప్పుడే నాలాగే కొంతమంది తెలుగువాళ్ళు వ్యాయామం వల్ల కలిగే మంచి ఫలితాలు గ్రహించి రోజూ వ్యాయామం చేస్తున్నారు. కానీ చాలమంది తెలుగు దేశస్తులూ, ప్రవాసాంధ్రులూ వ్యాయమం నిర్లక్ష్యం చేస్తారు. వ్యాయామం నిర్లక్ష్యం చెయ్యడం **ఒక తెలుగుదనమని** చెప్పవచ్చు.

కొంతమంది జాగింగ్ చెయ్యడానికి నా మోకాళ్ళు బలహీనమనో, పాదాలు చదుననో ఏవేవో సాకులు చెప్తారు. ఈ సాకులు వింటుంటే నాకు ఒక బూతు తెలుగు సామెత గుర్తుకు వస్తుంది: "దెంగలేక పూకు వంకరన్నాడని" లేక "దెంగలేక ఇవ్వాళ మంగళవారం అన్నాడనీ" అంటారు. ఇలాంటి సామెతే గ్రీకు భాషలో కూడా ఉంది. ఆ సామెత ఆధారంగానే వాళ్ళు

ఇంగ్లీషులో Never on Sunday అనే సినిమా తీసారు.

# 36. ఆరంభశూరత్వం

ఆన్ఆర్బరులో మాఇంటికి దగ్గర్లోనే UM సహోద్యోగి ఒక తెలుగాయన నివసించేవాడు. ఒక సాయంత్రం ఆయన మాఇంటికి వచ్చి "ప్రొద్దున్న మీరు జాగ్ చెయ్యడం చూశాను. నేనింతవరకూ ఎప్పుడూ చెయ్యలేదు కానీ నాకు కూడా జాగింగ్ మొదలెట్టాలని ఉంది. రేపు ప్రొద్దున్నే మొదలుపెడ్తాను, ఏమేమి కావాలో చెప్పండి" అన్నాడు. "మంచి జాగింగ్ షూస్ చాలా అవసరం. అవి లేకుండా చేస్తే కాళ్ళు నొప్పి వేస్తాయి" అని నేను చెప్పాను. అదీకాక, ముందు తక్కువ దూరంతో మొదలు పెట్టి, కొన్ని రోజులు అలవాటయ్యాక నెమ్మదిగా దూరం ఎక్కువ చెయ్యడం మంచిదనీ, ఎంత తక్కువ దూరంతో మొదలు పెట్టినా కొన్నాళ్ళు కాళ్ళు నొప్పివేస్తాయి గానీ, ఆ నొప్పిని సహిస్తూ కొనసాగిస్తే కొన్ని నెలల తర్వాత శరీరానికి అలవాటయ్యి నొప్పులు పోతాయనీకూడా చెప్పాను. దానికి ఆయన "అదేం ఫర్వాలేదు. నేను అన్నింటికీ రెడీగానే ఉన్నాను. నాకు జాగింగ్ షూస్ ని గురించి ఏమి తెలియదు, అనుభవస్థులు గనుక మీరు నన్ను ఇప్పుడే షాపుకి తీసుకు వెళ్ళి వాటిని కొనిపించండి" అన్నాడు. హుటా హుటీగా బయల్దేరి షాపుకి వెళ్ళాము. ఆయన చాలా ఖరీదైన సరికొత్త మోడల్ నైక్ జాగింగ్ షూస్ కొన్నాడు .

మరునాడు 6 A.M. కు నాతో జాగ్ చెయ్యడానికని మా ఇంటికి వచ్చాడు. అరమైలు జాగ్ చేశాక "మొదటి రోజుకి ఇది చాలనుకుంటాను, మళ్ళీ రేపు చూస్తాను", అంటూ వెనక్కు తిరిగాడు.

మరుసటిరోజు ఆయన జాగింగ్ కి రాలేదు. ఆఫీసులో కనపడినప్పుడు అడిగితే "కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకొని తర్వాత మళ్ళీ మొదలు పెడ్తాను" అన్నాడు. దీని తర్వాత ఆయన మళ్ళీ జాగ్ చెయ్యడం చూడలేదు.

ఇలానే ఏదైనా పని ఆర్భాటంగా మొదలుపెట్టి, పూర్తి చెయ్యకుండా మధ్యలోనే వదిలేయ్యడాన్ని "ఆరంభశూరత్వం" అంటారు. ఆరంభశూరత్వం తెలుగువారిలో ***సాధారణంగా చూసే తెలుగుదనం***.

# 37. తెలుగు పేర్ల రామాయణం

పిల్లలకు చాంతాడంత పొడువైన పేర్లు పెట్టడం **ఒక సాధారణ తెలుగుదనం**. నేను పొట్టివాణ్ణైనా నా పేరు "గోపాల కృష్ణ మూర్తి" కొద్దిగా పొడవే.

ఇతరులను హేళన చెయ్యడం ***ఒక ముఖ్యమైన తెలుగుదనం*** కదా. నా చిన్నప్పుడు క్లాసుమేట్లు నా పొట్టి ఎత్తును పొడుగు పేరుతో పోలుస్తూ వెక్కిరించేవారు. భారీగా ఉండే క్లాసుమేట్లు నన్ను చూశినప్పుడల్లా "పిట్ట కొంచెం, పేరు ఘనం" అంటూ ఎగతాళి చేసేవారు.

కానీ చరిత్రలో పేరుగడించిన గొప్పవాళ్ళు చాలామంది పొట్టివాళ్ళే. ఉదాహరణకు అలెగ్జాండర్ ది గ్రేట్, నెపోలియన్ బోనాపార్టే, ఆల్బర్ట్ ఐన్ స్టీన్, వీళ్ళందరూ 62 అంగుళాలకంటే తక్కువ పొడవు గలవాళ్ళే.

భారీ క్లాసుమేట్లు నన్ను అలా ఎగతాళి చేసినప్పుడు "ఒరేయ్, పొట్టివాళ్ళే గొప్పవాళ్ళవుతారురా।" అంటూ దబాయించి వాళ్ళ నోళ్ళు మూయించేవాణ్ణి.

నాకు పెళ్ళి నిశ్చయమయినప్పుడు కలకత్తాలో నా స్నేహితులు " నీ వధువు పేరేమిటోయ్?" అని అడిగారు "సూర్య విజయ లక్ష్మీరత్నం" అని చెప్పితే "అబ్బో పేరే అద్భుతమైన పద్యంలా ఉందోయ్! అమ్మాయి చాలా అందమైనదయ్యుండాలి" అన్నారు.

అమెరికాకు వచ్చాక, సంతకం పెట్టాల్సివచ్చినప్పుడు పొడుగు పేరంతా వ్రాయడం కష్టంగా ఉందని తనపేరును "విజయ"కు మార్చుకుంది మా ఆవిడ.

అమెరికాకువచ్చే తెలుగువారందరికీ తమపేర్లతో ఇంకొక సమస్య ఎదురవుతుంది. తెలుగుదేశంలో ఇంటిపేరు ముందూ, అసలుపేరు తర్వాత వ్రాస్తాం. అమెరికన్ పద్ధతి దీనికి వ్యతిరేకం. అందుకని అమెరికన్లు తమఇంటిపేరుని "చివరిపేరు(Last Name)" అని పిలుస్తారు.

తన పేరును పొట్టిచేసుకున్నప్పుడు మాఆవిడ అమెరికన్ పద్ధతికి అనుగుణంగా "విజయ కట్టా" గా మార్చింది. నా తెలుగుపేరుతో కొన్నిరిసెర్చిపేపర్లు అప్పటికే పబ్లిష్ చేసినందువల్ల నేను నాపేరును మార్చకుండా అలానే ఉంచేశాను. కనుక అమెరికాలో నాకు "మూర్తి" చివరిపేరు, "కట్టా" అసలుపేరుగా వ్యవహరిస్తారు. దీనివల్ల మా ఇద్దరికీ తరచూ ఒక గొప్పసమస్య తగులుతుంది. కొత్తవారిని కలిసినప్పుడు వాళ్ళు మా పేర్లువిని "మీ ఇద్దరి

చివరిపేర్లు వేరుగా ఉన్నాయి, మీరు ఇంకా పెళ్ళి చేసుకోలేదా?" అని అడుగుతుంటారు. అప్పుడు వాళ్ళకి ఒక పొడుగాటివివరణ చెప్పాల్సివస్తుంది. దీన్నే నేను "**తెలుగు పేర్ల రామాయణం**" అంటుంటాను.

అమెరికాలో "జాన్, బాబ్" ల్లాంటి వాడుకలో ఉన్న అసలుపేర్ల సంఖ్య చాలా తక్కువ. కనుక చాలా మందికి అసలుపేర్లు ఒకటే అవుతాయి. అందుకనే పేరుని ఫైలు చేసినప్పుడు తప్పనిసరిగా చివరిపేరు క్రిందే ఫైలు చేస్తారు. కనుక Bob Smith అనే వ్యక్తిపేరు ఫైలులో Smith, Bob అని ఉంటుంది. అందుకనే, అమెరికన్ పద్ధతికన్నా, ఇంటిపేరు ముందూ, అసలుపేరు తర్వాత వ్రాసే తెలుగు పద్ధతే ఎంతోమంచిదని నేననుకుంటాను.

నేను హైస్కూల్ లో చదువుకుంటున్నప్పుడు తెలుగుపేర్లలో ఇంకోవింత విన్నాను. నా క్లాసుమేటు ఒకతను తనపేరు "గరికయ్య" అని చెప్పాడు. "గరిక అంటే గడ్డిగదా, నీకు గొప్ప గొప్ప దేవుళ్ళ పేర్లు పెట్టక, తక్కువ విలువగల గడ్డిపేరు ఎందుకు పెట్టారు?" అని అడిగాను. దానికి అతను ఇలా చెప్పాడు: వాళ్ళ అమ్మ ఇతనికి ముందు ఐదుగురు పిల్లల్ని కన్నదట. అందరికీ దేవుళ్ళపేర్లు పెట్టారట. కానీ ఆ పిల్లలందరూ సంవత్సరం వయస్సురాకముందే చనిపోయారట. దేవుళ్ళపేర్లు అచ్చిరావడంలేదని, ఇతను పుట్టినప్పుడు విలువ తక్కువైన గడ్డిపోచమీద "గరికయ్య" అనిపెట్టారట! అదృష్టవశాత్తూ ఇతను ఆరోగ్యంగానే పెరిగి పెద్దవాడయ్యాడు.

అదే క్లాసులో ఇంకొక క్లాసుమేటు పేరు "మురళీ గోపాలకృష్ణ వెంకట శివప్రసాద్". ఇలా, తల్లీ, తండ్రీ, తాతలూ, అమ్మమ్మ, నానమ్మల వేరు వేరు ఇష్టదేవతల పేర్లన్నీ ఒక దండలా గుచ్చి తయారు చేసిన పొడుగాటి పేర్లను పిల్లలకు పెట్టడం ***ఒక వింత తెలుగుదనం.*** దీన్నిగురించి ఇంటర్నెట్ మీద చూశిన ఒక జోక్ చెప్తాను :

ఒక తెలుగబ్బాయి పైచదువుకని ఇంగ్లండు వెళ్ళడానికి విమానప్రయాణం చేస్తున్నాడు. పక్కసీటులో చాలాఖరీదైన సూట్ లో ఒక తెల్లాయన కూర్చొని ఉన్నాడు. తెలుగబ్బాయి ఆయనను పలకరించాడు. సంభాషణ ఇలా సాగింది :

తెలుగబ్బాయి : తమరూ ఇంగ్లండు వెళ్ళుతున్నారనుకుంటా. తమరి పేరు
చెప్పగలరా ?

తెల్లాయన (గర్వంతో, అబ్బాయిని చిన్నచూపుచూస్తూ)

నేను బాండ్

జేమ్స్ బాండ్ !

నీపేరేమిటో చెప్పవోయ్ కుర్రోడా.

తెలుగబ్బాయి (విప్పారిన నవ్వుముఖంతో):

నేను సాయి

వెంకట సాయి

శివ వెంకట సాయి

లక్ష్మీనారాయణ శివ వెంకట సాయి

శ్రీనివాసుల లక్ష్మీనారాయణ శివ వెంకట సాయి

రాజశేఖర శ్రీనివాసుల లక్ష్మీనారాయణ శివ వెంకట సాయి

సీతారామాంజనేయుల రాజశేఖర శ్రీనివాసుల ...........

అప్పటికే బాండ్ మూర్ఛపోయాడు !

దీని తరువాత ఏవరైనా తన పేరు అడిగితే, బాండు ఒకగుక్కలో "జేమ్సుబాండ్" అని చెప్పడం నేర్చుకొన్నాడు.

# 38. ఇండియాలో అన్నిచోట్లా కనిపించే జుగుప్సాకరమైన కాలుష్యం

ఇండియాలో ఇప్పటికీ మెజారిటీ ప్రజలు కాలకృత్యాలు చేసుకునే పద్ధతి అనాదినుంచీ మారలేదు. కాలకృత్యాలు చెయ్యడం ఎవ్వరూ చూడకుండా గోప్యంగా చెయ్యాలని కోరుకోవడం మానవనైజం. 150 సంవత్సరాల క్రితం జనాభా బాగా తక్కువ ఉండడం చేత, కాలకృత్యాలు చేసుకోవడానికి మానవసంచారం లేని ప్రదేశాలు ఎక్కడబడితే అక్కడే ఉండేవి. మన పద్ధతులు ఆ పరిస్థితులకు చక్కగా సరిపోయాయి.

కానీ ఇప్పుడు జనాభా విపరీతంగా పెరిగిపోవడం మూలాన అన్నిచోట్ల, అన్ని కాలాల్లోనూ మానవసంచారం ఉంటోంది. కనుక మెజారిటీ ప్రజలకు గోప్యంగా ఉండే ప్రదేశం

దొరకడం దుర్లభం అయిపోయింది.

అయినా ఇంకేమీ చెయ్యడానకి లేక, ఈ పనులు మన దేశ ప్రజలు అనాది పద్ధతుల్లోనే, బహిరంగంగా చేస్తున్నారు. వీటిని చూడడం జుగుప్స కల్గిస్తుంది.

ఇతరదేశాలనుంచి ఇండియా చూద్దామనే కుతూహలంతో వచ్చిన ప్రయాణీకులకు ఈ పద్ధతుల దర్శనం కలిగి వారికి ఏహ్యం కలుగుతోంది. దీనివల్ల విదేశాల నుంచి ఇండియాకి వచ్చే టూరిస్టుల సంఖ్య చాలా తగ్గిపోయింది. మిగతా రాష్ట్రాల కన్నా ఆంధ్రరాష్ట్రానికి వచ్చే విదేశీ టూరిస్టుల సంఖ్య మరీ తగ్గిపోయింది. ఇప్పుడు తెలుగుదేశంలో విదేశీ టూరిస్టులు ఒక్క పుట్టపర్తిలోనే కనపడ్తారు. మిగతా చోట్ల వాళ్లు కనపడడం చాలా అరుదు.

కాలకృత్యాలు బహిరంగ ప్రదేశంలో అందరిముందూ చేసుకోవడం ***సిగ్గుపడవలసిన తెలుగుదనం, భారతీయదనం.***

ఇదీకాక ఇండియాలో చాలా నగరాల్లో జుగుప్స కల్గించే చెత్తకుప్పలు చాలచోట్ల కన్పిస్తాయి. జనాభా బాగా తక్కువగా ఉన్నప్పుడు చెత్త తక్కువ ఉండి దాన్ని గురించి తెలిశేది కాదు. జనాభా పెరగడంతో Eyesoreగా తయారవుతోంది.

ఇతరదేశాలు చెత్తను నగరం నుంచి తీసుకుపోయి దూరమైన చోట పాతిపెట్టే పద్ధతులు వాడుతున్నారు. ఇండియాలో ఈ పద్ధతులు ఇంకా సరిగారాలేదు. అందువల్ల మన నగరాలు చూసేవారికి రోతను కల్గిస్తున్నాయి. ఇతరదేశాల్లో నగరాలు, గ్రామాలు శుభ్రంగా కనిపిస్తాయి. ఇండియాలో ఇంత శుభ్రంగా కనపడే నగరాలు చాలా కొద్ది.

ఇండియా ప్రజలు ఇతరదేశస్థుల కన్నా కాలుష్యం ఎక్కువ ఉత్పత్తి చేస్తారనుకోవడం తప్పు. కాలుష్యం ఉత్పత్తి చెయ్యడంలో ఇతరదేశస్తులు ఇండియా ప్రజలకు ఏమీ తీసిపోలేదు. కానీ వాళ్ళకు వారి కాలుష్యం బహిరంగంగా ప్రదర్శించుకోవడం సిగ్గు గనుక, దాన్ని కంటికి కనిపించకుండా దాచేశే పద్ధతి అవలంభిస్తారు. ఇండియాలో ఇంకా కాలుష్యం ప్రదర్శించుకోవడంలో ప్రజలకు సిగ్గురాలేదు, అందుకనే మన నగరాలు అశుభ్రంగా కనిపిస్తాయి. ***ఇది సిగ్గుపడాల్సిన భారతీయదనం.***

ప్రస్తుతం జనాభా పెరుగుదలతో ప్రపంచమంతా అన్ని రకాల కాలుష్యాలు పెరిగిపోతున్నాయి. అభివృద్ధి చెందిన ధనిక దేశాలు ఆ కాలుష్యాలను కంటికి కనిపించకుండా ఎలా, ఎక్కడ దాచిపెట్టాలనే అంశాలమీద కృషి చేస్తున్నారు గానీ, కాలుష్యానికి మూలకారణాలను నిర్మూలించడానికి ఏమీ కృషి చెయ్యడం లేదు.

కాలుష్యం తగ్గాలంటే మానవ జనాభా తగ్గాలి, మానవజీవనవిధానం తక్కువ కాలుష్యం ఉత్పత్తి చేశే జీవనవిధానానికి మారాలి. ఈ రెండు అంశాలలో దేనినైనా అమలు పర్చడానికి అన్ని జాతుల మనుష్యులు విముఖంగా ఉన్నారు.

కాలుష్యం ఉత్పత్తి చెయ్యడం ***ఒక సాధారణ మానవదనం.***

# 39. నంజుకోవడానికి రకరకాల పొడులు వాడడం

ఇడ్లీలు నంజుకొనితినడానికి మా అమ్మ పసుపుపచ్చరంగులో ఉండే పప్పొడుం చేశేది. ఆ పొడిలో కొద్దిగా నెయ్యికలిపి గుజ్జుగా చేశి దాన్ని నంజుకుంటూ ఇడ్లీలు తినడం నాకు చాలా ఇష్టమయ్యేది. పై చదువుకి మద్రాసు వెళ్ళినప్పుడు తమిళయన్లు కూడా ఇలాంటి పొడి తింటారని తెలుసుకున్నాను. కానీ వాళ్ళు దాంట్లో కారం కొద్దిగా ఎక్కువవేశి "గన్ పౌడర్" అని పిలుస్తారు.

నా చిన్నప్పుడు లివర్ సమస్యవల్ల నాకు అప్పుడప్పుడూ కడుపునొప్పి వచ్చేది. అలా నొప్పివచ్చినప్పుడు మాఅమ్మ బాగా ఉడికించి గుజ్జగాచేశిన అన్నాన్ని రెండురకాల పొడులు (కరివేపకుకారం, పుదేనా పొడి) కలుపుకొని తినమనేది.

మాఅమ్మ మాటమీద నాకు మంచి గురి, అందుకే అవి తిన్నాక కడుపు నొప్పి పోయినట్లనిపించేది. ఇలానే కరివేపకుకారం, పుదేనా పొడి కడుపునొప్పినేకాదు, తలనొప్పి, జ్వరం, పడిశం మొదలైన ఆరోగ్యసమస్యలనన్నిటినీ నయంచేస్తుందని తెలుగువారు చాలా మంది నమ్ముతారు.

నా చిన్నప్పుడు మాఇంట్లో తరచుగావాడిన ఇంకొకపొడి చింతాకు పొడి. దీన్నిగురించి చెప్పేముందు చింతచెట్లను గురించి కొద్దిగా మాట్లాడుతాను. వసంతకాలం మొదట్లో చింతచెట్టు చాలా విరివిగా చిగురిస్తుంది. చింతచిగురు పుల్లటి రుచితో చాలా కమ్మగా ఉంటుంది. చింతచిగురుపప్పు చాలా అద్భుతమైన రుచిగా ఉంటుంది. నా చిన్నతనంలో వసంతకాలంలో గంపలుగంపలు చింతచిగురు కూరగాయల మార్కెట్టులో లభించేది. ఈరోజుల్లో మార్కెట్టులో చింతచిగురు చూడడం చాలా అరుదనుకోండి. దీనికి ముఖ్యకారణాలు: పెరిగిపోతున్న మానవజనాభా చింతచెట్లను విపరీతంగా కొట్టివెయ్యడం, ప్రజానీకం రుచులు మారడం.

మా నివాసం విజయవాడకు మారిన మొదట్లో ఏలూరు రోడ్డు కిరువైపులా పెద్దపెద్ద చింతచెట్లు ఎంతో ఆహ్లాదకరంగా ఉండేవి. కాలినడకన వెళ్ళేవారిని వాటినీడతో ఎండనుంచి

రక్షించేవి ఈ చెట్లు. వాటిపైన ఎల్లప్పుడూ కిచకిచమని శబ్దం చేశే పిట్టలు ఎన్నో నివసించేవి. పిట్టల కిచకిచలు వింటూ ఆ చెట్లనీడలో నడవడం నాకెంతో ఇష్టంగా ఉండేది.

వసంతకాలంలో ప్రతిచెట్టు పైకొమ్మల మీదా కూర్చొని గంపల్లోకి చిగురు కోస్తుండే మనుష్యులను చూశేవాణ్ణి.

వీళ్ళు ఇలా దయాదాక్షిణ్యం ఏమి లేకుండా చెట్టుకి వచ్చిన ప్రతి చిగుర్ని తుంచివేస్తుంటే చెట్లు బ్రతకగలవా అనే అనుమానం నన్ను పీడించేది.

పైచదువుకు ఇతరప్రాంతాలు వెళ్ళాక, శెలవలకు ఇంటికి వచ్చినప్పుడల్లా, నేను భయపడినట్లే ఏలూరు రోడ్డు కిరువైపులా ఉండే చింతమానులు ఒక్కొక్కటీ మాయమవ్వడం గమనించాను. ఇప్పుడు విజయవాడకు దగ్గర్లో మీరు భూతద్దం పెట్టి వెదకినా ఒక్క చింతచెట్టు కూడా కనపడదు. ప్రకృతిమీద ఆసక్తిగల నాలాంటి వ్యక్తులకు ఇది చాలా మనోవ్యధ కల్గిస్తుంది.

మా ఇంట్లో తరచూవాడిన "చింతాకుపొడి" ఎండించిన చింతాకుతో మా అమ్మ చేశేది. దాన్ని అన్నంలో కలుపుకొని నెయ్యితో కలిపి తినడం మానాన్నగారికి, నాకూ చాలా ఇష్టంగా ఉండేది.

ఇంతవరకూ చెప్పుకున్న పొడిలే కాక, ధనియాలకారం, నువ్వుపొడి మొదలైన ***రకరకాల పొడులు ఆప్యాయంగా తినడం ఒక తెలుగుదనం***. ఒక్క తెలుగువారే కాదు, దక్షిణభారత ప్రజలందరూ ఇలాంటి ఎన్నోరకాల పొడులు ఆప్యాయంగా తింటుంటారు. దక్షిణభారతీయులను తప్పించి, ఇతర జాతి ప్రజలెవ్వరూ ఇలా పొడులు తినడం నేను చూడలేదు. కనుక ఇలా ***పొడులు తినడం ముఖ్యమైన దక్షిణభారతీయదనం*** అని చెప్పుకోవచ్చు.

# 40. శకునాలను చాలా పట్టింపుతో గమనించడం

## శకునాలు

తెలుగువారికి శకునాల మీద గొప్పనమ్మకం.

దూరప్రయాణాలకు బయల్దేరే ముందుగానీ, ముఖ్యమైన పని, ప్రాజెక్టు మొదలు పెట్టడానికి వెళ్ళేటప్పుడుగానీ, ఒక ముత్తైదువ లేక పెళ్ళికాని పడుచుకన్య ఎదురురావడం

చాలామంచి శకునమని నమ్ముతారు. ఈరోజుల్లో కావిళ్లలో నీళ్ళబిందెలు ఎవ్వరూ మోసుకెళ్ళడం లేదు గానీ, నా చిన్నతనంలో నీళ్ళకావిళ్ళు మోసుకెళ్ళేవారు తరచూ కన్పించేవారు. అలాంటి నీళ్ళకావిళ్ళు ఎదురురావడం గూడా చాలామంచి శకునం అనుకునేవారు. ఇలాంటి మంచిశకునాలు ఎదురయితే బయలుదేరిన ప్రయాణం సుఖంగా జరుగుతుందనీ, వెళ్ళినపని సఫలీకృతం అవుతుందనీ తెలుగువారికి గట్టినమ్మకం. ఇవికాక, ఒక విధివస్త్రీ గానీ, పిల్లలు లేని గొడ్రాలుస్త్రీ కానీ, లేక ఒక పిల్లి (ముఖ్యంగా నల్లపిల్లి) ఎదురురావడం చాలా చెడ్డ శకునమని నమ్ముతారు. అలానే ఆ సమయంలో అక్కడున్నవారు ఎవరైనా తుమ్మితే చాలా చెడ్డశకునమని పరిగణిస్తారు. ఇలాంటి చెడ్డ శకునాలు తటస్థపడితే, ప్రయాణంలో ఏదో ఘోరప్రమాదం జరగవచ్చనీ, లేక చెయ్యబోయేపని విఫలమవుతుందనీ నమ్మి బయలుదేరడం, పనిమొదలు పెట్టడం కనీసం కొద్దిసేపైనా వాయిదా వేస్తారు.

అందుకనే ముఖ్యమైన పనులకు బయలుదేరేటప్పుడు, తమకు ఎదురుగారమ్మని ఒక ముత్తైదువగానీ, పడుచుకన్యనుగానీ ముందు పంపిస్తుంటారు.

## ముహూర్తాలు

ముఖ్యమైన పనులూ, ప్రయాణాలూ మొదలు పెట్టడానికి మంగళప్రదమైన సుముహుర్తం నిశ్చయించడం ***తెలుగువారు తప్పకుండా పాటించే ఒక ఆచారం.***

పెళ్ళిలో వరుడు వధువుకి మంగళసూత్రధారణ చెయ్యడానికి నిశ్చయించిన సమయాన్ని సాధారణంగా ముహుర్తం లేక లగ్నం అని పిలుస్తారు. ఈ లగ్నసమయం ఆ వధూవరుల సంసార జీవితానికి నాందిగా పరిగణించబడుతుంది. లగ్నానికి మంచి సమయనిశ్చయం జరిగితే, వధూవరుల సంసారజీవితం ఒడుదుకులు లేకుండా సుఖవంతంగా మూడుపువ్వులూ ఆరుకాయలుగా సాగుతుందని తెలుగువారి నమ్మకం.

ఇలాంటి ముఖ్యమైనపనులు మొదలుపెట్టడానికి వర్జకాలం, రాహుకాలం, అష్టమి, నవమి, అమావాస్య దినాలు చెడ్డ సమయాలనీ, ఏకాదశి, పూర్ణిమలాంటి రోజులు మంచిరోజులనీ సర్వసాధారణంగా తెలుగువారు నమ్ముతారు. మంచి ముహూర్తాలు నిశ్చయించడానికి పురాతనం నుంచి వస్తున్న అనుభవంతో గాబోలు బోలెడు రూల్సు నిర్ణయించారు. ఈ రూల్సనిటినీ జాగ్రత్తగా నేర్చుకొని ముహూర్తాలు నిశ్చయించడంలో ప్రావీణ్యంగల వారిని "సిద్ధాంతి" అని పిలుస్తారు. గుళ్ళలో పూజారిలకు గూడా ఈ ప్రావీణ్యం

ఉంటుంది. ముహూర్తాలు నిశ్చయించడానికి తెలుగు కుటుంబాలు వారికి నచ్చిన సిద్ధాంతినో, పూజారినో, లేక పాండిత్యవంతులైన స్నేహితులనో సంప్రదిస్తుంటారు.

తెలుగు జీవితాలలో లగ్నాల ప్రాముఖ్యాన్ని వివరించడానికి మా దగ్గరబంధువుల్లో నా చిన్నప్పుడు జరిగిన ఒక విచారకరమైన ఉదంతాన్ని చెప్తాను. మా మామయ్య ఒకాయన పెళ్ళిచేసుకోడానికి ఎందుకనో విముఖంగా ఉండేవాడు. కాలం గడిచిపోతుంది. మామయ్య పెద్దవాడయిపోతున్నాడు, అందుకని వాళ్ళనాన్న ఒక సంబంధం చూశి మామయ్యను బలవంతం చేశి పెళ్ళికి ఒప్పించాడు. ఒక సిద్ధాంతి గారిని పెళ్ళికి లగ్నం పెట్టమని అడిగితే ఆయన పెళ్ళిళ్ళకు చెడ్డకాలం వచ్చేస్తోందనీ, ఆరు నెలలాగితే మంచి లగ్నాలు లభిస్తాయని చెప్పారట. కానీ అంత కాలం పెళ్ళి వాయిదావేస్తే మామయ్య మళ్ళీ పెళ్ళి ఒద్దని మారాం చేస్తాడని భయపడి, తాతయ్య ఇంకొక సిద్ధాంతి సహాయంతో చెడ్డకాలం మొదలయ్యేముందు, అంత గొప్పది కాకపోయినా సరిపోయే ఒక లగ్నంలో పెళ్ళి జరిపించేశి, వధువుని కాపురానికి వరుడితో పంపించారు. మేము నివసించే బందరుకి దూరంగా ఉండేవాడు మామయ్య, అందుకని ఆ దంపతులని మేము ఎప్పుడూ విజిట్ చెయ్యలేదు కానీ, మా ఇంటికి వస్తూపోతూ ఉండే ఇతర బంధువులు ఆ దంపతుల నూతన దాంపత్య విషయాలు మా అమ్మ నాన్నలతో చిలవలు పలువలుగా చర్చించేవారు. చిన్నతనం మూలాన వాళ్ళు మాట్లాడుకునే విషయాలు నాకు పూర్తిగా అర్థంకాలేదు గానీ, అత్తమ్మ మామయ్య మాట వినదనీ, తరచూ ఆయనకు చెప్పకుండా ఎక్కడికో వెళ్తోందనీ అర్థం అయ్యింది. సంగతేమిటని మా అమ్మను అడిగితే, అత్తమ్మ స్త్రీలు వెళ్ళకూడని చోట్లకు ఎక్కడికో వెళ్తోందట అని చెప్పి, "అయినా ఇదంతా పిల్లలు వినకూడదు, ఇది పెద్దవాళ్ళ విషయం" అంటూ కోప్పడేది.

కొన్ని నెలల తర్వాత వచ్చిన ఇంకొక బంధువు, అత్తమ్మ మామయ్యను వదిలేశి ఎక్కడికో వెళ్ళిపోయిందనే వార్త మోసుకు వచ్చాడు. ఈ వార్త విన్నప్పుడు మా తాతయ్య మొదట సంప్రదించిన సిద్ధాంతి ఇలా అన్నాడుట "నేను చెప్పాను గదండీ ఆ సమయంలో మంచి లగ్నాలు లేవనీ. నా మాట వినకుండా దుష్టలగ్నంలో పెళ్ళి జరిపించేశారు. అందువల్లనే వీళ్ళదాంపత్యం ఇలా దాపురించింది. ఆ చెడ్డకాలం అయిపోయంతవరకూ ఆగి, శుభలగ్నంలో వివాహం జరిపించి ఉంటే, ఈ దంపతులు ఇప్పుడు అన్యోన్యంగా చిలకా గోరింకల్లాగా కలిశి ఉండేవారు!.

చేశినపని ఏదైనా కోరుకున్నట్లు జరగకపోతే అది ఆ పని మొదలు పెట్టిన ముహూర్తం

చెడ్డదవడం వల్లనే జరిగిందని మనస్సు ఊరడింపు చేసుకోవడం ***ఒక తెలుగులక్షణం.***

మొత్తానికి శకునాలను పట్టింపుగా గమనించడం, ముఖ్యమైన పనులు మొదలు పెట్టడానికి మంచి ముహూర్తాలు దానికి పాండిత్యం గల వారి సహాయంతో నిశ్చయించుకోవడం, ***ఇప్పటికీ సాగుతున్న ఒక విశిష్ట తెలుగుదనం.***

# చివరిమాటలు

నాకు గుర్తున్న కొన్ని మానవప్రవర్తనకు సంబంధించిన అనుభవాలను గురించి వ్రాశాను. ఇప్పుడు ప్రయాణ సౌకర్యాలు బాగా అభివృద్ధి చెందడం మూలాన అన్ని జాతులూ కలిశిపోతున్నారు. కనుక దీంట్లో చెప్పిన ప్రవర్తనలు ప్రత్యేకం తెలుగు వాళ్ళవని చెప్పలేము. అదీ కాక షుమారు 7 కోట్ల మంది పైన ఉన్న తెలుగుజాతి అంతా ఒకే మూసలో ఇరకరు గదా.

కానీ దీంట్లో వర్ణించిన ప్రవర్తనలలాంటివి తెలుగు జాతిలో మీరే చూశి ఉండవచ్చు.

మానవస్వభావాన్ని పరిశీలించడం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. నేను చూశిన కొన్ని స్వభావాలను గురించి చర్చించాను. ఈ క్రిందివారికి: భాస్కర్ తీగెల (వ్యాసం వ్రాయమని ప్రోత్సహించినందుకు మరియు టైపు చేయించినందుకు, బొమ్మలు గీయించినందుకు), శ్రీరామమూర్తి కట్టా (కొన్ని సెక్షన్లు టైపు చేయించినందుకు), సత్యన్నారాయణ పమర్తి (నేను మర్చిపోయిన కొన్ని తెలుగుదనాలు గుర్తు చేశినందుకు), కృష్ణప్రియ మావూరి (వీడియో కెమేరా పనికి), గీతా బండ్ల (వీడియోలో ఆడియోకి), Eyvind Claxton (వీడియో క్లిప్పు చేసినందుకు), మురళీకృష్ణ నందుల (web conversion) ముఖ్య ధన్యవాదాలు. ఇంకా ఎంతో మంది ఎన్నో విధాల సహాయం చేశారు. వీరందరికీ ధన్యవాదాలిస్తూ శెలవు తీసుకుంటాను.

కట్టామూర్తి